పద్నాలుగు వందల
నలభై రెండు నిమిషాలు
రూ॥100/- పేజీలు:96

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 195 | శుక్రవారం | 03-01-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


## మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ‘సావిత్రి బాయి పూలే’ జయంతి

సంఘ సంస్కర్త, ఉపాధ్యాయురాలు ‘సావిత్రి భాయిపూలే’ జయంతిని ఇక నుంచి ప్రతి ఏటా మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా శుక్రవారం సావిత్రిభాయిపూలే జయంతిని అధికారికంగామహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ఫార్ములా ఈ - కార్ రేసు కేసు
# నిందితులకు ‘ఇడి’ మరోసారి నోటీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఈ –కార్ రేసు కేసులో డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. గురువారం ఇడి అధికారుల ముందు విచారణకు హాజరుకావాల్సిన నిందితుల్లో ఒకరైన హెచ్‌ఎండిఎ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్‌ఎన్ రెడ్డి గైర్హాజరయ్యారు. విచారణకు వచ్చేందుకు తనకు కొంత సమయం కావాలని ఇడి అధికారులకు అతను మెయిల్ పెట్టారు. అయితే ఇందుకు స్పందించిన ఇడి అధికారులు బిఎల్‌ఎన్‌రెడ్డికి తాజాగా మరో నోటీసు జారీ చేశారు . ఈ నెల 8,9 తేదీల్లో తప్పకుండా విచారణకు హాజరుకావాలని ఇడి అధికారులు నోటీసులో పేర్కొన్నారు.ఇదిలా ఉండగా. 2న బిఎల్‌ఎన్ రెడ్డి, 3న అరవింద్ కుమార్, జనవరి 7న కెటిఆర్‌ను విచారించాలని ఇడి ప్లాన్ చేసిన విషయం తెలిసిందే.ఈనెల 8,9 తేదీల్లో విచారణకు తప్పనిసరిగా రావాలని కోరింది. మరోవైపు నేడు అరవింద్ కుమార్, ఈ నెల 7న కెటిఆర్ విచారణకు హాజరవుతారా అనేది చర్చకు దారి తీసింది.

## ప్రశాంతంగా ‘టెట్’

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ అర్హత టెట్ (టిజి టెట్ ) పరీక్షలు మొదటి రోజు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 9 గంటలకు జరిగిన పేపర్ 2 సోషల్ స్టడీస్ పరీక్షకు 72.25 శాతం మంది హాజరవ్వగా మధ్యాహ్నం 2 గంటలకు జరిగిన పరీక్షకు 75.68 శాతం మంది హాజరయ్యారు. టెట్ పరీక్షలు ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మొదటి పరీక్షకు మొత్తం 12,815 మంది అభ్యర్థులకుగాను 9259 మంది మాత్రమే హాజరవ్వగా, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 12,734 మంది అభ్యర్థులకు గాను 9637 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు.



## 5 నుంచి 7 వరకు
# రైతు భరోసాకు దరఖాస్తులు ?

- 4వ తేదిన జరిగే మంత్రివర్గంలో తుది నిర్ణయం
- సాగుచేసిన ప్రతి రైతుకూ రైతు భరోసా ఇవ్వాలని క్యాబినేట్ సబ్ కమిటీ సూత్రప్రాయ అభిప్రాయం
- దరఖాస్తుల స్వీకరణ తర్వాత ఫీల్డ్ సర్వే

ప్రజాపక్షం/హైదరాబాద్ :



రైతు భరోసా అమలుకు మరో ముందడుగు పడింది. సంక్రాంతి నుంచి రైతు ఖాతాలలో డబ్బులను జమ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో గురువారం రైతు భరోసాపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సచివాలయంలో సమావేశమైంది.సబ్ కమిటీ చైర్మన్ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు పాల్గొన్నారు. పంట వేసిన ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని క్యాబినెట్ సబ్ కమిటీ సూత్రప్రాయంగా అభిప్రాయపడింది. ఈ నెల 4న మంత్రివర్గ సమావేశం జరగనుండడంతో ఈ అభిప్రాయాన్ని మంత్రివర్గం ముందు పెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. రైతు భరోసాకు మరోసారి రైతులను నుంచి దరఖాస్తులను స్వీకరించాలని, రైతు భరోసాపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఒక మండలాన్ని మూడు విభాగాలుగా చేసి 5,6,7 తేదీల్లో ప్రజాపాలనలో భాగంగా గ్రామ సభలు నిర్వహించి.. రైతు భరోసా కోసం దరఖాస్తులు ఆహ్వానించాలని అభిప్రాయ పడినట్లు సమాచారం. రైతు బంధులా కాకుండా నిజమైన రైతులకు సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా కింద పంట పెట్టుబడి సహాయం అందించాలని నిర్ణయించిన ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ తర్వాత అధికారులు ఫీల్డ్ తరువాయి 2లో

# క్షమాపణ చాలదు

## రాజీనామా చేయాల్సిందే...

మణిపూర్ ముఖ్యమంత్రికి సిపిఐ డిమాండ్

బాధ్యతాయుత పాలనలో బైరెన్‌సింగ్‌ది ఘోరవైఫల్యం





ఇంఫాల్ : మణిపూర్‌లో ఏడాదిన్నర కాలంగా జరుగుతున్న మారణహోమానికి ఆ రాష్ట్రముఖ్యమంత్రి క్షమాపణచెప్పి ఊరుకుంటే సరిపోదని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) స్పష్టం చేసింది. ప్రజలే కేంద్ర బిందువుగనుక తిరిగి వారిని ఆశ్రయించేందుకు వీలు కల్పించడంకోసం ఆయన రాజీనామా చేయక తప్పదని సిపిఐ డిమాండ్ చేసింది. ఈశాన్య ప్రాంత రాష్ట్రం మణిపూర్‌లో జాతులమధ్య జరుగుతున్న హింసాత్మక పోరాటాన్ని అదుపుచేయడంలో బైరెన్‌సింగ్ ప్రభుత్వం విఫలమైందని సిపిఐ ఒక ప్రకటనలో గురువారంనాడు విమర్శించింది. ఆ రాష్ట్రంలో పూర్తిగా ప్రభుత్వం విఫలమైందనడానికి అక్కడి పరిస్థితులే అద్దంపడుతున్నాయని పేర్కొంది. ‘శాంతి భద్రతలు కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది, పౌరులకు ఎంతమాత్రం రక్షణ ఇవ్వడంలేదు, వారికి న్యాయం జరగడంలేదు, ఈ కారణంగానే ప్రజలకు అభద్రత, తీవ్ర కష్టాలు వాటిల్లాయి, ముఖ్యమంత్రిగా ఉండి ప్రజలకు బైరెన్‌సింగ్ క్షమాపణ చెప్పారంటే అది ఆ రాష్ట్రంలో నెలకొన్న సంక్షోభం తీవ్రతను స్పష్టం చేస్తోం ది, మణిపూర్ ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్ళు, సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని స్పష్టంగా తేలిపోయింది’ అని సిపిఐ విమర్శించింది. ఆత్మపరిశీలన చేసుకుని, తప్పులు సరిదిద్దుకుని అర్థవంతమైన దిద్దుబాటు చర్యలు తీసుకోవడంలో కూడా ముఖ్యమంత్రి బైరెన్‌సింగ్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది’ అని సిపిఐ విమర్శించింది.‘జాతులమధ్య చర్చల ను ప్రోత్సహించే ఎలాంటి నిర్మాణాత్మక చర్యలనూ ప్రభుత్వం తీసుకోలేదు, ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభంవల్ల సామాజికంగా ఏర్పడిన లోతైన గాయాన్ని మాన్పేందుకు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు, సమస్య పరిష్కారానికి బైరెన్‌సింగ్ ప్రభు త్వం ఎంతమాత్రం సుముఖత వ్యక్తం చేయడంలేదు, వివిధ జాతులమధ్య చర్చలకు వీలుగా ఆయా ప్రతినిధులను పరిగణనలోకి తీసుకుని సమగ్ర రాజకీయ పరిష్కారం సాధించేందుకు, అందులో వారిని భాగస్వాములను చేసేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయడంలేదు. అందువల్ల ముఖ్యమంత్రి పదవిలో కూర్చుని నూతన సంవత్సరారంభంరోజున బైరెన్ సింగ్ ప్రజలకు క్షమాపణ చెప్పినంతమాత్రాన సరిపోదు, ఆయన ది క్రియారాహిత్యం, పదవికి రాజీనామా చేయాల్సిందే’’ అని భారత కమ్యూనిస్టుపార్టీ డిమాండ్ చేసింది. ‘ప్రధానమంత్రి నరేంద్రమోదీ కల్లోలిత మణిపూర్ రాష్ట్రంలో పర్యటించేందుకు సుముఖ వ్యక్తం చేయడంలేదు, పర్యటన చేయమని చేస్తున్న విజ్ఞప్తులను పదే పదే తిరస్కరిస్తున్నారు. పర్యటించి ప్రత్యక్షంగా పరిస్థితులు చూసి సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఇష్టపడటంలేదంటే మణిపూర్ ప్రజలపట్ల ఎంతమాత్రం పట్టింపు, ఆందోళన లేదన్న విషయం స్పష్టం అవుతున్నది’’ అని సిపిఐ విమర్శించింది. ‘‘మణిపూర్ రాష్ట్ర ప్రజలకు బాధ్యతాయుతమైన, దృఢమైన, జవాబుదారీతో కూడిన పరిపాలన అందించాలి, అందుకు మణిపూర్ ప్రజలు సంపూర్ణంగా అర్హులు, కానీ అలాంటి జవాబుదారీ ప్రభుత్వాన్ని అందించడంలో బైరెన్‌సింగ్ ఘోరంగా విఫలమయ్యారు’’ అని సిపిఐ తరువాయి 2లో



## సిఎంఆర్ కాలేజి హాస్టల్ బాత్రూమ్‌లో
# దృశ్యాల చిత్రీకరణ

- భగ్గుమన్న విద్యార్థినులు
- రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్
- పోలీసుల అదుపులో ఐదుగురు అనుమానితులు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి విద్యాసంస్థల్లో ఒకటైన సిఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల వార్తల్లోకి ఎక్కింది. విద్యార్థినుల హాస్టల్ గదుల్లో వీడియోల చిత్రీకరణ వ్యవహారం వెలుగులోకి రావడం సంచలనం సృష్టించింది. మేడ్చల్‌లోని సిఎంఆర్ ఐటి కళాశాల మహిళా హాస్టల్‌లోని బాత్రూమ్‌లో తాము స్నానాలు చేస్తుండగా వెనక భాగాన ఉన్న ఓ వెంటిలేటర్ ద్వారా అపరిచితులు వీడియోలు చిత్రీకరిస్తున్నారంటూ ఒక విద్యార్థిని తన స్నేహితులకు తెలియజేయటంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. అక్కడ తచ్చాడుతున్న ఓ వ్యక్తి కదలికలను తాను గమనించానని




ఆ విద్యార్థిని తన స్నేహితులకు వెల్లడించడంతో ఆందోళనకు దారితీసింది. మంగళవారం రాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థినులంతా ఈవెంట్ పూర్తి చేసుకొని తమ తమ గదులకు రాత్రి ఒంటి గంట సమయంలో వచ్చారు. స్నానం చేస్తున్న సమయంలో ఒక గుర్తుతెలియన వ్యక్తి వీడియో చిత్రీకరిస్తున్నది గమనించిన విద్యార్థిని తన తోటి విద్యార్థినులకు తెలియజేసింది. దీంతో వారంతా హాస్టల్ వార్డెన్, కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి వరకు తమ ఫిర్యాదుపై కళాశాల యాజమాన్యం నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆగ్రహించిన విద్యార్థినులు బుధవారం రాత్రి నుండి ఆందోళన ప్రారంభించారు. తమకు హాస్టల్‌లో భద్రత లోపించిందని, వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ పెద్దపెట్టున నినదించారు. విద్యార్థినుల ఆందోళనలో విద్యార్థి సంఘాలు సైతం భాగస్వామ్యులయ్యారు. ఎబివిపి మహిళా సంఘ విద్యార్థినులు ఒక్కసారిగా గేటు దూకి లోపలి వైపు వేసిన తాళాలు పగులగొట్టి మిగిలిన తరువాయి 2లో

## మను బాకర్, గుకేశ్‌కు
# ఖేల్‌రత్న




- మరో ఇద్దరు ఒలింపిక్ విన్నర్స్ హర్మన్ ప్రీత్‌సింగ్, ప్రవీణ్ కుమార్ కూడా..
- 32మందికి అర్జున, ఐదుగురికి ద్రోణాచార్య పురస్కారాలను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- వరంగల్ వాసి పారా అథ్లెటిక్ జీవాంజి దీప్తికి అర్జున అవార్డు
- ఈ నెల 17న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ప్రదానం

న్యూఢిల్లీ : భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024 ఏడాదికి గాను నలుగురు క్రీడాకారులను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు ఎంపిక చేసింది. చెస్ విభాగంలో డి.గుకేశ్, హాకీ విభాగంలో హర్మన్ ప్రీత్‌సింగ్, పారా అథ్లెట్ విభాగంలో ప్రవీణ్ కుమార్, షూటింగ్ విభాగంలో మను బాకర్‌ను ఈ అవార్డులు వరించాయి. అలాగే, 32 మందికి అర్జున, ఐదుగురికి ద్రోణాచార్య పురస్కారాలకు ఎంపిక చేశారు. అర్జున పురస్కారాలు దక్కించుకున్నవారిలో 17మంది పారా అథ్లెట్స్ ఉండటం విశేషం. జనవరి 17న ఉదయం 11గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా వీరంతా పురస్కారాలను అందుకుంటారని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. భారత స్వాతంత్ర్యం వచ్చాక.. ఒకే ఒలింపిక్ గేమ్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి అథ్లెట్‌గా మను బాకర్ ఘనత సాధించింది. 2024 పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ వ్యక్తిగత విభాగంతోపాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్యాలను సొంతం చేసుకుంది. తొలి జాబితాలో ఆమె పేరు లేకపోవడంతో తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు ప్రకటించిన జాబితాలో పేరు ఉండటంతో క్రీడాభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించిన గుకేశ్‌కు ఖేల్ రత్న అవార్డు వరించింది. ఫైనల్‌లో చైనా ప్లేయర్‌పై అద్భుత విజయంతో ఛాంపియన్‌గా నిలిచాడు. ఒలింపిక్స్‌లో వరుసగా భారత్ రెండో పతకం సాధించడంలో హాకీ కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ కీలక పాత్ర పోషించాడు. పారాలింపిక్స్‌లో ప్రవీణ్ కుమార్ హై జంప్ టి64 విభాగంలో బంగారు పతకం సాధించాడు.

**అర్జున అవార్డులు వీరికే..**

జ్యోతి యర్రాజి (అథ్లెటిక్స్), అన్ను రాణి (అథ్లెటిక్స్), నీతు (బాక్సింగ్), తరువాయి 2లో

## దీప్తి జీవాంజికి సిఎం అభినందనలు

ప్రజాపక్షం / హైదరాబాద్

పారాలింపిక్స్‌లో భారత్ తరపున కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్, వరంగల్ జిల్లా ముద్దుబిడ్డ దీప్తి జీవాంజి విశిష్ట క్రీడా పురస్కారం అర్జున అవార్డు 2024కు ఎంపిక కావడం పట్ల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. అంతర్జాతీయ, జాతీయ క్రీడల్లో సత్తా చాటే యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రజా ప్రభుత్వ స్పోర్ట్స్ పాలసీలో తరువాయి 2లో



ఫైల్ ఫొటో

## డల్లేవాల్ దీక్షపై మీడియాలో
# తప్పుడు అభిప్రాయ సృష్టి

- పంజాబ్ అధికారులు, పలువురు రైతునేతలపై సుప్రీంకోర్టు ‘గరం’
- నిరసనను విచ్ఛిన్నం చేయమని కోర్టు ఎప్పుడూ ఆదేశించలేదని స్పష్టీకరణ
- ఈనెల 6న తదుపరి విచారణ



న్యూఢిల్లీ /చండీగఢ్ : రైతు నాయకుడు జగ్‌జిత్‌సింగ్ డల్లేవాల్ నిరాహారదీక్షను భగ్నం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు, రైతునాయకులు మీడియా ద్వారా తప్పుడు అభిప్రాయాన్ని సృష్టిస్తున్నారని గురువారం సుప్రీంకోర్టు పంజాబ్ ప్రభుత్వాన్ని తప్పుపట్టింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన దిస్వభ్య ధర్మాసనం విచారణ సందర్భంగా మాట్లాడుతూ డల్లేవాల్ నిరసనను విచ్ఛిన్నం చేయమని కోర్టు ఎప్పుడూ ఆదేశించలేదని, అయితే అతడి ఆరోగ్యం గురించి మాత్రమే స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని వివరించింది. డల్లేవాల్‌కు అత్యవసరంగా వైద్య సహాయం అందించాలని ధర్మాసనం కోరుతోందని పేర్కొంది. పంజాబ్ ప్రభుత్వ అధికారులు ఈ విషయంలో ఎక్కువ ప్రయత్నాలు చేస్తున్నట్లు తాము చెప్పదలచుకోలేదని, తరువాయి 12లో



## 40 ఏళ్ల తర్వాత భోపాల్ ఫ్యాక్టరీ నుంచి
# విషపూరిత వ్యర్థాల తరలింపు

భోపాల్ : భోపాల్ గ్యాస్ దుర్ఘటన తర్వాత యూనియన్ క్బాడ్ సంస్థ ఆవరణలో దాదాపు 40 ఏళ్లుగా పడివున్న 377 టన్నుల విషపూరిత వ్యర్థాలను తాజాగా అధికారులు తరలించారు. ఈ ప్రమాదకర వ్యర్థాలను ధార్ జిల్లాలో ఉన్న పీతంపుర్ ఇండస్ట్రియల్ ఏరియాకు తరలించినట్లు అధికారులు తెలిపారు. యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలోని విషపూరిత వ్యర్థాలు నింపిన 12 సీల్డ్ కంటైనర్ ట్రక్కులు బుధవారం రాత్రి 9గంటలకు భోపాల్‌కు 250 కి.మీ దూరంలో ఉన్న పీతంపుర్‌కు బయలుదేరాయి. ఈ ట్రక్కులు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసేందుకు ప్రత్యేక గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేశారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య వ్యర్థాలతో నిండిన ఉన్న ట్రక్కులు గురువారం తెల్లవారుజామున 4.30 గంటలకు పీతంపుర్‌లోని ఇండస్ట్రియల్ తరువాయి 2లో

## ‘నీట్-యుజి పరీక్ష’పై
# నిపుణుల కమిటీ సిఫారసులు అమలు

**సుప్రీంకోర్టు ధర్మాసనానికి కేంద్రం వెల్లడి**




న్యూఢిల్లీ : గత ఏడాది నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ అండర్‌గ్రాడ్యుయేట్ (నీట్‌యుజి)ను నిర్వహించడంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) పనితీరును సమీక్షిస్తూ పరీక్ష సంస్కరణలపై ఏడుగురు సభ్యుల నిపుణుల ప్యానెల్ సూచించిన దిద్దుబాటు చర్యలను అమలు చేస్తామని గురువారం కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుకు తెలిపింది. 2024నాటి వివాదాస్పద నీట్ అండర్‌గ్రాడ్యుయేట్‌ను విశ్లేషించడానికి గత తరువాయి 12లో

# ప్రపంచదేశాల్లో నవ్వులపాలైన అమెరికా

## అసమర్ధ నాయకత్వంవల్లే ఉగ్ర దాడులు
## డెమోక్రాట్లు సిగ్గుతో తలదించుకోవాలి : ట్రంప్





**వాషింగ్టన్ :** అమెరికాకు బలహీనమైన నాయకత్వం ఉండటంవల్ల, అసలు సరైన నాయకుడే లేకపోవడంవల్ల ఉగ్రవాద దాడులు జరుగుతున్నాయని కాబోయే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విరుచుకుపడారు. బుధవారం న్యూ ఇయర్స్ డే సందర్భంగా జరిగిన రెండు ఉగ్రవాద దాడులను పరోక్షంగా ప్రస్తావిస్తూ సోషల్ మీడియా 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ పైవిధంగా పోస్టింగు పెట్టారు. జాతీయ భద్రత, దేశ క్షేమం, దేశ ప్రజాస్వామ్యం హింసకుగురై నాశనమవుతోందని విమర్శించారు. డెమోక్రాట్లు సిగ్గుతో తలదించుకోవాలని, సిఐఎ అసలు ఏనాడో రంగంలోకి దిగి ఉండాల్సిందనీ, కానీ ఇప్పటికే చాలా ఆలస్యమైపోయిందని ఆయన పేర్కొన్నారు. సరిహద్దులు తెరచి ఉన్నందువల్ల, విపరీతమైన వలసల వల్లనే ఇదంతా జరుగుతోందని ట్రంప్ విమర్శించారు. అమెరికా నాశనమైపోతోందనీ, ఒక రకంగా దేశంలో నాయకుడే లేడనీ, ప్రపంచంలో మన దేశం నవ్వులపాలైందని ఆయన అధికార డెమోక్రటిక్‌పార్టీ నాయకులమీద విమర్శల దాడి చేశారు. సరిహ ద్దులను ఇలా బాహాటంగా తెరచి ఉంచకుండా జాగ్రత్తగా ఉంటే ఇలా జరిగేదే కాదనీ, ఇదంతా నాయకత్వ అసమర్థతేననీ అన్నారు. ఐతే ఆయన ఎక్కడా ఉగ్రవాద దాడుల గురించి ప్రముఖంగా ప్రస్తావించలేదు. ఎఫ్‌బిఐగానీ, డిఓజెగానీ, డెమోక్రాట్ల ప్రభుత్వం గానీ తమ పనులు తాము చేయడంలేదని, అందుకే ఇలా జరుగుతోందన్నారు. ఈ పదవులలో ఉన్నవారంతా అసమర్థులూ, అవినీతిపరులూ, ప్రతిపక్షాలపైన నిత్యం విమర్శలు చేసేవాళ్ళు ప్రత్యేకంగా నామీద గురిపెట్టి విమర్శలు చేయడం తప్ప పరిపాలన తెలియని వాళ్ళని ట్రంప్ విమర్శించారు.

### ఉగ్రవాదులుగా మాజీ సైనికులు..
### దాడుల్లో 16 మంది మృతి

అమెరికాలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మూడు ఘటనలు జరిగాయి. ఈ ఘటనల్లో 15 మంది మరణించగా, 48 మంది గాయపడ్డారు. 15 మంది మరణానికి కారణమైన అమెరికా ఆర్మీలో పనిచేసిన, ఉగ్రవాదిగా అనుమానిస్తున్న వ్యక్తిని పోలీసు లు కాల్చి చంపారు.కాగాట్రంప్ హోటల్ వద్ద జరిగిన టెస్లాసైబర్ ట్రక్ బ్లాస్ట్‌కు కూడాఅమెరికా మాజీ సైనికుడు మాథ్యూ లైవెల్స్‌బెర్గెర్ (37)గా ఎఫ్ బిఐ సందేహించి ఆరా తీస్తోంది. ఈ హింసాత్మక ఘటనల తో అమెరికా వణికిపోతున్నది. వీటిల్లో ఒక ఘటన న్యూ ఓర్లియన్స్‌లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తెల్లవారుజామున మూడు గంటలకు జరిగింది.మరొకటి లాస్‌వేగాస్‌లో ట్రంప్ హోటల్‌బయట జరిగింది. మరో ఘట న న్యూయార్క్ లోని క్వీన్స్ నైట్‌క్లబ్‌లో జరిగింది. ఈ నైట్‌క్లబ్‌లో గన్‌మెన్ కాల్పులకు తెగబడటంతో 11 మంది గాయపడ్డారు. ఆమెరికా మాజీ సైనికుడు లారీకి ఐఎస్ఐఎస్ ఉగ్రవాదుల జెండాను కట్టుకుని పాదచారుల మార్గంలోకి దూసుకువచ్చి 15 మందిని హతమార్చాడు. ఈ ఘటనలో మరో 30 మంది గాయపడ్డారు.బౌర్బాన్ వీధిలో ఈఘటన జరిగింది. ఈలారీ నడిపిన వ్యక్తిని అమెరికాకు చెందిన మాజీ సైనికుడు షంషుద్దీన్ జబ్బార్ (42)గా గుర్తించారు. అతడిని పోలీసులు హతమార్చారు. ఇతగాడు గతంలోఆఫ్ఘానిస్థాన్‌లో పనిచేశాడు. ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్‌తో సంబంధాలు ఉన్నాయనీ,ఉద్దేశపూర్వకంగా ఈ చర్యకు పాల్పడటంలో ఇంకా అనేకమంది సహాయం చేసి ఉంటారనీ ఎఫ్‌బిఐ అనుమానిస్తున్నది.ఐతే ఈట్రక్ దాడికిపాల్పడిన జబ్బార్ సోషల్ మీడియాలో తనను తాను రియల్ ఎస్టేట్‌ఏజంటుగా పరిచయం చేసుకున్నాడు. ఇదిలాఉండగా, టెస్లాకు చెందిన ఒక సైబర్ ట్రక్ లాస్ వేగాస్‌లో డోనాల్డ్ ట్రంప్‌కు చెందిన ఇంటర్నేషనల్ హోటల్ బయట పేలిపోయింది. ఐతే ఈ పేలుడువల్ల సామాన్య ప్రజలకు ఎలాంటి నష్టం కలగలేదు. మరో ఏడుగురు గాయపడ్డారు. కొలరాడోలో అద్దెకు తీసుకున్న ఈ వాహనాన్ని లాస్ వేగాస్ వరకూ తీసుకువచ్చి పేలుడుకు గురిచేశారు. లాస్‌వేగాస్‌లో, న్యూ ఓర్లియన్స్‌లో జరిగిన ఈ రెండు సంఘటనలకూ మధ్య పరస్పర సంబంధం ఉందనీ, ఉద్దేశపూర్వకంగానే ఈ ఘటనలు జరిగాయనీ ఎఫ్‌బిఐ అనుమానిస్తున్నది. ఆ దిశగా దర్యాప్తు జరుగుతోంది. కాగా ఈ ఉగ్ర దాడుల ఘటనలపై అధ్యక్షుడు జో బైడెన్ తీవ్ర సంతాపాలు తెలియజేశారు. కాగా, విర్జీనియాలో ఎఫ్‌బిఐ అధికారులు ఒక వ్యవసాయ క్షేత్రంలోచరిత్రలో ఎన్నడూలేనివిధంగా 150 బాంబులను స్వాధీనం చేసుకున్నారు. ఇలా స్వాధీనం చేసుకోవడం ఇదే మొదటిసారి. ఈ కేసులో ఒక వ్యక్తిని కుటుంబంతో సహా పట్టుకున్నారు.

# ముజిబుర్ రెహ్మాన్ ఇక బంగ్లా జాతిపిత కాదు







## పాఠ్యపుస్తకాల్లో చరిత్ర మార్పులు

**ఢాకా:** బంగ్లాదేశ్ పాఠ్యపుస్తకాలలో పెద్ద మార్పులు వచ్చాయి. ఈ కొత్త సంవత్సరంలోనే ఈ సిలబస్‌ను అ మలు చేస్తారు. బంగ్లాదేశ్ జాతిపితగా ముజిబుర్ రెహ్మాన్ పేరు మాయం అవుతుంది. దీంతో షేక్ హసీనా కుటుంబం ప్రాధాన్యం వచ్చే తరాలలో మసకబారుతుంది. షేక్ హసీనా ప్రధానమంత్రిగా ఉండగా 2022లో అమలులోకి వచ్చిన పాఠ్యా ంశాలన్నీ రద్దయ్యా యి. 2012 నాటి పాఠ్యాంశాలు పునరుద్ధరించారు. ఇక మీదట జియావుర్ రెహ్మాన్‌ను బంగ్లాదేశ్ మాజీ మిలిటరీ ఆఫీసర్‌గా విద్యార్థులకు పరిచయం అవుతారు. "ఆయన దేశ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా భర్త కూడా..." అని ఆ పాఠ్యాంశాలలో ఉంటుంది. జియావుర్ రెహ్మాన్ దేశానికి ఆరో అధ్యక్షుడనీ, 1971లో బంగ్లాదేశ్‌ను ఆయన స్వతంత్రదేశంగా ప్రకటించాడనీ పాఠ్యాంశాలో ఉంటుంది. ఒకటినుండీ మూడో తరగతి వరకూ పాఠ్యాంశాలలో మార్పు ఉండదు, నాలుగు నుండీ తొమ్మిదో తరగతివారకూ పాఠాలలో మార్పులుంటాయి, ఇక మరో 33 పాఠ్యపుస్తకాలను మార్పు చేసే విషయంపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీలో నిపుణులైన సభ్యులను తాత్కాలిక ప్రభుత్వమే నియమిస్తుంది. అదేవిధంగా బంగ్లాదేశ్‌లో ఇద్దరు ప్రముఖ ర్యాపర్స్ హన్నన్, షెజాన్‌లు కొత్త పాఠ్యపుస్తకాలలో చోటు సంపాదించుకున్నారు.

ప్రపంచం

# కృత్రిమ మేధతో హాంకాంగ్ వలసకాల స్మృతులు

**హాంకాంగ్:**కృత్రిమ మేధ(ఎ.ఐ) సమాజంలో సకల జీవన విధానాలను ప్రభావితం చేస్తున్నది. ఎ.ఐ సహాయంతో అనేకమంది కొత్తతరం చిత్రకళాకారులు అవతరిస్తున్నారు. వారుతమ గతస్మృతులు, భవిష్యత్‌ను, వర్తమానాన్ని తమ వాస్తవాలకు అనుగుణంగా కృత్రిమ మే ధ ద్వారా చిత్రీకరిస్తున్నారు.అలాంటి వందలమంది కృ త్రిమ మేధ చిత్రకళాకారులలలో ఒకరు43 ఏళ్ళ మహిళ బయాంకాసే.బ్రిటిష్ వలసకాలంలో తన బాల్యంలో హాంకాంగ్‌లో ఉన్న కార్మికుల దుర్భర పరిస్థితులను ఆమె గుర్తుచేసుకుంటూ కృత్రిమ మేధ ద్వారా ఒక ప్రత్యామ్నా హాంగ్ కాంగ్ ఆకాశహర్మ్యాలను ఆమె సృష్టించారు. ఆనాటి పరిస్థితులు ఇప్పటికీ అనేకమంది హృదయాలలో చెరగని ముద్రలు వేశాయి. ఆమె తన కృత్రిమ మేధ చిత్రాల ద్వారా ఒక ప్రత్యామ్నాయ హాంకాంగ్‌ను సృష్టించి అందరికళ్ళకూ కట్టారు. దక్షిణ చైనా సముద్రతీరంలో ఉన్న ఈ నగరం అత్యంత ఖరీదైన ఆకాశహర్మ్యాలకు, అతిలోతైన ఓడరేవులకు కిక్కిరిపోయిన వలసకార్మికులకు, వారి జీవనానికి అద్దంపడుతుంది. 80 గజాల స్థలంలో అనేక అంతస్తులు కట్టిన నిర్మాణంపైన ముగ్గురు వలస చైనీయులు పీటలు వేసుకుని కూర్చున్న కృత్రిమమేధ చిత్రం ఇప్పుడు హల్‌చల్ చేస్తున్నది. ఇలా ంటి ఎ. ఐ ఆర్టిస్టుల సంఖ్య ఇప్పుడు గణనీయంగా పెరుగుతున్నది.






# జేన్ ఆస్టిన్ 250వ జయంతి సందడి





**వించెస్టర్ :** ప్రముఖ ఆంగ్ల నవలా రచయిత్రి జేన్ ఆస్టిన్ 250వ జయంతి సంవత్సరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఈ ఏడాది చివరి వరకూ ప్రపంచవ్యాప్తంగా బ్రిటన్‌కు వచ్చే రచయితలు అక్కడ సందడి చేయబోతున్నారు. పైగా మొట్టమొదటిసారి హాంప్‌షైర్‌లోని కెథెడ్రల్ నగరం వించెస్టర్‌లో ఉన్న జేన్ ఆస్టిన్ నివాసాన్ని ఆమె అభిమానుల ప్రవేశానికి అనుమతిఒచనున్నారు. దీంతో ప్రపంచ దేశాల నుండి వేలసంఖ్యలో జేన్ ఆస్టిన్ అభిమానులు ఈ ఏడాది చివరివరకూ తరలిరా నునాన్రు. ఈ సందర్భంగా అక్కడ పెద్ద పెద్ద సెమినార్లు, చర్చలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. వించెస్టర్‌లోని నెంబర్–8 కాలేజ్ స్ట్రీట్‌లోని ఆమె నివాసంలో సాహిత్యాభిమానులకోసం అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆమె ఆరుగురు మేనల్లుళ్ళు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాలలో ఆమెకు విపరీతంగా అభిమానులు ఉన్నారు. ఆమె మరణించిన ఆమె జన్మస్థలం వీధిలోనే 1,00, 000 పౌండ్ల ఖర్చుతో జేన్ ఆస్టిన్ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఆమె జన్మించిన గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనేకచోట్ల పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. 1975 డిసెంబరు 16వ తేదీన వించెస్టర్‌లో జన్మించిన జేన్ ఆస్టిన్ జన్మించారు. 1817 జులై 18వ తేదీన ఆమె తన 41వ యేట మరణించారు. 2025 డిసెంబరు 16వ తేదీనాటికి ఆమె జన్మించి 250 సంవత్సరాలు పూర్తి అవుతాయి. స్టీవెన్టన్‌లో ఎగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన జేన్ ఆస్టిన్ 18వ శతాబ్దంనాటి బ్రిటిష్ కుటుంబ, సామాజిక జీవన విధానాన్ని ప్రతిబింబించే ఎన్నో నవలు రాశారు. ఈ నవలలన్నీ ఆమెకు చిరకాల కీర్తి ప్రతిష్టలను ఆర్జించిపెట్టాయి. ఆనాటి బ్రిటిష్ సమాజంలో ఆడపిల్లల మనస్తత్వాలు, వారి ప్రేమలు, పెళ్ళిళ్ళు, ఆడపిల్లలకు మగవారిపై ఉండే ద్వేషాలు,ఆనాటి తల్లిదండ్రుల మనోవేదనలు ఆమె నవలల్లో ప్రముఖంగా కనిపిస్తాయి. ఆమె రాసిన ఆరు పెద్ద నవలలుఆమెను ఒకరకంగా 'సాహిత్యసింహం!'గా మార్చాయి.

# ఖేల్‌రత్న

(మొదటి పేజీ తరువాయి)

స్వీటీ బురా (బాక్సింగ్), వంతిక అగర్వాల్ (చెస్), సలీమా (హాకీ), అభిషేక్ (హాకీ), సంజయ్ (హాకీ), జర్మన్ ప్రీత్ సింగ్ (హాకీ), సుఖ్ జీత్‌సింగ్ (హాకీ), స్వప్నిల్ సురేష్ కుసాలే (షూటింగ్), సరబ్ జోత్ సింగ్ (షూటింగ్), అభయ్‌సింగ్ (స్క్వాష్), సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్), అమన్ (రెజ్లింగ్), రాకేశ్ కుమార్ (పారా ఆర్చర్), ప్రీతి పాల్ (పారా అథ్లెటిక్స్), జీవాంజి దీప్తి (పారా అథ్లెటిక్స్), అజీత్ సింగ్ (పారా అథ్లెటిక్స్), సచిన్ సర్జేరావు ఖిలారి (పారా అథ్లెటిక్స్), ప్రణవ్ సూర్మ (పారా అథ్లెటిక్స్), హెచ్. హోకాటో సీమ (పారా అథ్లెటిక్స్) సిమ్రాన్ (పారా అథ్లెటిక్స్), నవ్‌దీప్ (పారా అథ్లెటిక్స్), నితీశ్ కుమార్ (పారా బ్యాడ్మింటన్), తులసీమతి మురుగేశన్(పారా బ్యాడ్మింటన్), నిత్య శ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్), మనీశా రాందాస్ (పారా బ్యాడ్మింటన్), కపిల్ పర్మార్ (పారా జుడో), మోనా అగర్వాల్ (పారా షూటింగ్), రుబినా ఫ్రాన్సిస్ (పారా షూటింగ్)

**అర్జున అవార్డ్స్ (లైఫ్‌టైమ్)**

సుచా సింగ్ (అథ్లెటిక్స్), మురళీకాంత్ రాజారాం పెట్కర్ (పారా స్విమ్మింగ్

దోణాచార్య అవార్డులు (కోచ్‌లు)

సుభాష్ రాణా (పారా షూటింగ్), దీపాలీ దేశ్‌పాండే (షూటింగ్), సందీప్ సంగ్వాన్ (హాకీ)

**లైఫ్‌టైం కేటగిరీలో..**

మురళీధరన్ (బ్యాడ్మింటన్), అర్మాండో ఆగ్నెలో కొలాకో (ఫుట్ బాల్ )

# సిఎం అభినందనలు

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా ముఖ్యమంత్రి ఒక కోటి రూపాయలను, కోచ్ నాగపురి రమేష్‌కు రూ.10 లక్షల నగదు బహుమతిని గతంలోనే అందజేశారు. అదే సమయంలో దీప్తి గ్రూప్2 స్థాయి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు వరంగల్‌లో 500 గజాల స్థలం కేటాయించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. తెలంగాణ యువ క్రీడాకారులు మరింతగా రాణించాలని, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, రాష్ట్ర వ్యాప్తంగా నిర్మితం కానున్న స్పోర్ట్స్ కాంప్లెక్సులు అందుకు దోహదపడతాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే, క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఎంపికైన గుకేష్ (చెస్), హర్మన్ ప్రీత్ సింగ్ (హాకీ), ప్రవీణ్ కుమార్ (ప్యారా అథ్లెటిక్స్), మను బాకర్ (షూటింగ్)లకు ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. 2024 లో వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచి అర్జున, ద్రోణాచార్య అవార్డులకు ఎంపికైన క్రీడాకారులు, కోచ్‌లకు ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.

**మంత్రి కొండా సురేఖ హర్షం**

పారిస్ లో జరిగిన పారాలింపిక్స్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించి దేశ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించిన ఓరుగల్లు ముద్దుబిడ్డ, పారా అథ్లెట్ దీప్తి జీవాంజికి కేంద్ర ప్రభుత్వం అర్జున అవార్డు ప్రకటించడం పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. మానసిక సామర్థ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ, కుంగిపోకుండా, విధిని ఎదిరించి తన శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటిన అథ్లెట్ దీప్తి జీవాంజి ప్రస్థానం ఎందరికో స్ఫూర్తినిచ్చిందని మంత్రి సురేఖ అన్నారు. దీప్తి జీవాంజికి తమ సహకారం ఎల్లవేళలా వుంటుందని మంత్రి తెలిపారు. దీప్తి మరెన్నో కీర్తి శిఖరాలను అధిరోహించాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడారంగంలో అత్యున్నతంగా తీర్చిదిద్దేందుకు సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నదని మంత్రి సురేఖ తెలిపారు. ఈ కార్యాచరణలో భాగంగా ఈ మధ్యే యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్టస్ యూనివర్సిటీ బిల్లు చట్టసభల్లో ఆమోదం పొందిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. సిఎం కప్ పేరుతో పోటీలు నిర్వహించి గ్రామీణుల్లో దాగిన ప్రతిభను వెలికితీస్తున్నామని అన్నారు. త్వరలోనే అత్యుత్తమ క్రీడా పాలసీని తీసుకువచ్చి దేశంలోనే క్రీడల రాజధానిగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# పెన్షనర్లకు నగదు రహిత చికిత్స
## ''మెడికల్ రీయింబర్స్‌మెంట్ గరిష్ఠ పరిమితిని పెంచండి''



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వపెన్షనర్లకు ఇహెచ్ఎస్ ద్వారా నగదు రహిత వైద్య చికిత్స, మెడికల్ రి ఇంబర్స్‌మెంట్ గరిష్ట పరిమితిని పెంచి, సకాలంలో ఆ బిల్లులను అందజేయాలని తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టిఎస్‌జిఆర్ఇఎ) ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందిచకపోతే ఈ నెల 21న హైదరాబాద్, ఇందిరాపార్క్ వద్ద ధర్నా చౌక్ వద్ద పెన్షనర్లతో నిరసన దీక్ష చేపట్టనున్నట్టు వారు స్పష్టం చేశారు. ఈ మేరకు టిఎస్‌జిఆర్ఇఎ రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్ రెడ్డి, సెక్రటరీ జనరల్ సి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి, చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ పైన ఆధారపడిన కుటుంబ సభ్యులకు అన్ని కార్పొరేట్ ఆస్పత్రులలో ఇహెచ్ఎస్ ద్వారా నగదు రహిత వైద్య చికిత్సలు అందించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని గత ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసినా, పదేళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఆ ఉత్తర్వులను అమలు చేయడం లేదని ఆరోపించారు. తమ మూలవేతనం నుంచి ఒక శాతం సొమ్మును మినహాయించి ఎంప్లాయీస్ హెల్త్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, అమలు చేయాలని, లేదా హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెన్సీ ద్వారానైనా నగదు రహిత వైద్య సేవలను అందించాలని, ప్రతి జిల్లాల్లో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# విషపూరిత వ్యర్థాల తరలింపు

(మొదటి పేజీ తరువాయి)

ఏరియాకు చేరుకున్నాయని ధార్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం ట్రక్కులను పీతంపూర్‌లోని ఫ్యాక్టరీ క్యాంపస్‌లో ఉంచామని పేర్కొన్నారు. విషపూరిత వ్యర్థాలతో నిండిన ఉన్న ట్రక్కులు ఏడు గంటలు ప్రయాణించి ధార్ జిల్లాలోని పీతంపూర్ పారిశ్రామిక ప్రాంతానికి చేరుకున్నాయని రాష్ట్ర గ్యాస్ రిలీఫ్ అండ్ రిహాబిలిటేషన్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ స్వతంత్ర కుమార్ సింగ్ తెలిపారు. అందుకు కోసం గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. 'యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలోని వ్యర్థాలను ప్యాకింగ్, లోడింగ్ చేసే ప్రక్రియలో ఆదివారం నుంచి బుధవారం రాత్రి వరకు దాదాపు 100 మంది కార్మికులు పాల్గొన్నారు. ఇందుకోసం ఒక్కో కార్మికుడు అరగంట పాటు షిఫ్టులో పనిచేశారు. ప్రతీసారి షిఫ్టు పూర్తికాగానే ఆయా కార్మికులకు హెల్త్ చెకప్స్ చేయించాం.' అని స్వతంత్ర కుమార్ సింగ్ తెలిపారు.

**హైకోర్టు ఆగ్రహం**

యూనియన్ కార్బైడ్ సంస్థలో పేరుకుపోయిన విషపూరిత వ్యర్థాలను తొలగించకపోవడంపై మధ్యప్రదేశ్ హైకోర్టు ఇటీవలే అధికారులను మందలించింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు యూనియన్ క్యాబ్డ్ సంస్థలోని వ్యర్థాలను ఎందుకు తొలిగించలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కార నేరం కింద కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించింది. అలాగే ప్రమాదకర వ్యర్థాలను తొలగించడానికి నాలుగు వారాల డేడ్‌లైన్‌ను విధించింది. దీంతో అధికారులు తాజాగా భోపాల్ ఫ్యాక్టరీలోని వ్యర్థాలను పీతంపూర్ పారిశ్రామిక ప్రాంతానికి తరలించారు.

**కేంద్ర, రాష్ట్ర అధికారుల సమక్షంలో**

పీతంపూర్ పారిశ్రామిక కారిడార్ డిస్పోజల్ యూనిట్‌లో తొలుత కొంత మొత్తంలో వ్యర్థాలను ప్రత్యేకంగా దహనం చేస్తామని రాష్ట్ర గ్యాస్ రిలీఫ్ అండ్ రిహాబిలిటేషన్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ స్వతంత్ర కుమార్ సింగ్ వెల్లడించారు. తర్వాత వచ్చే బూడిదలో కూడా ఏమైనా రసాయనాలు ఉన్నాయేమో పరీక్షలు జరుపుతామన్నారు. అంతా బాగానే ఉందని తేలితే 3నెలల్లో వ్యర్థాలను దహనం చేస్తామని, లేదంటే 9 నెలల సమయం పట్టొచ్చని అన్నారు. వ్యర్థాలను దహనం చేయగా వచ్చిన బూడిదను రెండంచెల్లో భద్రపరిచి భూస్థాపితం చేస్తామని చెప్పారు. ఈ బూడిద ఎక్కడా భూమిని తాకకుండా, నీటిలో కలవకుండా జాగ్రత్తలు తీసుకొంటామన్నారు. కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారుల పర్యవేక్షణలో నిపుణుల బృందం ఈ ప్రక్రియను చేపడుతుందని వెల్లడించారు.

**'ఎటువంటి ఆందోళన అవసరం లేదు'**

2015లో పీతంపూర్‌లో 10 టన్నుల యూనియన్ క్యాబ్డ్ వ్యర్థాలను ప్రయోగాత్మకంగా కాల్చివేశారని, ఆ తర్వాత చుట్టుపక్కల గ్రామాల్లోని మట్టి, భూగర్భ జలాలు, నీటి వనరులు కలుషితమయ్యాయని కొందరు సామాజిక కార్యకర్తలు పేర్కొన్నారు. తాజాగా సింగ్ ఆ ఆరోపణలను తోసిపుచ్చారు. 2015లో జరిగిన పరీక్షల ఆధారంగానే తాజాగా ప్రమాదకర వ్యర్థాలను తరలిస్తున్నట్లు చెప్పారు. స్థానికులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

**వేలాది మంది మృతి**

1984 డిసెంబరు 3న (డిసెంబరు 2 అర్ధరాత్రి దాటిన తర్వాత) భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో అత్యంత ప్రమాదకర మిథైల్ ఐసోసైనేట్ వాయువు లీకైంది. ఈ ప్రమాదంలో దాదాపు 5,479 మంది మరణించారు. వేలాది మంది తీవ్రమైన, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడ్డారు.

# క్షమాపణ చాలదు

(మొదటి పేజీ తరువాయి)

ఆ ప్రకటనలో విమర్శించింది. ''ముఖ్యమంత్రి బైరెన్‌సింగ్ రాజీనామా అనివార్యం, మణిపూర్ రాష్ట్ర పాలనాయంత్రాంగంలో విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే రాజీనామా తప్పనిసరి, ప్రజలే కేంద్ర బిందువుగా ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి, తిరిగి వారిని ఆశ్రయించేందుకు వీలుగా బైరెన్‌సింగ్ తన పదవికి రాజీనామా చేయాలి'' అని సిపిఐ డిమాండ్ చేసింది. మణిపూర్‌లో ఘర్షణల కారణంగా ఇప్పటివరకూ 250 మంది ప్రాణాలు కోల్పోయారు. అన్ని జాతలకు చెందిన వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. గతాన్ని మరచిపోదామనీ, తాజాగా మళ్ళీ పునఃప్రారంభం చేద్దామని నూతన సంవత్సర సందేశం పేరుతో మణిపూర్ ముఖ్యమంత్రి బైరెన్‌సింగ్ ఒక ప్రకటన చేయడంతో సిపిఐ పైవిధంగా స్పందించింది.

# దరఖాస్తులు ?

(మొదటి పేజీ తరువాయి)

సర్వే సైతం నిర్వహించనున్నారు.అదేవిధంగా శాటిలైట్ మ్యాపింగ్ ఆధారంగా సాగు చేసిన భూములను గుర్తించనున్నారు. ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆయా ఏజెన్సీలతో ఇటీవలే సమావేశం సైతం నిర్వహించారు. రైతుల దరఖాస్తుల ఆధారంగా ఫిల్డ్ సర్వేతో పాటు శాటిలైట్ మ్యాపింగ్ ఆధారంగా అన్ని సక్రమంగా ఉన్న భూములకు సంబంధించి రైతులకు జనవరి 14వ తేదీ నుంచి రైతు భరోసా కింద పంట సహాయాన్ని రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 1.53 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ఇందులో 1.30 కోట్ల ఎకరాల భూమి సాగులో ఉన్నట్లు ప్రభుత్వ అంచన.

# దృశ్యాల చిత్రీకరణ

(మొదటి పేజీ తరువాయి)

వారినందరిని లోపలికి తీసుకొని వెళ్లారు. ఈ విషయం విద్యార్థినుల తల్లిదండ్రులకు సైతం తెలిసి ఒక్కరొక్కరుగా అక్కడికి చేరుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

**యాజమాన్యంపై విద్యార్థినుల ఆరోపణలు**

తమ హాస్టల్ బాత్రూమ్‌కు ఉన్న వెంటిలేటర్ల వెనుక భాగాన హాస్టల్ సిబ్బందికి చెందిన గదులు ఉన్నాయని, అక్కడి నుండే కెమెరాలను రహస్యంగా అమర్చి వీడియోలు తీసే అవకాశాలు ఉన్నాయని విద్యార్థినులు ఆరోపించారు. బాత్రూమ్ వెంటిలేటర్ వెనుక నుండి ఓ వ్యక్తి తచ్చాడుతున్నట్లు తాము గమనించామని, దీంతో పాటు వెంటిలేటర్ అద్దాలపై చేతి గుర్తులున్నట్లు సైతం తాము చూశామన్నారు. ఇలాంటి విషయాలపై తాము గతంలోనే యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోగా తమదే తప్పు అంటూ అదో మాదిరి చూస్తున్నారని, భద్రత పూర్తిగా లోపించిందని విద్యార్థినులు యాజమాన్యంపై ధ్వజమెత్తారు.

**పోలీసుల రంగప్రవేశం**

కళాశాల మహిళా హాస్టల్ బాత్రూం గదుల్లో వీడియో చిత్రీకరణలు జరిగాయన్న అంశంపై తెలుసుకొన్న మేడ్చల్ ఎసిపి శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ రాజుల నేతృత్వంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా భారీ బందోబస్తే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎసిపి, ఇన్‌స్పెక్టర్లు మాట్లాడుతూ విద్యార్థినుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకొని ప్రాథమిక విచారణ చేపట్టామని, బాత్‌రూం కిటికీల వద్ద ఫింగర్ ప్రింట్‌లు సేకరించి సాంకేతిక ఆధారాలను అన్వేషిస్తున్నామన్నారు. హాస్టల్‌లో పని చేసే సిబ్బందిలో అనుమానితులైన ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుండి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొన్నామని చెప్పారు. వారి సెల్‌ఫోన్లలో ఇప్పటి వరకూ ఎలాంటి వీడియోలు ఉన్నట్లు కనిపించలేదని, మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, ఆరోపణలు నిజమైతేబాధ్యులపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. బాత్రూమ్ వెనుక భాగాన కళాశాలలో పని చేసే సిబ్బంది కోసం కేటాయించిన రెండు గదులు ఉండటం, వీడియోలు తీసే అవకాశాలు ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ విషయంలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం మాత్రం స్పష్టంగా కనపడుతోందని వారన్నారు. గురువారం తెల్లవారు జాము 2 గంటల వరకు కొనసాగిన విద్యార్థినులు, విద్యార్థినుల సంఘాల ఆందోళనతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. నిందితులపై చర్యలు తీసుకొంటామంటూ ఎసిపి, సిఐ హామీ ఇవ్వటంతో తమ ఆందోళన విరమించారు.

**నివేదిక ఇవ్వాలని మహిళా కమిషన్ ఆదేశాలు**

తీవ్ర సంచలనం సృష్టించిన సిఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ బాలికల అశ్లీల వీడియోల వివాదంపై తెలంగాణ మహిళా కమిషన్ సుమోటోగా స్పందించింది. ఈ ఉదంతంపై విచారణ జరిపి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలంటూ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది.

**యాజమాన్యంపై కఠిన చర్యలు : ఎఐవైఎఫ్ డిమాండ్**

విద్యార్థినుల హాస్టల్ గది బాత్రూమ్ వెనుక వెంటిలేటర్ల నుండి స్నానాలు చేస్తున్న దృశ్యాల చిత్రీకరణ ఉదంతంపై పోలీసు వర్గాలు కఠినంగా వ్యవహరించాలంటూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) డిమాండ్ చేసింది. ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్‌లు ఈ సందర్భంగా మాట్లాడుతూ మల్లారెడ్డి విద్యాసంస్థల్లో విద్యార్థినీ విద్యార్థినులకు భద్రత పూర్తిగా లోపించిందని, అనేక అక్రమాలకు నిలయంగా మారిన మల్లారెడ్డి విద్యాసంస్థలపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పోలీసు వర్గాలు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా తాము ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**హాస్టల్ వార్డెన్ అరెస్ట్**

తీవ్ర సంచలనం సృష్టించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డికి చెందిన సిఎంఆర్ కాలేజి హాస్టల్ బాత్రూమ్ కిటికీల నుండి విద్యార్థినుల అశ్లీల చిత్రాల చిత్రీకరణ ఆరోపణల నేపథ్యంలో హాస్టల్ వార్డెన్ ప్రీతిరెడ్డిని మేడ్చల్ పోలీసులు అరెస్టు చేసారు. ఇప్పటికే ఆమెను విధుల నుండి తప్పించామంటూ కళాశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నప్పటికి యాజమాన్యం ఆమెను తప్పించే యత్నమే అంటూ విద్యార్థినులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని పోలీసులను కోరారు. మేడ్చల్ ఎసిపి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యాన్ని తప్పు పట్టారు. విద్యార్థినుల హాస్టల్ గది వెనుక సిబ్బంది గదులు ఉండటం సరైంది కాదని, పైనున్న కిటికీ ద్వారా వీడియోలు తీసే ఆస్కారంం ఉందని పోలీసు వర్గాలు తమ ప్రాథమిక దర్యాప్తు అనంతరం తెలిపారు.





### దేశ సమైక్యత, సామాజిక న్యాయం కోసం పోరాడిన..

# మరపురాని మహానేత ఎబి బర్ధన్

శ్రమజీవుల విముక్తి కోసం శ్రమించిన మహానేత

కమ్యూనిస్టు ఉద్యమ పునరైక్యతకు పనిచేసిన దీశాలి

సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని

సిపిఐ ఆధ్వర్యంలో బర్ధన్ 9వ వర్ధంతి





**ప్రజాపక్షం/భద్రాచలం/హైదరాబాద్ :** దేశ సమైక్యత, సామాజిక న్యాయం కోసం తన తుది శ్వాస వరకు పోరాడిన మరపురాని మహానేత ఎబి బర్ధన్ అని, ఆయన ఆశయాల సాధనకు నేటి తరం నాయకులు, కార్యకర్తలు పునరంకితం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ, ఎఐటియుసి మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎబి బర్ధన్ 9వ వర్ధంతిని గురువారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత బర్ధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16 ఏళ్ల వయస్సులోనే భారతకమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా చేరి అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారని చెప్పారు.

ప్రస్తుతం అమల్లో ఉన్న అటవీహక్కుల చట్టం, భవన నిర్మాణ కార్మిక చట్టం, సమాచార హక్కు చట్టం ఎబి బర్ధన్ కృషి ఫలితమే అన్నారు. ఆయన శ్రమజీవుల విముక్తి కోసం నిరంతరం పరితపించారని, నాగపూర్‌లో బలమైన ట్రేడ్ యూనియన్ ఉద్యమం నిర్మించారని, నగర పార్టీ, పార్టీ నిర్మాణంలో చురుకైనపాత్ర పోషిస్తూ రహస్య జీవితం గడిపారని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తనవంతు కృషి చేశారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యునిగా ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని, ఆ సమయంలో విద్యుత్ రంగంలో జాతీయస్థాయిలో బలమైన ఎఐటియుసి యూనియన్ నిర్మించడంతో పాటు విద్యుత్‌రంగ ట్రేడ్ యూనియన్‌లు అన్నింటినీ కలిపి జాతీయ స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రక్షణ రంగంలో ఉన్న ట్రేడ్ యూనియన్లను ఐక్యం చేయడంలో ఆయన కృషి చేసి ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని జాతీయస్థాయిలో ముందుకు నడిపించారని తెలిపారు. 16 సంవత్సరాల పాటు సిపిఐ ప్రధాన కార్యదర్శిగా విశేష సేవలు అందించి కమ్యూనిస్టు ఉద్యమ పునరైక్యతకు చిత్తశుద్ధితో పనిచేశారని, వామ పక్ష నాయకులతో సుహృద్భావ సంబంధాలు, సైద్ధాంతిక రాజకీయ చర్చలు సాగించారన్నారు. కమ్యూనిస్టు పార్టీ విస్తరణకోసం శ్రమ జీవుల విముక్తి కోసం నిరంతరం శ్రమించిన బర్ధన్ అడుగుజాడల్లో నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, శ్రీనివాస్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

**మగ్దూంభవన్‌లో:** సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, దివంగత ఎబి బర్ధన్‌కు సిపిఐ శ్రేణులు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఎబి బర్ధన్ 9వ వర్ధంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో బర్ధన్ చిత్రపటానికి సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ్మా, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, ఓరుగంటి యాదయ్య, తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆరుట్ల రాజ్ కుమార్ పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా, చాడ వెంకటరెడ్డిలు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సిపిఐ బలోపేతానికి ఎబి బర్ధన్ అసమాన సేవలను అందించారని కొనియాడారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి గోవింద్, బోయ శ్రీరాములు, దశరథ్, చెన్నయ్య, నరసింహ, అంజయ్య, కుమార్ తదితరులు ఎబి బర్ధన్‌కు నివాళ్లు అర్పించారు.

# ప్రజా పోరాటాల పార్టీ సిపిఐ

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు

చాడ వెంకట్ రెడ్డి

ఎంసిపిఐ నుండి సిపిఐలో

పలువురి చేరికలు





**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ప్రజా పోరాటాల ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించేది సిపిఐ మాత్రమేనని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో హనుమాన్ నగర్, పలువేల్పుల ప్రాంతానికి చెందిన పలువురు ఎంసిపిఐ నుండి సిపిఐలో చేరగా వారికి చాడ వెంకట్ రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావస్తున్నాయని, ఈ సందర్భంగా గ్రామ గ్రామాన ఎర్రజెండా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. ఎన్నో త్యాగాలు, పోరాటాలతో సిపిఐ పునీతమైందని, పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, ఎన్.అశోక్ స్టాలిన్, సీనియర్ నాయకుడు మోతె లింగారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, వేల్పుల సారంగపాణి, యేషబోయిన శ్రీనివాస్, కండె నర్సయ్య, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, మాలోతు శంకర్, బత్తిని సదానందం, రమేష్ దేవా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు**

సిపిఐ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి జిల్లా సిపిఐ నాయకులకు, కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రజాపక్షం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన చాడ, తక్కళ్లపల్లి**

ప్రజాపక్షం తెలుగు దినపత్రిక హనుమకొండ జిల్లా క్యాలెండర్‌ను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో బుధవారం తొలుత వారు కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక మరింత ప్రజలకు చేరువై ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుండాలని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజాపక్షం పాత్రికేయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి తోట సుధాకర్, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, ఎన్.అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, వేల్పుల సారంగపాణి, యేషబోయిన శ్రీనివాస్, మాలోతు శంకర్, కండె నర్సయ్య, బత్తిని సదానందం, ప్రజాపక్షం విలేకరులు ఎండి ఉస్మాన్ పాషా, తాండూరి గోపి పాల్గొన్నారు.



## రోగులకు మెడిసిన్ రెగ్యులర్‌గా అందేలా చూడండి

ఎన్‌సిడిపై మంత్రి

దామోదర రాజనర్సింహ్మా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిపి, షుగర్ వంటి నాన్ కమ్యునికెబుల్ వ్యాధులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన ఎన్‌సిడి క్లినిక్‌లకు అనుసంధానం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా ఆదేశించారు. ఎన్‌సిడి క్లినిక్‌లలో అందుతున్న వైద్య సేవలపై పేషెంట్లకు అవగాహన కల్పించాలని, గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా పేషెంట్ల జాబితాను రూపొందించాలని ఆదేశించారు. పేషెంట్లు రెగ్యులర్‌గా మెడిసిన్‌ను వినియోగించేలా ఫాలోఅప్ చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో హైదరాబాద్, కోఠిలోని టిజిఎంఎస్ఐడిసి కార్యాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ్మా గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, టిజిఎంఎస్ఐడిసి ఎండి హేమంత్, డిఎంఇ వాణి, టివివిపి కమిషనర్ అజయ్ కుమార్, డిహెచ్ రవిందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రులలో పరికరాలు, మెడిసిన్, డాక్టర్లు, సిబ్బంది హాజరు, తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు. రాష్ట్రంలో చేసిన ఎన్‌సిడి సర్వే వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. 30 ఏళ్లు దాటిన 1.66 కోట్ల మందిని స్క్రీన్ చేయగా, 22.94 లక్షల మందికి బిపి, 11.9 లక్షల మందికి షుగర్ ఉన్నట్టు గుర్తించామని, పేషెంట్లకు అవసరమైన మెడిసిన్లను ఉచితంగా అందజేస్తున్నామని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ్మా మాట్లాడుతూ బిపి, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగాల బారిన పడిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జీవనవిధానంలో తీసుకోవాల్సిన మార్పులపై పేషెంట్లకు అవగాహన కల్పించాలని తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్‌లో వచ్చే అనారోగ్య సమస్యలను వారికి వివరించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ పేషెంట్ల జాబితాను రూపొందించాలన్నారు. పేషెంట్లను ఎన్‌సిడి క్లినిక్స్‌లకు అనుసంధానించాలన్నారు. ఎన్‌సిడి క్లినిక్లలో అందే వైద్య సేవల వివరాలను పేషెంట్లకు తెలియజేయాలని సూచించారు. మొబైల్ ద్వారా పేషెంట్లకు అవగాహన కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని, రెగ్యులర్‌గా చికిత్స తీసుకునేలా నిరంతరం ఫాలోఅప్ చేయాలని మంత్రి చెప్పారు. ఎన్‌సిడి సర్వేను కొనసాగించాలని, కొత్తగా నమోదైన పేషెంట్ల వివరాలను, ఎప్పటికప్పుడు జాబితాలో అప్‌డేట్ చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

టియుడబ్ల్యుజె మీడియా డైరీ ఆవిష్కరణలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. సచివాలయంలోని తన కార్యాలయంలో గురువారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టియుడబ్ల్యుజె) "మీడియా డైరీ–2025"ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఎస్.హరీష్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, ఐజెయు జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యుడు కె.సత్యనారాయణ, టియుడబ్ల్యుజె ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, కార్యదర్శి కె.శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి ఎం.వెంకట్ రెడ్డి, కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని కిరణ్‌కుమార్, బి.గౌస్ మోహియుద్దీన్, కె.అనిల్‌కుమార్, ఎ.రాజేష్, హెచ్‌యుజె అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, కార్యదర్శి హమీద్ షౌకత్ హాజరయ్యారు. ఇదిలా ఉండగా, నూతన సంవత్సరం సందర్భంగా గురువారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి రాష్ట్ర స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజి జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పొరేషన్ అధికారి వి.పి.గౌతమ్, సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.హరీష్‌తో పాటు ఆ శాఖల ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

### జర్నలిస్టుల అక్రిడిటేషన్‌లపై మంత్రి పొంగులేటికి నివేదిక

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ల జారీకి సంబంధించిన నివేదికను సమాచార, పౌరసంబంధాల, రెవెన్యూ, హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.హరీశ్‌తో కలిసి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి గురువారంనాడు సమర్పించారు.

రాష్ట్ర, కేంద్రం, జిల్లా, మండలాలలో పనిచేసే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్లు జారీ చేయడానికి మార్గదర్శకాలను సమీక్షించి, తాజాగా రూపొందించడానికి చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన అక్టోబర్ 18న రాష్ట్ర ప్రభుత్వం జిఒ ఆర్‌టి నెంబర్ 1359 ద్వారా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీకి డాక్టర్ ఎస్.హరీశ్ మెంబర్ కన్వీనర్‌గా ఉండగా, ఆంధ్ర జ్యోతి మాజీ సంపాదకుడు, సీనియర్ జర్నలిస్ట్ కె.శ్రీనివాస్, సియాసత్ ఉర్దూ దినపత్రిక న్యూస్ ఎడిటర్, ఎంఎల్‌సి అమెర్ అలీఖాన్, వి6 న్యూస్ ఛానల్ సిఇఒ అంకం రవి, ది హిందూ ఆంగ్ల దినపత్రిక పొలిటికల్ ఎడిటర్ ఆర్.రవికాంత్ రెడ్డి, నవతెలంగాణ దినపత్రిక సీనియర్ ఫోటో జర్నలిస్ట్ నరహరి సభ్యులుగా ఉన్నారు. 2016లో సమాచార, పౌర సంబంధాల శాఖ జారీచేసిన జిఒఎంఎస్ 239 ప్రకారం రూపొందించిన అక్రిడిటేషన్ మార్గదర్శకాలను హైకోర్టు కొట్టివేసింది. ఈ నేపథ్యంలో తాజాగా మార్గదర్శకాల రూపకల్పనకు కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ 45 రోజుల్లో



ఆరుసార్లు సమావేశమై, తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ నియమ, నిబంధనలను క్షుణ్ణంగా సమీక్షించింది. సచివాలయంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కలిసి కమిటీ నివేదికను కమిటీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, మెంబర్ సెక్రెటరీ ఎస్.హరీశ్‌లు సమర్పించారు. దీనికి సంబంధించి ప్రక్రియను ప్రారంభించేందుకు తగిన ఆదేశాలు ఇవ్వాలని సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కార్యదర్శిని మంత్రి ఆదేశించారు.

# ఐక్య ఉద్యమాలతో కార్మిక హక్కులను కాపాడుకుందాం

ఎఐటియుసి డైరీ ఆవిష్కరణలో

నాయకుల పిలుపు





**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా పోరాటాలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వాలపై వత్తిడి తీసుకువచ్చి కార్మికుల హక్కులు, ప్రయోజనాలను కాపాడుకుందామని పలువురు ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన "ఎఐటియుసి–2025" నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కార్యదర్శి జి.వెంకటేష్, టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం పాల్గొన్నారు. ఒక వైపు కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చివేసి యాజమాన్యాలకు అనుకూలంగా ఉండే విధంగా 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుండగా, మరొక వైపు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల అమలులో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ కార్మికవర్గానికి అన్యాయం చేస్తున్నదని, ఈ చర్యలను ప్రయత్నాలను కార్మిక సంఘాలన్నీ ఐక్య కార్యాచరణతో తిప్పికొట్టాలని వారు అన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో కనీస వేతనాలు కార్మికులకు పెరగకుండా అప్పటి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని, ప్రస్తుత ప్రభుత్వమైనా ఈ విషయంపై వెంటనే చర్చించి కనీస వేతనాలను ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెంచి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కనీస వేతనాల బోర్డు వేసినప్పటికీ అందులో అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం లేకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో పనిచేస్తున్న వివిధ రకాల స్కీమ్‌ల సిబ్బందిని కార్మికులుగా గుర్తించి వారికి కనీస వేతనాలు అమలు చేయాలని, శ్రమ దోపిడీ నుంచి వారికి విముక్తి కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.చంద్రయ్య, పి.ప్రేమ్ పావని, ఉజ్జిని రత్నాకర్ రావు, కార్యదర్శి బి.వెంకటేశం, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ హసీనా బేగంపాల్గొన్నారు.

## ఎంఎల్‌సి కవిత మా ప్రశ్నలకు జవాబు చెప్పి ధర్నా చేయాలి

టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ పదేళ్ల పరిపాలనలో బిసిలను వంచించడమే కాకుండా, వారికి న్యాయంగా అందాల్సిన నిధులను కూడా ఏ ఒక్క సంవత్సరంలో ఖర్చు చేయకుండా వారిని నిట్టనిలువునా ముంచిందని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. అధికారం కోల్పోయిన తర్వాత ఇప్పుడు కల్వకుంట కుటుంబం బిసిలపై మొసలికన్నీరు కారుస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎల్‌సి కవిత ధర్నా చేసే ముందు తమ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బిసి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రస్తుతమున్న రిజర్వేషన్లను 23 శాతం నుండి 42 శాతానికి పెంచడం కోసం చేపట్టిన చర్యలలో భాగంగా సమగ్ర కుటుంబ సర్వే చేపడుతున్నందుకు కవిత ధర్నా చేస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. బిసిలకు రిజర్వేషన్లు పెంచడం ద్వారా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కొత్తగా 23,973 మంది బిసిలకు ప్రాతినిధ్యం లభించే అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టినందుకు ధర్నా చేస్తున్నారా చెప్పాలన్నారు. స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు చర్యలు చేపడుతున్నందుకు ధర్నా చేస్తున్నారా అని కవితపై ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. బిసిలకు కాంగ్రెస్ పార్టీ మాత్రమే మేలు చేయగలదన్నారు. అధికారం పోయిన తర్వాత బిఆర్ఎస్‌కు బిసిలు గుర్తుకొచ్చారని, స్థానిక ఎన్నికల్లో బిసిలకు అన్యాయం చేసి వారి గొంతు కోసింది బిఆర్ఎస్ కాదా అని మహేష్‌కుమార్ ప్రశ్నించారు. లిక్కర్ స్కామ్‌లో మరక అంటించుకున్న ఎంఎల్‌సి కవిత దానిని పోగొట్టుకోవడంతో పాటు బిఆర్ఎస్ పార్టీలో ఆమెకు ప్రాధాన్యత తగ్గిందని, దీంతో ఆమె రాజకీయంగా తన ఉనికిని కాపాడుకోవడానికి ఇప్పుడు బిసిల పేరిట కపట నాటకం మొదలుపెట్టారని, అందులో భాగంగానే ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపట్టారన్నారు.

## విద్యార్థినులకు రక్షణ కల్పించడంలో సిఎంఆర్ యాజమాన్య నిర్లక్ష్యం

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శి

కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడ్చల్ జిల్లాలోని సిఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల బాలకల హాస్టల్ బాత్ రూంలో విద్యార్థినులను వీడియోలు తీసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సిఎంఆర్ యాజమాన్యంకి డొనేషన్ వసూళ్లపై ఉన్న శ్రద్ధ విద్యార్థినులకు రక్షణ కల్పించడంపై లేదని, సిఎంఆర్ కళాశాల చైర్మన్ ఎంఎల్ఎ మల్లారెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కళాశాల గరల్స్ హాస్టల్ బాత్ రూంల కిటికీల నుండి విద్యార్థినులను వీడియో తీస్తున్నారని విద్యార్థినిలు అనేక రోజులుగా చెపుతున్నా కళాశాల యాజమాన్యం పట్టించుకోవడంలేదని, బుధవారం బాత్‌రూం వెంటిలేటర్ బయట నుండి ఎవరో చూస్తున్నారని, కెమెరా తీస్తున్నారని బయటికి వెళ్లి చూడగా వెంటిలేటర్ పైన చేతి వెళ్ళు ఉండడం గమనించిన తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో గురువారం కళాశాల ముందు వందలాది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ధర్నా చేపట్టినా కళాశాల యాజమాన్యం స్పందించలేదని, కనీసం బయటికి కూడా రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా కళాశాలలో జరుగుతున్న అక్రమాలు, అధిక ఫీజులపై ప్రశ్నిస్తున్న విద్యార్థినులపై ఈ వీడియోలు చూపిస్తూ బెదిరిస్తున్నారని తెలిపారు.

సిఎంఆర్ కళాశాలపై గత కొన్ని నెలల నుండి అనేక ఫిర్యాదులు ఉన్నాయని ప్రభుత్వ భూముల కబ్జాల ఆరోపణలు, ఇష్టానుసారంగా ఫీజుల వసూళ్లు, విద్యార్థులకి వేధింపులు, ఆత్మహత్యలు, హాస్టల్‌లో ఫుడ్ నాణ్యత లేకపోవడంపై ఆరోపణలు వస్తున్నా అధికారులు, యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. కళాశాలలో హాస్టల్‌లో విద్యార్థినిల వీడియోలు తీస్తూ వారిని భయపెట్టాలని చూసిన వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టి విద్యార్థినులను వీడియోలు తీసినవారి దగ్గర నుండి ఆ వీడియోలు డిలీట్ చేయించాలని, విద్యార్థినుల రక్షణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల చైర్మన్ మల్లారెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## వడ్డెరలను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

రాష్ట్ర సదస్సులో వక్తల డిమాండ్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** సంచార శ్రమ జీవులైన వడ్డెరలను దేశంలోని కొన్ని రాష్ట్రాలలో ఎస్‌సిలుగా, ఎస్‌టిలుగా పరిగణిస్తున్నట్లుగానే తెలంగాణ రాష్ట్రంలో కూడా వడ్డెర జాతిని గిరిజన తెగల (ఎస్‌టి)లో చేర్చాలని, వడ్డెరలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అఖిలభారత వడ్డెర, వోడ్, బోవి, బెల్దార్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వడ్డెరల రాష్ట్ర సదస్సు గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో జరిగింది. సదస్సులో తెలంగాణ రాష్ట్ర ఎంబిసి చైర్మన్ జెరిపాటి జైపాల్, అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి, ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు వేముల తిరుమల దేవి, ప్రధాన కార్యదర్శి గుంజ రేణుక, రాష్ట్ర అధ్యక్షురాలు మంచపు రమ, యువజన విభాగం జాతీయ అధ్యక్షులు మంజల రమేష్ తదితరులు ప్రసంగించారు. సదస్సులో వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంజల హనుమయ్య, నాయకులు సాతల గోపాల్, ఇడగోటి నగేష్ (కార్మిక విభాగం), ఇడగోటి పార్వతి (మహిళా విభాగం), బొంత చిరంజీవి, బోదాసు శ్రీనివాస్, రేపన్ గిరిబాబు (యువజనవిభాగం) పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
గాజులరామారం సర్కిల్–26

NIT No.16/DB/EE/GJRM/CIRCLE-26/GHMC/2024-25 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 02.01.2025

**పని పేరు:** తుఫాను నీటి కాలువ నిర్మాణం మరియు మరమ్మత్తులు. **అంచనా విలువ:** రూ.12.10 లక్షలు, **ప్రారంభ తేది:** 03.01.2025న మ.2.00గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: ప్రారంభ తేది:** 10.01.2025న మ.03.00గం.ల వరకు, ఇఇ **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-26, జిహెచ్ఎంసి. ఫోన్: 9849906776. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్–26, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 8573-PP/CL/ADVT/1/2024-25, Date: 02-01-2025

దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ మల్లికార్జునస్వామి దేవస్థానం, ఓదెల గ్రా|| & మం||, జి: పెద్దపల్లి.**

లేఖ నెం. SMSD/2024 టెండర్ కం బహిరంగ వేలముల ప్రకటన తేది: 31.12.2024

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! సదరు దేవస్థానము యొక్క ఈ దిగువ పేర్కొనబడిన లైసెన్స్ హక్కులు టెండర్ కం బహిరంగ వేలము ద్వారా ఇచ్చుటకు గాను తేది: 10-01-2025 శుక్రవారం రోజున ఉదయం 10-00 గం.ల నుండి దేవాలయ ఆవరణలో కార్యనిర్వాహణాధికారి సమక్షములో నిర్వహించబడును. ఇట్టి విషయమై ఔత్సాహికుల నుండి ధరఖాస్తులు ఆహ్వానించనైనది.

| క్ర.సం. | లైసెన్స్ హక్కు | ధరావత్తు సొమ్ము | కాలపరిమితి |
|---|---|---|---|
| 1 | తలనీలాలు ప్రోగు చేసుకొను హక్కు | 80,000/- | తేది: 11-01-2025 నుండి తేది:10-01-2026 వరకు |
| 3 | ప్యాలాలు - పుట్నాలు అమ్ముకొను లైసెన్స్ హక్కు | 50,000/- | తేది: 03-03-2025 నుండి తేది: 02-03-2026 వరకు |
| 4 | వంట చెరుకు అమ్ముకొను లైసెన్స్ హక్కు | 1,00,000/- | |
| 5 | తల్లి ఆరాధన లైసెన్స్ హక్కు | 30,000/- | |

టెండరు దరఖాస్తు ఫారం తేది: 01-01-2025 నుండి 10-01-2025 ఉదయం 10:00 గం.ల వరకు రూ.500/- నగదు చెల్లించి దేవస్థానములో పొందవలెను. ధరావత్తు సొమ్ము ఏదేని బ్యాంకు నందు శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానము, ఓదెల పేరున డి.డి. (డిమాండ్ డ్రాఫ్ట్) రూపంలో లేదా నగదు రూపేణా వేలం పాటకు ముందు చెల్లించవలెను. హెచ్చుపాటాదారుడు పాట ముగిసిన వెంటనే పూర్తి పేమెంట్ చెల్లించవలెను. మిగతా షరతులు టెండర్ కం బహిరంగ వేలముకు ముందు చదివి వినిపించవలెను. ఇతర వివరములకై దేవస్థాన కార్యాలయంలో సంప్రదించగలరు.

DIPR R.O. No. : 8556-PP/CL/ADVT/1/2024-25, Date: 02-01-2025 - కార్యనిర్వాహణాధికారి

ప్రజాపక్షం
శుక్రవారం, జనవరి 03

# ప్రచారం బాటలో కాంగ్రెస్

కాంగ్రెస్ సిడబ్ల్యుసి డిసెంబర్ 26న కర్నాటకలోని బెళగావి సమావేశంలో నిర్ణయించినట్లు 'జై బాపు', 'జై భీమ్', 'జై సంవిధాన్' ప్రచారాందోళన కార్యక్రమం శనివారం ప్రారంభం కానుంది. వాస్తవానికి ఆ కార్యక్రమం డిసెంబర్ 27న బెళగావిలోనే పెద్ద బహిరంగ సభతో ప్రారంభం కావలసింది. అయితే మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతితో ఆ కార్యక్రమం వాయిదా పడింది. ఇది చాలా ఆశాపూరితమైన కార్యక్రమం. మహాత్మాగాంధిపై ద్వేషం నిండిన ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు మొక్కుబడిగా నివాళులర్పిస్తూ, రెండోవైపున దళిత మహానాయకుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించిందంటూ దాడిచేస్తూ ఆయన వారసత్వం సొంతం చేసుకోవటానికి ఆపద మొక్కులు మొక్కుతున్నాయి. జాతీయోద్యమంలో పాత్ర, నాయకులు లేని బిజెపి, (జనసంఘ్) బ్రిటిష్‌వారికి తోడ్పడిన ఆర్‌ఎస్‌ఎస్‌లు సర్దార్ వల్లభాయి పటేల్‌ని తమ ఖాతాలో వేసుకున్నట్లే అంబేద్కర్‌పై పేటెంట్ కోసం ప్రయత్నిస్తున్నాయి. వారి వాదనలను పూర్వపక్షం చేసి మహాత్మాగాంధి, అంబేద్కర్‌లను సామాజిక న్యాయంకోసం జీవితాలు ధారపోసిన మహనీయులుగా ఒకే చట్రంలోకి తేవటానికి కాంగ్రెస్ ప్రయత్నం చేస్తున్నది. 1924 డిసెంబర్ 26న బెళగావిలో కాంగ్రెస్ 39వ మహాసభకు మహాత్మాగాంధి అధ్యక్షత వహించిన శతవార్షికోత్సవ సంస్మరణగా బెళగావిలో సిడబ్ల్యుసి సమావేశం నిర్వహించారు. అక్కడ కాంగ్రెస్ పార్టీ నెలరోజుల ప్రచార కార్యక్రమం నిర్ణయించింది. అది జనవరి 26న డాక్టర్ అంబేద్కర్ జన్మస్థానమైన మధ్యప్రదేశ్‌లోని మౌలో ముగుస్తుంది.

భారత రాజ్యాంగాన్ని, జాతీయోద్యమ ఆదర్శాలను రక్షించేందుకు నిబద్ధమైన కాంగ్రెస్, రాజ్యాంగం అమలులోకి వచ్చిన, భారత రిపబ్లిక్ వ్యవస్థాపితమైన 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంవత్సరంపాటు ప్రచార కార్యక్రమం తలపెట్టింది. 2025 జనవరి 26 – 2026 జనవరి 26 మధ్య 'రాజ్యాంగ రక్షణ'కై జాతీయ పాదయాత్ర తలపెట్టింది. అది గ్రామం నుంచి గ్రామానికి, పట్టణం నుంచి పట్టణానికి రిలే పద్ధతిలో నిర్వహించబడుతుంది. ఆ విధంగా అన్ని స్థాయిల్లోని నాయకులను పాదయాత్రలో భాగస్వాముల్ని చేయాలని తలపెట్టింది. రాజ్యాంగానికి బిజెపి తలపెట్టిన ద్రోహాన్ని కాంగ్రెస్ పార్టీ 2024లోక్‌సభ ఎన్నికల్లోనే బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దళితులు, ఇతర బలహీన తరగతులకు ఇచ్చిన రక్షణలను వమ్ముచేయటానికి, ముఖ్యంగా రిజర్వేషన్‌లకు తూట్లు పొడవటానికి బిజెపి ఉద్దేశించిందని ఇండియా కూటమిగా ఎండగట్టింది. అది జనాల్లో నాటుకుంది. దాని పర్యవసానమే లోక్‌సభలో 400 సీట్లు ఆశించిన బిజెపికి కనీసమెజారిటీ కూడా ఇవ్వకుండా ఓటర్లు 240సీట్లకు పరిమితం చేశారు. ఇప్పుడు బిజెపి అవకాశం లభించినపుడల్లా రాజ్యాంగంపై నిబద్ధత ప్రకటిస్తూ, రిజర్వేషన్‌లు యథాతథంగా ఉంటాయని ఉద్ఘాటిస్తోంది. అయితే కడుపులోని ఉక్రోసం ఎప్పుడో ఒకప్పుడు బయటపడక పోదు. రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో చర్చ సమయంలో హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్షాలను ఉద్దేశించి 'అంబేద్కర్ పేరు ప్రస్తావించటం ఈ రోజుల్లో ఫ్యాషన్ అయింది. అన్నిసార్లు అంబేద్కర్ పేరు బదులు దేవుడిపేరు స్మరిస్తే స్వర్గానికైనా పోతారు' అన్న వ్యాఖ్యలతో ప్రతిపక్షాల నిరసన ప్రారంభమైంది. పార్లమెంటు స్తంభించింది. దానినుండి ప్రజల దృష్టి మరల్చేందుకు బిజెపి వ్యూహకర్తలు పార్లమెంటు మెట్ల వద్ద రభస సృష్టించారు. ఇప్పుడు కాంగ్రెస్ సంవత్సరంపాటు దేశమంతటా సాగించే ప్రచార కార్యక్రమం ఆ నిరసన కొనసాగింపే.

అయితే గాంధీజి, డాక్టర్ అంబేద్కర్ మధ్య అభిప్రాయ భేదాలు లేకపోలేదు. కులవ్యవస్థ, అంటరానితనం గూర్చిన వారి అవగాహనలో వ్యత్యాసం ఉంది. అంబేద్కర్ సామాజిక సంస్కరణ ఉద్యమాన్ని గాంధీజి బలపరచలేదు. అయితే దళితుల ఉద్ధరణ విషయంలో, అంటరానితనం నిర్మూలనలో ఆ ప్రముఖులిరువురివీ భిన్నమార్గాలు తప్ప వైరుధ్యం కాదు. కులవ్యవస్థను, నిమ్నోన్నత దొంతరలను, అంటరానితనాన్ని ప్రతిపాదించిన, సమర్థించిన మనుస్మృతిని ఆరాధించేవారు అంబేద్కర్ వారసత్వంకోసం ప్రాకులాడటం వింతల్లో వింత. కాదంటారా?

# ఎప్పుడొచ్చామని కాదు, బుల్లెట్ దిగిందా... లేదా?



ఎస్‌కె. జకీర్
9052631212
సీనియర్ జర్నలిస్ట్

"ఎప్పుడొచ్చావన్నది కాదన్నయ్యా బుల్లెట్ దిగిందా లేదా" అన్నదే ప్రధానం. ఫ్లై ఓవర్‌లు మావే, ఔటర్ రింగు రోడ్డు మాదే, హైదరాబాద్ అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్లం మేమే, రీజనల్ రింగు రోడ్డు మాదే, మెట్రో రైలు మా పుణ్య మే ..ఇలా బిఆర్‌ఎస్ నాయకులు చెప్పుకుంటూ పోతుంటారు. ఏడాదికాలంగా అలు పెరగకుండా ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. ఒక ప్రభుత్వ హయాంలో కొన్ని కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి ఉండవచ్చు. తర్వాత వచ్చే ప్రభుత్వం ఆ కార్యక్రమాలను పూర్తి చేయడం సాధారణంగా ఉన్న ఆనవాయితీయే. కాగా మెట్రో రైలు మార్గాన్ని విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ సంకల్పించారు. పారడైజ్ సర్కిల్ నుంచి మేడ్చల్ వరకు, జూబిలీ బస్‌స్టేషన్ నుంచి శామీర్ పేట్ వరకు మెట్రో రైలు మార్గాన్ని పొడిగించడానికి డిపిఆర్ సిద్ధం చేయాలని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండిని, సిఎం జనవరి 1న ఆదేశించారు.

"కేవలం టెండర్లు పిలిచి రేవంత్ ప్రభుత్వం తన గొప్పగా చెప్పుకుంటున్నది. కెసిఆర్ దూరదృష్టితో రీజినల్ రింగురోడ్డు ఆలోచన చేశారు. హైదరాబాద్ నగరానికి వచ్చే పది జాతీయ రహదారులను అనుసంధానించేలా ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ రూపొందించారు. ఔటర్ రింగు రోడ్డు తరహాలో సుమారు 300 కిలోమీటర్ల మేర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ట్రిపుల్ ఆర్ నిర్మిస్తే వేల కోట్ల ప్రజల ధనం ఖర్చవుతుందని నాడు కెసిఆర్ భావించారు. అనేక చర్చల అనంతరం ఉత్తర భాగానికి చెందిన ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి అనుమతులు లభించాయి. దక్షిణభాగానికి సైతం కెసిఆర్ హయాంలోనే ప్రణాళికలు జరిగాయి. ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రతిపాదనలు ఆగాయి". అని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి వినోద్ కుమార్ బోయినపల్లి అన్నారు.

కేంద్రంతో సత్సంబంధాలు లేనందుకే తమకు కేంద్రం నిధులు ఇవ్వలేదన్న విషయాన్ని ఒప్పుకోవడానికి బిఆర్‌ఎస్ ఎప్పుడూ సిద్ధంగా లేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో 'ట్రిపుల్ ఆర్'కు అనుమతులు, నిధులు సాధించారు. ఈ విషయంలో చొరవ తీసుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి సక్సెస్ అయినందుకు రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని అభినందిస్తూ ఆయనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్ చేయడం మంచి పరిణామం. మంత్రులను తమ ఇంట్లో 'పాలేర్ల'గా ట్రీట్ చేసిన కాలంముగిసి 13 నెలలు గడచిపోయాయి. అలా 'పాలేర్ల'గా పనిచేసినా, వారి మైండ్ సెట్ అధికారం కోల్పోయాక కూడా మారడం లేదు. మరలా అధికారంలోకి వస్తే 'సారు' దగ్గర 'బానిసలుగా' పనిచేయడానికి ఉత్సాహంగా ఉండడం ఒక విషాదం. కాగా సిఎం రేవంత్ రెడ్డి తన మంత్రివర్గ సహచరుల 'ఫెర్ఫార్మెన్సు'ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వారిని వెన్నుతట్టి ప్రోత్సహించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు.

తెలంగాణ అభివృద్ధికి రీజినల్ రింగ్ రోడ్డు 'సూపర్ గేమ్ ఛేంజర్' గా మారనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే సగం తెలంగాణ అభివృద్ధి చెందుతుంది. హైదరాబాద్ అభివృద్ధికి అవుటర్ రింగు రోడ్డు 'గేమ్ ఛేంజర్'. రీజనల్ రింగు రోడ్డు 'సూపర్ గేమ్ ఛేంజర్' అవుతుంది. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణాన్ని బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. యుటిలిటీ ఛార్జీలు 360కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించకపోవటం వలన ప్రాజెక్టు ఆలస్యమైందని కాంగ్రెస్ ప్రభుత్వ వాదన. రీజనల్ రింగు రోడ్డు నిర్మాణం పూర్తి అయితే 'సగం తెలంగాణ ముఖచిత్రం' మారిపోతుంది. ప్రాంతీయ రింగ్ రోడ్డును ఉత్తర, దక్షిణ భాగాలుగా విడగొట్టారు. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు ఆవలినుంచి ఆర్‌ఆర్‌ఆర్‌ను 347.85 కి.మీ.ల మేర రెండు భాగాలుగా నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి.

రీజినల్ రింగ్‌రోడ్డు చుట్టూ రిజనల్ రింగ్ రైల్వే ప్రాజెక్టును కూడా చేపడతామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గతంలో వెల్లడించారు. హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతుండటంతో భవిష్యత్తు అవసరాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. 'ఆర్‌ఆర్‌ఆర్' అందుబాటులోకి వస్తే ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు వస్తాయి. తద్వారా అక్కడి భూములకు రెక్కలు రానున్నవి. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ఎకరా రూ.కోటి నుంచి రూ.3కోట్ల వరకు పలుకుతుండగా మరింత పెరిగే ఛాన్స్ ఉంది. తెలంగాణలోని 6 రాష్ట్ర రహదారులను నేషనల్ హైవేలుగా అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని ప్రభుత్వం కోరుతోంది.

అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరానికి 'ఫ్యూచర్ సిటీ' మరో మణిహారం కాబోతోంది. గ్రేటర్ సిటీ శివారు ప్రాంతం ముచ్చర్లలో 'ఫోర్త్ సిటీ' నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే 'స్కిల్ యూనివర్సిటీ' పనులు ప్రారంభమయ్యాయి. 'ఎఐ సిటీ' నిర్మాణానికి ప్రణాళికలను రేవంత్ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలోనే భవిష్యత్తు నగర ఏర్పాటుకు ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా అనుకున్న సమయానికి పూర్తి చేసేందుకు 'ప్రత్యేకంగా అథారిటీ'ని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నది. ఇక సినీరంగం అభివృద్ధికోసం 2వేల ఎకరాలను 'ఫ్యూచర్ సిటీ'లో కేటాయించాలని ఫిలిం డెవలప్‌మెంటు కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ముఖ్యమంత్రి రేవంత్ కు విజ్ఞప్తి చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడే హైదరాబాద్ నగరం విస్తరించిందనో, అభివృద్ధికి పేటెంటు హక్కులు తమకే లభించాయనో బిఆర్‌ఎస్ నాయకులు పదే పదే చెబుతున్నా అది సత్యదూరం. అదివరకటి పాలకవర్గాలు చేపట్టిన పనులను కూడా తమ ఖాతాలో వేసుకోగల సమర్థులు, ఘనులు బిఆర్‌ఎస్ నాయకులు.

> గ్రేటర్ హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చేసే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నది. మహా నగరం లో మౌలిక వసతుల ఏర్పాటుకుగాను భారీ ప్రణాళికల్ని సిద్ధం చేసింది. తాగునీటి సౌకర్యం మొదలుకొని అండర్ పాస్‌లు, ఫ్లైవర్ లు, స్కై వేస్, ట్రాఫిక్ జంక్షన్లు వంటి పలు మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి రేవంత్ సంకల్పించారు. ఈ కార్యక్రమాలన్నీ పూర్తయి తే హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో 'రియల్ ఎస్టేట్' రంగం ఊపందుకుంటుందని ఈ రంగంలోని ప్రముఖుల అంచనా.

'ఫ్యూచర్ సిటీ'ని అన్ని వర్గాలకు అనువుగా ఉండే నగరంగా నిర్మించడానికి పక్కా ప్రణాళికలను రేవంత్ సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగానే 'ఫోర్త్ సిటీ' కోసం ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉన్నది. ఈ ప్రక్రియలో వివిధ విభాగాల మధ్య సమన్వయంతో పాటు ప్రభుత్వ ఆలోచనల అమలును పర్యవేక్షించేలా 'అథారిటీ' పని చేయనుంది. ఈ అథారిటీకి సీనియర్ ఐఎఎస్ అధికారి నేతృత్వం వహించవచ్చు. 'ఫోర్త్ సిటీ' కోసం ఏర్పాటు చేయనున్న అథారిటీ సైబరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌తో పాటు ఢిల్లీ సమీపంలో ఉన్న నేషనల్ క్యాపిటల్ రీజియన్, గ్రేటర్ నోయిడా సహా మరికొన్ని సంస్థల పనితీరును అధ్యయనం చేయనుంది. కొత్త నగరంలో పారిశ్రామిక, పర్యాటక, ఆతిథ్య రంగాలకు కీలక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ భావన. కొన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. 'ప్రత్యేక అథారిటీ' ఆధీనంలో పని చేయడానికి రెవెన్యూ, పట్టణాభివృద్ధి తదితర విభాగాల సిబ్బందిని తీసుకునే అవకాశాలున్నవి. భవిష్యత్తు నగరంలో ప్రతిష్టాత్మకమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రపంచ స్థాయి ప్రైవేట్ సంస్థలు రాబోతున్నవి. అందుకే అన్నింటి మధ్య సమన్వయం చేస్తూ పేద, మధ్య తరగతి వారికి 'ఫ్యూచర్ సిటీ'లో స్థానం కల్పించేలా అథారిటీ పనిచేయనుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 'గ్రీన్ ఫీల్డ్ రహదారి'ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు నుంచి శ్రీశైలం నేషనల్ హైవే వరకు 40కి.మీ పొడవునా 'గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు'ను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 13 రావిర్యాల నుంచి కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట వరకు మొత్తం 6 లైన్ల గ్రీన్ ఫీల్డ్ రహదారిని నిర్మించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో మీర్‌ఖాన్‌పేట నుంచి రీజనల్ రింగ్ రోడ్ వరకు ఈ రహదారిని అనుసంధానించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

గ్రేటర్ హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చేసే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నది. మహా నగరం లో మౌలిక వసతుల ఏర్పాటుకుగాను భారీ ప్రణాళికల్ని సిద్ధం చేసింది. తాగునీటి సౌకర్యం మొదలుకొని అండర్ పాస్‌లు, ఫ్లైవర్ లు, స్కై వేస్, ట్రాఫిక్ జంక్షన్లు వంటి పలు మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి రేవంత్ సంకల్పించారు. ఈ కార్యక్రమాలన్నీ పూర్తయి తే హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో 'రియల్ ఎస్టేట్' రంగం ఊపందుకుంటుందని ఈ రంగంలోని ప్రముఖుల అంచనా. నగరంలోని కెబిఆర్ పార్కు చుట్టూ 6 జంక్షన్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాదాపు 826 కోట్లతో ఆరు జంక్షన్లను అభివృద్ధికి సంబంధించిన పనులను సిఎం శంకుస్థాపన చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతంలో మెరుగైన నీటి సరఫరాకోసం జలమండలి మంజూరు చేసిన 71 రిజర్వాయర్లలో ఇప్పటికే కొన్ని ప్రారంభం కాగా మరో 20 రిజర్వాయర్‌లు అందుబాటులోకి వచ్చాయి. రాజీవ్ రహదారిపై ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఒఆర్‌ఆర్ జంక్షన్ వరకు 18.124 కి.మీ పొడవుతో ఎలివేటెడ్ కారిడార్ కోసం రూ. 3,619 కోట్లు ఖర్చు చేయనున్నారు. జాతీయ రహదారి 44పై ప్యారడైజ్ జంక్షన్ నుంచి డైరీఫాం వరకు రూ.1487కోట్ల వ్యయంతో 5.32 కి.మీ. పొడవుతో మరో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ను నిర్మిస్తున్నారు. బెంగళూరు జాతీయ రహదారిని చింతల్ మెట్ రోడ్డు కు అనుసంధానం చేసేలా మిరాలం ట్యాంకు మీదుగా రూ.363 కోట్ల వ్యయంతో 4 లైన్ల హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. 28.15 కోట్ల వ్యయంతో మరో నాలుగు రోడ్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. హైదరాబాద్ శివారు ప్రాంతా ల్లో ఉన్న భూములే అత్యధిక ధర పలుకుతున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా ప్రయాణం సులభంగా మారింది. ట్రాఫిక్ సమస్యలు తప్పాయి. ఒఆర్‌ఆర్‌కు ఆనుకుని భారీగా 'రియల్ వెంచర్లు' వెలిశాయి. 'ఫోర్త్ సిటీ'ని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించాక భూముల ధరలకు మరోసారి రెక్కలు వచ్చాయి. ఇక్కడ రీజనల్ రింగ్ రోడ్డు జంక్షన్ కూడా త్వరలోనే రాబోతోంది. కందుకూరు హైదరాబాద్ కు దూరమే అయినప్పటికీ ప్రభుత్వం తలపెట్టిన ఫోర్త్ సిటీకి పునాదులు పడిన తర్వాత చాలా దగ్గర అవుతుంది. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోనే కాదు, దాదాపు 100 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాంతాల్లో సైతం భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. 20ఏళ్ల కిందట 20వేలకు ఎకరం భూమి ఇప్పుడు 20 లక్షలు పలుకుతోంది.

బిఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో విఫలమైంది. ఫలితంగా రీజినల్ రింగురోడ్డు సహా వివిధ ప్రాజెక్టుల నిర్మాణాల్లో జాప్యం ఏర్పడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టడంలో విజయం సాధిస్తున్నారు.

# సామాజిక విప్లవకారిణి, సావిత్రిభాయి ఫూలే



నేదునూరి జ్యోతి
ప్రధాన కార్యదర్శి
భారత జాతీయ మహిళా సమాఖ్య
తెలంగాణ స్టేట్‌కౌన్సిల్
(ఎన్ఎఫ్ఐడబ్ల్యు)
9908284996



జనవరి 3 సావిత్రిబాయి పూలే 194వ జయంతి

స్త్రీ జాతి ఆణిముత్యం ఆమె. కరుడుగట్టిన బ్రాహ్మణిజం కబంధహస్తాల నుంచి స్త్రీ జాతికి విముక్తి కల్పించిన మహా సంకల్పి ఆ మాతృమూర్తి. స్త్రీ బయటకు వెళ్లాలంటే పరదా వేసుకోవాలని శాసించిన సమాజాన్ని చీల్చి సమస్త భారత మహిళాలోకానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ప్రసాదించిన మానవి ఆమె. తను చదువుకుని సాటి స్త్రీలకు విద్య చెప్పడానికి రాళ్ళు, రప్పలు, పేడ, పిడకలు తనమీద పడుతున్నా వాటిని పువ్వుల్లా భావించి లక్ష్య సాధనలో వెనకడుగు వేయని ధీశాలి. పురుషులే కాదు, సాటి స్త్రీల సూటిపోటి మాటలను ఆశీర్వచనాలుగా స్వీకరిస్తూ ముందుకు సాగిన మహిమాన్విత ఆ మాతృమూర్తి, మహాసాధ్వియే సావిత్రిభాయి పూలే.

వేల సంవత్సరాలుగా భారత స్త్రీకి విద్య అందుబాటులో లేదు. ఆ విద్య విజ్ఞాన జ్యోతిని స్త్రీ జాతికి ప్రసాదించిన సాహసనారి ఆమె. మనువాదుల చెర నుండి విడిపించి భారత స్త్రీ జాతికి విముక్తి అందించింది సావిత్రీ భాయిఫూలే. ఆమె మానవ జాతికి ఒక రోల్ మోడల్. ఒక స్త్రీగా, వ్యక్తిగా, భార్యగా, తల్లిగా, సమాజ హితకారిణిగా ఒక వ్యక్తి ఎలా ఉండాలో నిరూపించిన ఆదర్శనారి.

సావిత్రీభాయి పూలే 1931సం॥ జనవరి, 3న దక్షిణ మహారాష్ట్రలోని సతారా జిల్లాలోని నాయగావ్ అనే పల్లెటూరిలో పుట్టారు. ఆమె తండ్రి పేరు ఖండోజీ సేవనే పాటిల్, తల్లి లక్ష్మీబాయి. నేటికి 194సం॥లు గడిచినప్పటికి సమాజంలో సమూలమైన స్త్రీ సమానత్వం సాధించబడలేదు. కావున అసమానంగా ఉండడం సావిత్రీ భాయి పూలే యొక్క ఆవశ్యకత, అనివార్యత ఎంతైన కలదు. సావిత్రీ భాయి పూలే జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమైనది. ఆమె నిర్వహించిన పోరాటాలను నడిపిన పాఠశాలను ఆదర్శంగా తీసుకుందాం. ఆమె అనేక వివక్షతలను, అవమానాలను ధైర్యంగా ఎదుర్కొన్న సాహసికురాలు.నేటికి సమాజంలో కొనుసాగుతున్న నేపథ్యంలో మహిళా సాధికారత కొరకు ఎన్.ఎఫ్.ఐ.డబ్లు.స్త్రీలపై జరుగుతున్న దోపిడీ, పీడన, వివక్షతలను అధిగమిస్తు ప్రతిఘటిస్తూ మహిళా విముక్తి పోరాటాల్లో ప్రగతిశీల ప్రజలు, మహిళలు భాగస్వాములు కావాలని భారత జాతీయ మహిళా సమాఖ్య పిలుపునిస్తుంది.

మహారాష్ట్రలోని మాళీ రైతు కుటుంబంలో పుట్టిన సావిత్రి బాల్యం కట్టుబాట్లతో కాకుండా క్రమశిక్షణతో సాగింది. ఆమెకు చిన్నతనంలోనే వ్యవహార దక్షత, నిర్ణయాత్మకత అలవడ్డాయి. జ్యోతి బా ఫూలేతో తొమ్మిదేళ్ళకే పెళ్లయిన తర్వాత సావిత్రి భాయి చదువుకోవడం ప్రారంభించింది. చదువువల్ల ఆమె జీవితం క్రమంగా సామాజిక అంశాలపై దృష్టి సారించే వైపుకు మళ్ళింది. గురువుగా ఉన్న తన భర్త జ్యోతి బా ఫూలేను ముద్దుగా 'శేఠ్‌జీ' అని ఆమె పిల్చుకునే వారు. శేఠ్‌జీ పాఠాలు, చదువు మాధ్యమంగా చుట్టూ ఉన్న సమాజ స్థితిగతులను సావిత్రి భాయి క్రమంగా ఆకళింపు చేసుకోగలిగారు. అహ్మద్‌నగర్‌లోని పరారా ఇన్‌స్టిట్యూట్‌లోను, పూణేలోని మిస్, మిచెల్ నార్మల్ స్కూల్‌లో టీచర్ ట్రైనింగ్ కోర్సు చేశారు. ఆ తర్వాత 1848 లో పూణెలో భిడే అనే ఒక సజ్జనుడి ఇంటి అవరణలో పూలే దంపతులు మొదటి బాలికల పాఠశాల ప్రారంభించారు. అలాగే అతి శూద్రులైన మహర్, మాంగ్ (మాల, మాదిగ) లకు కూడా పాఠశాల ఆరంభించారు. వీటిని 'నేటివ్ స్కూల్స్'గా అభివర్ణిస్తారు.

1873లో ఏర్పాటైన సత్యశోధక్ సమాజ్ సంస్థకు సావిత్రి భాయి పూలే మూలస్తంభంగా నిలిచారు. బ్రాహ్మణుడు లేకుండా, కట్నం లేకుండా, తక్కువ ఖర్చుతో జరిగే ఆదర్శ వివాహాలను ఈ సమాజం ప్రోత్సహించింది. సమాజంలో పాతుకుపోయిన కొన్ని రూఢి వాదపు పోకడలను ఆమె ఎప్పటికప్పుడు తన చేతలతో అడ్డుకుంటూ వచ్చారు. ఈ పెళ్ళి ప్రమాణాల్లో భాగంగా వరుడు స్త్రీలను గౌరవిస్తానని, సమానతని గుర్తిస్తానని ప్రమాణం చేయాలి.

1830లో భర్త జ్యోతిబా ఫూలే మరణించినపుడు దహన సంస్కారాలు ఎవరు చేయాలనే విషయంలో వివాదం చెలరేగింది. ఆ సందర్భంలో సావిత్రి భాయి స్వయంగా తన భర్తకి అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన ఆస్థికల్ని ఒక తులసికోటపై ఉంచి, దానిపై భర్త పాదుకల బొమ్మను చెక్కించి, భర్తపై తన ప్రేమను సావిత్రి బా పూలే అలా అద్భుతంగా చాటుకున్నారు. 1877లో కరువు వచ్చిన సమయంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. 1897లో ప్లేగు వ్యాధి మహమ్మారి ప్రజల ప్రాణాల్ని హరిస్తున్నపుడు మహర్, మాంగ్‌ల పిల్లలను చంకనేసుకుని వైద్యం అందించే కార్యక్రమంలో సావిత్రి భాయి పూలే అహర్నిశలు కృషి చేశారు.

ఆధునిక భారతదేశంలో మొట్టమెదటిగా బ్రాహ్మణీయ కుల తత్వ సంస్కృతి, మత వ్యవస్థలపై యుద్ధం ప్రకటించిన వ్యక్తులు జ్యోతిరావు పూలే, ఆయన భార్య సావిత్రీబాయి. మహారాష్ట్రీయులైన ఈ దంపతులు మొదటిసారిగా సమగ్రమైన కుల వ్యతిరేక సిద్ధాంతానికి రూపకల్పన చేసి, ఆధిపత్య విలువలకు వ్యతిరేకంగా గొప్ప ప్రజాఉద్యమాలను నిర్మించారు. వారి సామాజిక, సాంస్కృతిక దృకృథంలోని మౌలికాంశం పీడితులందరినీ ఐక్యం చెయ్యటమే. స్త్రీలు శూద్రులు, అతిశూద్రులు అందరినీ ఒక తాటిమీదికి తీసుకురావటమే ఈ ఉద్యమ లక్ష్యం. (స్త్రీలు అంటే అన్నికులాల మహిళలు. శూద్రులంటే ఉత్పత్తిలో పాల్గొనే కులాల వారినీ, అతి శూద్రులంటే కులవ్యవస్థకు వెలుపల, శూద్రులకన్నా కిందిస్థానంలో ఉండే అస్పృశ్యులనీ పిలుస్తారు.)

1854లో సావిత్రీ భాయి తన కవితా సంపుటి 'కావ్యఫూలే'ను ప్రచురించింది. ఆనాటి సామాజిక పరిస్థితులకు ఆమె కవిత్వం అద్దం పట్టింది. జానపద కవితా ప్రక్రియ అయిన 'అభంగ్'ను ఆమె తన కావ్యరచనకు అనువైన రూపంగా ఎన్నిక చేసుకున్నది. ఆమె కవితాశైలి సూటిగా, సరళంగా ఉంటుంది. ప్రకృతి వర్ణనలతో కూడి న కొన్ని కవితలతో బాటుగా విద్య, కులవ్యవస్థ, ప్రజలపై అణిచివేత వంటి అంశాలన్నిటి మీదా ఆమె కవిత్వం రాసింది. ఈ కవితా రచనతో ఆమె ఆధునిక మరాఠీ కవిత్వానికి వైతాళికురాలుగా నిలిచింది.

"శ్రమించి పనిచెయ్యండి, శ్రద్ధగా అధ్యయనం చెయ్యండి, మంచి మార్గంలో నడవండి", అనేది సావిత్రి భాయి నినాదం. మానవుల అభివృద్ధికి విద్య, శ్రమ ఎంత అవసరమైనవో ఆమె పదేపదే చెప్తుండేది. స్త్రీలు పురుషులతో సమానులే తప్ప, బానిసలు కాదనీ, స్త్రీలకు విద్య అత్యావశ్యకమని ఆమె బలమైన విశ్వాసం.

విద్యార్థినులపై సావిత్రీ భాయి ప్రభావం బలంగా ఉండిం ది. ఆమె దగ్గర చదువుకున్న ముక్తాబాయి అనే పదకొండేళ్ళ దళిత బాలిక ఆనాటి సమాజంలో అస్పృశ్యులపై బ్రాహ్మణీయ మత సంస్కృతులు చేసే పెత్తనాన్నీ, అవమానాలను విమర్శిస్తూ అద్భుతమైన వ్యాసం రాసింది. ఆ వ్యాసాన్ని 'ధ్యానోదయ'అనే పత్రిక ప్రచురించింది. దేశంలో, రాష్ట్రంలో స్త్రీల సమస్యలపై విస్తృతంగా చర్చ సాగుతున్న నేపథ్యంలో స్త్రీలలో చైతన్యం, కదలిక పెరిగింది. వివిధ సంఘాల్లో మహిళలు సంఘటితం అవుతున్నారు. ప్రస్తుత దోపిడీ వ్యవస్థను నిర్మూలించి నూతన ప్రజాతంత్ర వ్యవస్థను నిర్మించే కర్తవ్యంలో భాగంగా స్త్రీల విముక్తిని సాధించాలనే సంకల్పంతో భారత జాతీయ మహిళా సామాఖ్య, మహిళ ప్రతిఘటన పోరాటాలల్లో ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీల మహిళలు సావిత్రిభాయి పూలే జయంతి సందర్భంగా భాగస్వాములు కావాలని పిలుపునిస్తోంది.

# మనందరి ఐన్‌స్టీన్... సత్యేంద్రనాథ్ బోస్

ఈ శతాబ్దాన్ని అత్యంత ప్రభావితం చేసిన విఖ్యాత మేధావుల్లో ప్రముఖులు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ మరియు మేరీ క్యూరీ. వీరిద్దరితో సైతం అభినందించబడ్డ...మన భరతమాత ముద్దుబిడ్డ, ఇలాంటి విఖ్యాత మేధావులు ఎందరో గుర్తించిన భారతరత్నం, విఖ్యాత భౌతిక శాస్త్రవేత్త సత్యేంద్రనాథ్ బోస్. 'An Important Step Forward' అంటూ ఐన్‌స్టీనే మన బోస్ పరిశోధనా పత్రం 'Planks law and Hypothesis of Light Quanta'ను జర్మనీ భాషలోకి అనువదించారు. అలాగే ఐన్‌స్టీన్‌కు అసాధారణ రీతిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించిపెట్టిన సాపేక్ష సిద్ధాంతాన్ని ఆంగ్లంలోకి అనువదించారు బోస్. ఇప్పుడన్నా... మనందరం గుర్తించి, ఆయన స్ఫూర్తి వారసత్వాన్ని నేటితరం కొనసాగించాల్సి వుంది. భారతీయ భౌతిక శాస్త్రవేత్తల్లోనే 'బాహుబలి'గా మనం బోస్‌ను చెప్పవచ్చు. ఒక్క రంగంలోనో, ఒక్క సబ్జెక్ట్‌లోనో అసాధారణ ప్రావీణ్యం ప్రదర్శించడమే గొప్ప అనుకుంటున్న తరుణంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిలాసఫీ, ఆర్ట్స్, సాహిత్యం, సంగీతం తదితర అంశాల్లో సైతం అద్భుతమైన ప్రతిభను కనబరిచారు బోస్. ఆసియా ఖండంలోనే సాహిత్యంలో తొలి నోబెల్ బహుమతి గెలిచిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 1937లోనే తన పుస్తకం 'విశ్వ పరిచయ్'ను బోస్‌కు అంకితం ఇచ్చారు. నేడు సత్యేంద్రనాథ్ బోస్ ఉదయించిన దినం. బోస్ 1894 జనవరి 1న ఉదయించి 1974 ఫిబ్రవరి 4 న అస్తమించారు.

విఖ్యాత భారతీయులు జగదీశ్ చంద్రబోస్ మరియు ప్రఫుల్ల చంద్ర రాయ్‌లు సత్యేంద్రనాథ్ గురువులు. విఖ్యాత భారతీయ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త మేఘనాథ్ సాహా సత్యేంద్రనాథ్‌కు స్నేహితుడు. క్వాంటం భౌతికశాస్త్రంలో బోస్ ఐన్‌స్టీన్ స్టాటిస్టిక్స్, బోస్ ఐన్‌స్టీన్ కండెన్సెడ్ థియరీలు చాలా ప్రఖ్యాతి పొందాయి. ఐన్‌స్టీన్‌తో కలిసి బోస్ వీటిపై పరిశోధనలు చేశారు. సివిరామన్, మేఘనాథ్ సాహా, సత్యేంద్రనాథ్ బోస్‌లను నేటి శతాబ్దపు భారతీయ భౌతిక శాస్త్రవేత్తల త్రయం(త్రిమూర్తులు)గా చెప్పవచ్చు. సత్యేంద్రనాథ్ బోస్ పరిశోధనలపై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు నోబెల్ బహుమతి గెలిచారు. కానీ మన బోస్ నోబెల్ బహుమతికి నామినేట్ అయినప్పటికీ గెలవక పోవడం నేటికీ ఆశ్చర్యకరం. చరిత్ర గమనించి పరిశీలిస్తే మనదేశంలోని చాలామంది విఖ్యాత శాస్త్రవేత్తలకు ఈ దేశంలో అనుకున్నంత గుర్తింపు, ప్రోత్సాహం అందలేదని ఎంతోమంది నాలాంటి సామాన్యులు కూడా ఆవేదనతో చెందుతున్న విషయం. ఈ దేశపు యువతలో మెజారిటీ భాగం సినిమా హీరోలను, క్రికెటర్లను, రాజకీయ నాయకులను మాత్రమే అనుసరిస్తుంటారు. కానీ తమ జీవితాలను ఈ దేశ శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధికోసం త్యాగంచేసిన విక్రమ్ సారాభాయ్, హోం జహంగీర్ బాబా, అబ్దుల్ కలాం వంటి మహానుభావుల గురించి పెద్దగా తెలుసుకోవటం లేదు. ప్రభుత్వాలు మరియు ఉపాధ్యాయులు పాఠశాలల్లో, కళాశాలల్లో మనదేశ శాస్త్ర సాంకేతిక



రంగాల్లో మన చరిత్ర, మన శాస్త్రవేత్తల జీవితచరిత్రలకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలతో ప్రేరణ ఇవ్వాల్సిన అవసరం నేడు ఎంతైనా వుంది. అభివృద్ధి చెందిన దేశంగా మనం ఎదగాలంటే శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం అగ్రరాజ్యా లకు దీటుగా వుండాల్సిందే ! మనలో మనం మారాల్సిందే!

బోస్ Fellow of the Royal Societyగా సెలెక్ట్ అయ్యారు. విశ్వ ఆవిర్భావానికి మూలమైన కణాలుగా శాస్త్రవేత్తలు చెబుతున్న 'దైవకణాలకు' పాల్ డిరాక్ అనే శాస్త్రవేత్త హిగ్స్‌బోసాన్ అని బోస్ పేరు వచ్చేలా నామకరణం చేసారంటే ప్రతి భారతీయుడి గుండె 'ఇది కదరా మన స్థాయి అంటే.. మనమంటే..!తగ్గేదేలే..!' అంటూ సగర్వంగా మన జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తూ, బోస్ ను 'రియల్ బాహుబలి'గా స్మరించుకోవాలి. ఇండియా ఐన్‌స్టీన్ గా కీర్తించాలి.

ఎంతోమంది విఖ్యాత శాస్త్రవేత్తలు భారతరత్నంగా గుర్తించిన బోస్‌కు భారత ప్రభుత్వం 1954 లో పద్మ విభూషణ్‌తో గౌరవించింది. కనీసం ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్నతో సముచితం గౌరవం ఇస్తే అది మనందరికీ, యావత్ ప్రపంచానికి గర్వకారణం. మన తరగతి గదుల్లో కూడా ఇలాంటి మహానుభావుల స్ఫూర్తి జీవితాలను విద్యార్థులకు బోధిస్తే భవిష్యత్తు తరాల్లో మనదేశం గర్వించే శాస్త్రవేత్తలు వస్తారు. నేటితరంలో పరిశోధనలు చేయడానికి జీవితంలో చాలా సమయం వృథా అవుతుందని, త్వరగా ఏదో ఉద్యోగం చేసి డబ్బులు సంపాదించాలనే వ్యాపారాత్మక భావనలు పెరగడం వల్ల శాస్త్రీయ రంగాల్లోకి ఏదో సాధించాలనే తాపత్రయంతో వస్తున్న వారి సంఖ్య చాలా తగ్గుతుందనేది వాస్తవం. ఈ తత్వంలో మార్పు రావాలి. సత్యేంద్రనాథ్ బోస్ స్ఫూర్తితో ప్రపంచం గర్వించదగ్గ భారతీయ శాస్త్రవేత్తలుగా నవతరం ఎదగాలని ఆకాంక్షిస్తూ బోస్ మాటలతో ముగిస్తున్నాను.

'I knew unless I got stopped / I was going to go all the way.
I don't know if I can run any faster,
I just ran as fast as I could.'

ఫిజిక్స్ అరుణ్ కుమార్, 9394749536

# మనసు, శరీరం, ఆత్మల ఏకీకరణతో సంపూర్ణ ఆరోగ్యం

శరీరం, మనస్సు, ఆత్మల సమతుల్యత మీదనే వ్యక్తుల సంపూర్ణ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని మనకు తెలుసు. మన శారీరక, మానసిక ఆరోగ్య సంరక్షణకు దోహదపడే దిన చర్యల్లో నడక, పరుగు, యోగా, సైక్లింగ్, ధ్యానం, ఆత్మావలోకనం, సృజనశీల కార్యక్రమాలు, వ్యాయామాలు లాంటి అంశాలు వస్తాయి. విద్యాలయాల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం నిత్యం గుర్తుచేసే నినాదం ఆరోగ్యకర శరీరంలో ఆరోగ్యకర మనస్సు(సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ బాడీ) మనకు గుర్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరణ ప్రకారం ఒక వ్యక్తి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, భావోద్వేగ, సామాజిక సమ్మిళిత ఆరోగ్యమే అసలైన సంపూర్ణ ఆరోగ్యమని నిర్వచించింది. రోగం లేదా జ్వరం లేకపోవడం మాత్రమే సంపూర్ణ ఆరోగ్యానికి సంకేతం కాదని, మానసిక ఆరోగ్యం కూడా అత్యవసరమని తెలుస్తున్నది. ప్రతి ఏట 03 జనవరిన అంతర్జాతీయ మనస్సు, శరీర ఆరోగ్య దినం (ఇంటర్నేషనల్ మైండ్ బాడీ వెల్‌నెస్ డే) నిర్వహించడం ఆనవాయితీగా మారింది. మన శారీరం, మనస్సు, ఆత్మల సంతులిత సామరస్య ఆరోగ్యంపై మన భావోద్వేగాలు, పనులు, ఆధ్యాత్మిక ఆలోచనలు, అనుభవాలు, ధ్యేయాలు, నమ్మకాలు, అలవాట్లు, దినచర్యలు ప్రభావాన్ని చూపుతాయి. నేటి వేగవంతమైన డిజిటల్ నెటిజెన్ల పరుగు జీవన విధానంలో విరామమనే పదానికే అర్థం లేకుండా పోతున్నది. ఇలాంటి అంతర్జాల వలయంలో చిక్కిన మనిషి కొంత సమయం తీసుకొని తన గురించి తాను కొన్ని క్షణాలు ఆలోచించాలి, అవసరమైన స్వల్ప మార్పులతో దినచర్యను పరిపూర్ణ ఆరోగ్య దిశగా మార్చుకోవాలి. మనస్సు, శరీర శ్రేయస్సుకు సరైన నిద్ర, కొన్ని నిమిషాల ధ్యానం/యోగా, ఒత్తిడిని తగ్గించే విరామాలు, సంతోషకరమైన కుటుంబం లాంటి క్రియలను దినచర్యలో భాగం చేసుకొని ఆచరణలో పెట్టాలి.

## మహిళలు బంగారు మంగళసూత్రాలు కోల్పోవడానికి కేంద్రానిదే బాధ్యత



న్యూఢిల్లీ : దేశంలో బ్యాంకులలో బంగారంపై తీసుకున్న రుణాల ఎగవేత పెరగడం ద్వారా మహిళల మంగళసూత్రాలను దొంగిలించడానికి ప్రభుత్వానిదే బాధ్యత అని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆరోపించారు. ఆశ్రితవాదం, అపసవ్య విధానాలు, ప్రాధాన్యాలే ఇందుకు కారణమన్నారు. బంగారం రుణాలలో కనీసం 30 శాతం ఎగవేస్తున్నారని, మహిళలు మంగళసూత్రాలు సహా తమ బంగారాన్ని కోల్పోతున్నారని అన్నారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో గురువారం పోస్ట్ చేశారు. ప్రజలను మంగళసూత్రాలపై ఊహాజనిత కథనంతో ప్రధాని భయపెడుతున్న తరుణంలో తాము ఆయన హయాంలో విపరీతంగా పెరుగుతున్న బంగారు తాకట్టు రుణాల ఎగవేత అంశాన్ని లేవనెత్తుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు భారతీయ కుటుంబాలు సుమారు రూ.3 లక్షల కోట్ల బంగారుల రుణాలను తీసుకున్నారని, పెరుగుతున్న అప్పులు, ఆర్థిక మందగమనం కారణంగా కుటుంబాలు పెద్ద ఎత్తున బంగారు రుణాలను ఎగవేస్తున్నాయన్నారు. ఈ ఏడాది మార్చి నుంచి జూన్ వరకు మూడు మాసాలలో ఎన్‌పిఎలలో బంగారు రుణాల వంతు 30 శాతం అంటే రూ.5,149 కోట్ల నుంచి రూ.6.696 కోట్లకు పెరిగిందని తెలిపారు. ఇది కేవలం వ్యవస్థ పరిధిలో తీసుకున్న రుణాల వివరాలు మాత్రమేనని, బైట ఎంత తీసుకున్నారనే వివరాలు లేవని పేర్కొన్నారు.

# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ నేడు మోదీ ప్రారంభోత్సవాలు



న్యూఢిల్లీ : ఢిల్లీలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ప్రారంభోత్సవాలు చేస్తారు. జెజె క్లస్టర్స్ (ఝుగ్గి ఝోప్రి) కు చెందిన 1,675 నివాసిత ఫ్లాట్లు, రెండు అర్బన్ డవలప్‌మెంటు ప్రాజెక్టులు కూడా ఈ ప్రారంభోత్సవాల్లో ఉన్నాయి. ఢిల్లీలో వచ్చేనెల అంటే ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని అంచనావేస్తున్న తరుణంలో ఈ అభివృద్ధి పథకాలకు మోదీ ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ఢిల్లీ అశోక్ విహార్‌లో స్వాభిమాన్ అపార్ట్‌మెంట్స్ వద్ద మురికివాడ పునరావాస కార్యక్రమాల్లో భాగంగా జెజె క్లస్టర్స్ నిరుపేదలకు కొత్తగా నిర్మించిన నివాసాలను మోదీ ప్రారంభిస్తారు. పేద నివాసితులకు ఇంటి తాళాలను స్వాధీనం చేసి వాటిని సందర్శిస్తారు. "అందరికీ ఇళ్ళు" లో భాగంగా ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని జోడించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. మంచి నివాసిత ప్రాంతాలు, ఆరోగ్యకరమైన జీవన వాతావరణం అందరికీ సమకూర్చాలనే ధ్యేయంతోనే జెజె క్లస్టర్స్ ద్వారా ఈ ఆవాసాలు నిర్మించినట్లు పిఎంఒ తెలియజేసింది. ఈ మొత్తం 1,675 ఫ్లాట్లకుగాను ప్రభుత్వం ఒక్కొక్క ఫ్లాట్‌కు రూ.25 లక్షలు ఖర్చుచేస్తే నివాసితుడు అందులో ఏడుశాతం అంటే కేవలం రూ.1.42 లక్షలు మాత్రమే భరించారని, ఐదు సంవత్సరాల మెయింటెనెన్స్‌కు రూ.30 వేలు ఇచ్చారని పేర్కొంది. అదేవిధంగా నౌరోజీ నగర్‌లోపునరాభివృద్ధి చేసిన ప్రపంచ వాణిజ్య కేంద్రం, సరోజినీ నగర్‌లో జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ టైప్–2 క్వార్టర్స్‌ను కూడా ఆయన ప్రారంభిస్తారు. శిథిలావస్థలో ఉన్న 600 క్వార్టర్స్‌ను ప్రపంచ వాణిజ్య సంస్థ కమర్షియల్ టవర్స్‌గా మార్చేసింది. సుమారు 34 లక్షల చదరపు అడుగుల ప్రీమియం కమర్షియల్ ప్రాంతంలో అడ్వాన్స్‌డ్ సదుపాయాలు సమకూర్చారు. ఈ ప్రాజెక్టులో పర్యావరణ హిత భవంతులు నిర్మించారు. సోలార్ ఎనర్జీ ఏర్పాటు చేశారు, వర్షపు నీటిని సద్వినియోగం చేసే మార్గాలు సమకూర్చారు. అదేవిధంగా 28 టవర్స్‌తో పాటు జిపిఆర్ఎ టైప్–2 క్వార్టర్స్‌ను ప్రారంభిస్తారు. ఇందులో 2,500 నివాసిత యూనిట్లు ఉన్నాయి. ఇందులో అత్యాధునిక సదుపాయాలు సమకూర్చారు. అదేవిధంగా రూ.300 కోట్లతో ద్వారకాలో నిర్మించిన సిబిఎస్ఇ సమగ్ర కార్యాలయ భవంతిని కూడా మోదీ ప్రారంభిస్తారు. ఇదికూడా పర్యావరణ హిత భవంతిస్థాయిలో నిర్మించారు. కాగా రూ.600 కోట్లతో నిర్మించే ఢిల్లీ యూనివర్శిటీ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి పురాదిరాయి కూడా వేస్తారు.

## యుటిగా జమ్ముకశ్మీర్ తాత్కాలికమే

### త్వరలోనే కేంద్రం రాష్ట్రహోదాను పునరుద్ధరిస్తుంది : సిఎం ఒమర్ అబ్దుల్లా



శ్రీనగర్: జమ్ముకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా (యుటి) ఉండడం తాత్కాలికమేనని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. యుటికి రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందని సిఎం ఆశాభావం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి కేవలం రెండు నెలలే అయిందన్నారు. యుటి ప్రభుత్వ పనులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవడానికి తమకు సమయం పట్టిందని ఒమర్ చెప్పారు. తాము ఇంతకు ముందు ప్రభుత్వంతో సంబంధాలు కలిగి ఉండేవారిమని, అయితే గత ప్రభుత్వాల ఏర్పాటుకు, ప్రస్తుత ప్రభుత్వ ఏర్పాటుకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. శ్రీనగర్‌లోని 'షేర్–ఐ–కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (ఎస్‌కెఐసిసి)లో అబ్దుల్లా మీడియాతో గురువారం ముఖాముఖిగా మాట్లాడారు. సహృద్భావ వాతావరణంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైందని, పెద్దగా ఇబ్బందులేమీ లేవన్నారు. తమ ఎన్నికల హామీలు అమలుకు కట్టుబడి ఉన్నామన్నారు. కొన్ని వాగ్దానాలను అమలు చేసేందుకు ప్రక్రియను ప్రారంభించామని చెప్పారు. మరికొన్ని అమలుకు వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉన్నదన్నారు. జమ్ముకశ్మీర్ యుటిగా కొనసాగడం తాత్కాలికమేనని ఆయన అభిప్రాయపడ్డారు. తాము ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్ర హోదాను పునరుద్ధరించడమే అతిపెద్ద హామీని అని, సాధ్యమైనంత తొందరగా రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులో కూడా ఉందని సిఎం గుర్తుచేశారు. ఒక సంవత్సరం గడిచిపోయిందని, అయితే ఒక ఏడాది సరిపోతుందని తాము భావిస్తున్నామన్నారు. జమ్ముకశ్మీర్ ప్రజల ఆకాంక్షలను గౌరవించి వారి కోరికలను నెరవేర్చాలన్నారు. ఇదిలా ఉండగా, ఇది మీడియా సమావేశం కాదని కేవలం ముఖాముఖి మాత్రమేనని చెప్పారు. సోషల్ మీడియాలో చాలా ఉహాగానాలు వస్తున్నాయని, అయితే తాము కొత్త ప్రకటనలు చేయబోవడం లేదన్నారు.

### రైతులతో చర్చలు జరపాలని

## మోదీని అడగండి

### బిజెపికి ఢిల్లీ సిఎం ఆతిశీ చురకలు



న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ బిజెపిపై విరుచుకు పడ్డారు. ఉపన్యాసాలు ఇవ్వ కుండా పంజాబ్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతులతో చర్చలు జరపాలని ప్రధాని మోదీని బిజెపి కోరాలని డిమాండ్ చేశారు. కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కు తాను రాసిన లేఖపై ఆతిశీ స్పందిస్తూ బిజెపి హయాంలో రైతుల పరిస్థితి ఇంత దారుణంగా గతంలో ఎప్పుడూ లేదన్నారు. రైతుల గురించి బిజెపి మాట్లాడటం అంటే దావూద్ ఇబ్రహీం అహింస గురించి ప్రబోధించినట్లే అని ఆతిశీ ఎద్దేవా చేశారు. బిజెపి రైతులపై రాజకీయాలు ఆపాలని ఢిల్లీ సిఎం ఆ లేఖ లో విజ్ఞప్తి చేశారు. కాగా, ఢిల్లీలోని రైతుల సమస్యలపై ఆప్ ప్రభుత్వం ఏనాడూ పట్టించుకోలేదని చౌహాన్ బుధవారం ముఖ్యమంత్రికి రాసిన లేఖలో ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆతిశీ స్పందిస్తూ 'పంజాబ్‌లో రైతులు ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్నారు' అని, వారితో చర్చలు జరపాలని ప్రధాని మోదీని కోరాలని చౌహాన్‌కు సూచించారు. ఢిల్లీ మార్చ్‌ను భద్రతా దళాలు అడ్డుకున్న తరువాత గత ఏడాది ఫిబ్రవరి నుంచి సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా బ్యానర్ క్రింద ఉన్న రైతులు ఫిబ్రవరి 13 నుండి పంజాబ్, హర్యానా మధ్య శంభు, ఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద ఆందోళన చేస్తున్నారు.

## 2 బీమా పథకాలను పొడిగించిన కేంద్రం



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనతో పాటు పునర్‌వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలను కేంద్రం మరో ఏడాదికి పొడిగించింది. దీంతో రైతుల పంటలకు మరింత రక్షణ లభించడమే కాకుండా నష్టాల పట్ల ఆందోళన తగ్గనుంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నిర్వహించిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) బుధవారం సమావేశమై, ఈ నిర్ణయాలు తీసుకుంది. 2025 లో తొలి కేబినెట్ భేటీని మోదీ రైతులకు అంకితం చేశారన్న కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్, రైతుల సంక్షేమం గురించి భేటీలో చర్చ జరిగిందని తెలిపారు. రెండు పంటల బీమా పథకాలను కేంద్రం 2025–26 వరకు పొడిగించినట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వీటిని 15వ ఆర్థిక సంఘం కాలానికనుగుణంగా పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పిఎంఎఫ్‌బివై, ఆర్‌డబ్ల్యుబిసిఐ పథకాలకు 2020–21 నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరం వరకు రూ.66,550 కోట్లు కేటాయించగా, దాన్ని 2021–22 నుంచి 2025–26 ఆర్థిక సంవత్సరాలకుగాను రూ.69,515.71 కోట్లకు పెంచారు. రెండు పంటల బీమా పథకాల అమలులో సాంకేతికతను వినియోగించేందుకు రూ.824.77 కోట్ల కార్పస్‌తో ప్రత్యేక నిధి ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఈ టెక్నాలజీ వినియోగంతో పంట నష్టం అంచనాలను త్వరగా తెలుసుకోవడమే కాకుండా క్లెయిమ్ సెటిల్‌మెంట్, వివాదాలను తగ్గించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. 50 కిలోల డిఏపి ఎరువుల బస్తాను రూ.1,350 చొప్పున రైతులకు అందజేసేందుకు రూ.3,850 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. ప్యాకేజీ పెంపుతో రైతులకు డిఏపి ఎరువుల 50 కేజీల బస్తా 1,350 రూపాయలకే అందనుంది.

**కేబినెట్ నిర్ణయాలపై ప్రధాని మోదీ ట్వీట్!**

కేబినెట్ నిర్ణయాలపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. 'రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్న ప్రభుత్వం మాది. దేశానికి అన్నం పెట్టేందుకు శ్రమించే మన రైతులు గర్వకారణం. 2025 మొదటి క్యాబినెట్ భేటీని రైతుల శ్రేయస్సు కోసం అంకితం చేశాం. వారి విషయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నందుకు ఆనందంగా ఉంది' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## అధిక ఎండలు చవిచూసిన సంవత్సరంగా 2024 రికార్డు నమోదు

### 123 ఏళ్ల చరిత్రలో 2024లోనే ఇండియాలో తీవ్రమైన ఎండలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : భారతదేశంలో అధికంగా ఎండలు చవిచూసిన సంవత్సరం 2024 నమోదైంది. 1901 నుండి ఇండియాలో 2024లోనే అధికంగా ఎండలు చవిచూసిందని ఐఎండి వెల్లడించింది. 123 ఏళ్లలో ఎప్పుడు లేనంతగా గత ఏడాదిలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఐఎండి తెలిపింది. 2016 లో నమోదైన ఉష్ణోగ్రతలను బ్రేక్ చేస్తూ 2024లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు జనవరి 1, 2025 విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. దేశవ్యాప్తంగా భూ ఉపరితల ఉష్ణోగ్రత సగటు 0.65 మేర పెరిగినట్లు తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా కూడా గత ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా నమోదయ్యింది. వాతావరణంలో వస్తున్న మార్పులే ఉష్ణోగ్రత పెరగటానికి కారణమని ఐఎండి పేర్కొంది. ఈ కారణంగానే ఎన్నడూ లేని విధంగా 2024లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చెప్పింది. అయితే 2025 దేశంలోని చాలా ప్రాంతాలలో పగలు, రాత్రి ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, కొన్ని ప్రాంతాల్లో మాత్రం చలి అధికంగా ఉండే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. వాయువ్య భారత ప్రాంతాలైన రాజస్థాన్, గుజరాత్, ఉత్తర మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలలో పగటిపూట సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యి చలి తీవ్రత పెరుగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

### అణ్వాయుధస్థాపనల జాబితా

## 'భారత్-పాకిస్తాన్' పరస్పరం మార్పిడి

### మూడు దశాబ్దాల ఆచారంలో భాగంగా ఈ తాజా ఒప్పందం



న్యూఢిల్లీ : ఇరుపక్షాలు పరస్పరం దాడులు చేసుకోకుండా నిషేధించే ద్వైపాక్షిక ఒప్పందం అమలు ఆచరణ కోసం బుధవారం భారత్–పాకిస్తాన్ దేశాలు తమ అణుస్థాపన జాబితాను పరస్పరం మార్చుకున్నాయి. మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆచారంలో భాగంగా ఈ పొరుగుదేశాలు రెండూ ఈ ఒప్పందానికి కట్టుబడ్డాయి. అణుస్థాపన జాబితాల క్రమం తప్పకుండా మార్పిడి అనేది రెండు దేశాల మధ్య ఒక విశ్వాసాన్ని పెంపొందించే సాధనంగా పరిగణించబడుతోంది. 'భారతదేశం, పాకిస్తాన్ న్యూఢిల్లీ, ఇస్లామాబాద్‌లలో దౌత్యపరమైన చానల్ ద్వారా అణుస్థాపనపై దాడి నిషేధం ఒప్పందం ప్రకారం అణుసంస్థాపనలు, సౌకర్యాల జాబితాను మార్పిడి చేసుకున్నాయి' అని విదేశా వ్యవహారాల శాఖ మంత్రిత్వ శాఖ తెలిపింది. డిసెంబరు 31, 1988న సంతకం చేయబడిన, జనవరి 27, 1991న అమలులోకి వచ్చిన అణుస్థాపనలు, సౌకర్యాలకు వ్యతిరేకంగా నిషేధంపై ఒప్పందం నిబంధనల ప్రకారం ఈ మార్పిడి జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం...రెండు దేశాలు ప్రతీ సంవత్సరం జనవరి 1న చేసుకున్న ఒప్పందం కింద కవర్‌చేయబడిన వారి అణుస్థాపనలు, సౌకర్యాల గురించి ఒకరికొకరు తెలియజేయాల్సి ఉంటుంది. అటువంటి జాబితాల వరుస మార్పిడి జనవరి 1న ఉంటుంది. ఇలా అణుస్థాపనల జాబితాను వరుసగా మార్పిడి చేసుకోవడం ఇది 34వసారి అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## హైకోర్టులో 'ఐఎఎల్ క్యాలెండర్' ఆవిష్కరణ




ప్రజాపక్షం /హైదరాబాద్ : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) –2025 క్యాలెండర్‌ను ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ గురువారం తెలంగాణ హైకోర్ట్ అడ్వొకేట్స్ అసోసియేషన్ హాల్‌లో ఆవిష్కరించారు. అడ్వొకేట్స్ అకాడమిని ఏర్పాటు చేయాలని, న్యాయవాదుల సంక్షేమ నిధిని పెంచాలని, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు ఎ.జగన్, కె.రామ్మూర్తి, సత్యనారాయణ యాదవ్, డి.భాస్కర్, భగత్‌సేన్ తదితరులు ఉన్నారు.

## పుష్పా–2 పై నాలుగు వారాల్లో పోలీసు నివేదిక కోరిన ఎన్‌హెచ్ఆర్‌సి

న్యూఢిల్లీ : వివాదాస్పద "పుష్పా–2" తెలుగు చలనచిత్రం కేసులో ఇప్పటివరకూ తీసుకున్న చర్యలు ఏమిటో చెప్పాలని ఎటిసి (తీసుకున్న చర్యల నివేదిక) నివేదికను తమకు సమర్పించాలని జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్ఆర్‌సి) గురువారం హైదరాబాద్ పోలీసు ఉన్నతాధికారిని కోరింది. ఇందుకు నాలుగు వారాలు గడువు ఇచ్చింది. సీనియర్ ర్యాంక్ పోలీసు అధికారి ఈ కేసు దర్యాప్తు చేయాల ని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కూడా ఎన్‌హెచ్ఆర్‌సి కోరింది. గతనెల 5వ తేదీన ఎన్‌హెచ్ఆర్‌సి వద్ద ఈ కేసు దాఖలైంది. కేసును అదేనెల 17న ఎన్‌హెచ్ఆర్‌సి రిజిస్టరు చేసుకుంది. నాలుగు వారాల్లో సవివరంగా ఒక నివేదిక ఇవ్వాలని కమిషన్ ఈనెల 1వ తేదీన హైదరాబాద్ పోలీసులను కోరడంద్వారా రంగంలోకి దిగింది. గతనెల 4వ తేదీన తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్‌లో ఆ చిత్ర ప్రదర్శన సందర్భంగా తొక్కిసలాటలో 35 ఏళ్ళు వయసుగల మహిళ మరణించింది. ఏనిమిదేళ్ళ వయసుగల ఆమె కుమారుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అల్లు అర్జున్, అతడి భద్రతా సిబ్బందిపైన, థియేటర్ యాజమాన్యంపైన వివిధ సెక్షన్ల కింద చిక్కడపల్లి పోలీసులు కేసులు పెట్టారు. గతనెల 13వ తేదీన పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు చేశారు. ఆ మరునాడే ఆయనను విడుదల చేశారు. సినిమా చూసేందుకు అర్జున్ వచ్చినప్పుడు జనం ఎగబడటంతో వారిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయడంవల్ల తొక్కిసలాట లో మహిళ మరణించిందని ఎన్‌హెచ్ఆర్‌సి వద్ద కేసు నమోదైంది. ఐతే సరైన ఏర్పాట్లు ముందుగా చేయకపోవడంవల్లనే పోలీసులు లాఠీ చార్జి చేయవలసి వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

Indian Bank

**మారుతి నగర్ బ్రాంచ్**
డి.నం. 8-3-222/1/ఎస్/204, షాలిమార్ అపార్ట్‌మెంట్స్, యూసుఫ్‌గూడ మెయిన్ రోడ్డు, మధురానగర్, హైదరాబాద్

అనుబంధం-4-ఎ [నిబంధన 8(6)/9(1) చూడుము]*
(*ఏది వర్తిస్తుందో అది)
**స్థిర ఆస్తుల విక్రయానికి అమ్మకం ప్రకటన**

సెక్యూరిటైజేషన్ అండ్ రికనస్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ నిబంధనలు) 2002, నిబంధన 8(6)/9(1)* (*ఏది వర్తిస్తుందో అది) కింద స్థిర ఆస్తుల విక్రయం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.
శ్రీ గండికోట శ్రీనివాసరావు (రుణగ్రహీత), శ్రీ నడింపల్లి గోపాలకృష్ణ, తండ్రి సీతారామరాజు (హామీదారు), లాకపల్లి రమేష్, తండ్రి ఎల్.రాఘవయ్య (హామీదారు) & శ్రీ గండికోట సాయిసందీప్ (రుణగ్రహీత) నుంచి సెక్యూరిటీ క్రెడిటార్ అయిన ఇండియన్ బ్యాంక్, మారుతినగర్ బ్రాంచ్‌కు బకాయి పడిన మొత్తం (30.12.2024 నాటికి) రూ.64,67,356.00/- (అరవైనాలుగుల లక్షల అరవై ఏడు వేల మూడు వందల యాభైఆరు రూపాయలు మాత్రమే) లను తిరిగి రాబట్టేందుకు సెక్యూరిటీ క్రెడిటార్ ఇండియన్ బ్యాంక్, మారుతినగర్ బ్రాంచ్ అధీకృత అధికారి ద్వారా భౌతికం/నిర్మాణాత్మకం/లాంఛన ప్రాయం (ఏది వర్తిస్తే అది)గా భౌతికంగా స్వాధీనంలోకి తీసుకోబడినదైన సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/అధీనం చేసిన ఈ కింద పేర్కొన్న స్థిర ఆస్తిని 'ఎక్కడ ఉన్నది ఉన్నట్లుగా', 'ఉన్నది ఉన్నట్లుగా' మరియు 'అక్కడ ఉన్నది ఏమైనా' ప్రాతిపదికపై 24.01.2025న విక్రయించబడునని ఇందుమూలంగా సాధారణ ప్రజానీకం మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు తెలియజేయడమైనది. ఇ-వేలం విధానం ద్వారా విక్రయానికి ఉద్దేశించిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు ఈ కింద పేర్కొనడమైనది:

**ఆస్తి యొక్క పూర్తి వివరాలు:**
హైదరాబాద్, ఎర్రగడ్డ, గోకుల్ థియేటర్ దగ్గర ఉన్న ప్రిమిసెస్ నం.8-3-166/2/1 లో మొత్తం 297 చదరపు గజాల నుండి 37.12 చదరపు గజాల తగిన అవిభాజ్య భూమి వాటాతో కలిసి కారు పార్కింగ్‌తో పాటు 1165 చదరపు అడుగుల (ఉమ్మడి ప్రదేశం సహా) కొలతతో ధార్ మాన్సన్ ఈశాన్య మొదటి అంతస్తుపై గల యూనిట్ నం.2 యొక్క ఆస్తి మొత్తంగా.
హద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: యూనిట్ నం.1, తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: కారిడార్.

| | |
|---|---|
| పూర్వపు రుణభారం | ఏమీలేవు |
| రిజర్వు ధర | రూ. 5500000/- |
| ఇఎండి మొత్తం | రూ. 550000/- |
| బిడ్ పెంపుదల మొత్తం | రూ.10,000/- (పదివేల రూపాయలు మాత్రమే) |
| ఇ-వేలం తేదీ&సమయం | 24.01.2025 |
| ఆస్తి యొక్క ఐడి నం. | ఐడిఐబి50111511611 |

ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనేందుకు దయచేసి మా ఇ వేలం సర్వీస్ ప్రొవైడర్ పిఎస్‌బి అలియాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క వెబ్‌సైట్ (https://baanknet.com) ను సందర్శించగలరని బిడ్డర్లకు సూచించడమైనది. సాంకేతిక సహాయానికై దయచేసి 8291220220కు కాల్ చేయగలరు. రిజిస్ట్రేషన్ స్థితి మరియు ఇఎండి స్థితి కొరకు దయచేసి to support.baanknet@psballiance.com. కు మెయిల్ చేయగలరు. ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఫొటోగ్రాఫ్ మరియు వేలం నియమ నిబంధనల కొరకు దయచేసి https://baanknet.com లో చూడగలరు. మరియు ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరాల కోసం దయచేసి పిఎస్‌బి అలియాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫోన్ నం. 8291220220 లో సంప్రదించగలరు.
https://baanknet.com వెబ్‌సైట్‌లో ఆస్తి కొరకు వెదుకుతున్నప్పుడు పైన తెలిపిన **ఆస్తి ఐడి సంఖ్యను** ఉపయోగించాల్సిందిగా బిడ్డర్లకు సూచించడమైనది.

తేదీ : 31-12-2024, సం/-అధీకృత అధికారి,
ప్రదేశం: హైదరాబాద్ ఇండియన్ బ్యాంక్

## స్త్రీ విద్యకు జీవితాన్ని ధారపోసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే : కెసిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్: సకల రంగాల్లో బహుజనులను కట్టడి చేసే సామాజిక సంప్రదాయ నిర్భంధాలను బద్దలు కొట్టి, బడుగుల అభ్యున్నతికి, స్త్రీ విద్యకు తన జీవితాన్ని ధారపోసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు అన్నారు. చదువుల తల్లి సావిత్రి భాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చేసిన సామాజిక కృషిని, స్త్రీ జాతి ఔన్నత్యం కోసం, అణచివేయబడిన కులాల స్వేచ్ఛ కోసం మహాత్మా జ్యోతిరావు సావిత్రి బాయి పూలే దంపతుల త్యాగాలను కెసిఆర్ గురువారం స్మరించుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, మెజారిటీ ప్రజల జీవన విధానం మరింత గుణాత్మకంగా మార్పు చెందడానికి, వారి హక్కులను కాపాడేందుకు, త్యాగాలు చేసిన భారతీయ మహనీయుల్లో మహాత్మా పూలే దంపతులు ముందువరుసలో ఉంటారని కెసిఆర్ పేర్కొన్నారు. గురుకుల విద్యతో సహా, బడుగు వర్గాల బిడ్డలను భావితరాలకు ప్రతినిధులుగా తీర్చిదిద్దాలనే దార్శనికతతో,విద్యారంగంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం వేసిన పునాదిలో సావిత్రి బాయి పూలే దంపతుల ఆశయాలు ఇమిడివున్నాయని చెప్పారు.

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: మార్కాపురం**
I.A. No. 774/2024 in I.A.No. 299/2023 in O.S. No. 297 / 2023
బోగినేని వెంకట సతీష్ కుమార్ ...వాది
Vs.
వెన్నా చెన్నా రెడ్డి (మృతుడు) మరియు అతని వారసులు
వెన్నా వెంకట నారాయణమ్మ మరియు ఇతరులు ...ప్రతివాదులు
**నోటీసు**
To
1. వెన్నా వెంకట రెడ్డి, S/o. లెట్ వెన్నా చెన్నా రెడ్డి, C/o. అమీర్ మంజిల్ H.No. 1-110/A/66, కొండాపూర్, హైదరాబాదు. (R4)
2. వెన్నా జనార్ధన్ రెడ్డి, S/o. లెట్ వెన్నా చెన్నా రెడ్డి, C/o. అమీర్ మంజిల్ H.No. 1-110/A/66, కొండాపూర్, హైదరాబాదు. (R5)

పై నెంబరు పిటిషనులో వారి పలుమార్లు మీకు నోటీసులు పంపించినను వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపుటచే గౌరవనీయులైన కోర్టు వారు మీ ఇరువురికి ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు ఆర్డరు చేసియున్నారు. ఇందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తేది 06-01-2025 పై కోర్టులో ఉదయం 10-00 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానము చేయబడును అని ఖండితముగా తెలియజేయుచున్నాము.
హియరింగు తేదీ : 06-01-2025
యు. రవీంద్ర నాథ్
పిటీషనరు తరపు న్యాయవాది

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: మార్కాపురం**
I.A. No. 769 /2024
O.S. No. 297 / 2023
బోగినేని వెంకట సతీష్ కుమార్ ...వాది
Vs.
గంజి సుందరమ్మ @ వసుంధరమ్మ మరియు ఇతరులు ...ప్రతివాదులు
**నోటీసు**
To
1. వెన్నా వెంకట రెడ్డి, S/o. లెట్ వెన్నా చెన్నా రెడ్డి, C/o. అమీర్ మంజిల్ H.No. 1-110/A/66,కొండాపూర్, హైదరాబాదు. (D6)
2. వెన్నా జనార్ధన్ రెడ్డి, S/o. లెట్ వెన్నా చెన్నా రెడ్డి, C/o. అమీర్ మంజిల్ H.No. 1-110/A/66, కొండాపూర్, హైదరాబాదు. (D7)

పై నెంబరు దావాలో వారి పలుమార్లు మీకు నోటీసులు పంపించినను వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపుటచే గౌరవనీయులైన కోర్టు వారు మీ ఇరువురికి ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు ఆర్డరు చేసియున్నారు. ఇందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తేది 06-01-2025 పై కోర్టులో ఉదయం 10-00 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానము చేయబడును అని ఖండితముగా తెలియజేయుచున్నాము.
హియరింగు తేదీ : 06-01-2025
యు. రవీంద్ర నాథ్
పిటీషనరు తరపు న్యాయవాది

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: మార్కాపురం**
I.A. No. 770 / 2024
O.S. No. 297 / 2023
బోగినేని వెంకట సతీష్ కుమార్ ...వాది
Vs.
గంజి సుందరమ్మ @ వసుంధరమ్మ మరియు ఇతరులు ...ప్రతివాదులు
**నోటీసు**
To
1. వెన్నా వెంకట రెడ్డి, S/o. లెట్ వెన్నా చెన్నా రెడ్డి, C/o. అమీర్ మంజిల్ H.No. 1-110/A/66, కొండాపూర్, హైదరాబాదు. (D6)
2. వెన్నా జనార్ధన్ రెడ్డి, S/o. లెట్ వెన్నా చెన్నా రెడ్డి, C/o. అమీర్ మంజిల్ H.No. 1-110/A/66, కొండాపూర్, హైదరాబాదు. (D7)

పై నెంబరు దావాలో వారి పలుమార్లు మీకు నోటీసులు పంపించినను వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపుటచే గౌరవనీయులైన కోర్టు వారు మీ ఇరువురికి ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు ఆర్డరు చేసియున్నారు. ఇందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తేది 06-01-2025 పై కోర్టులో ఉదయం 10-00 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానము చేయబడును అని ఖండితముగా తెలియజేయుచున్నాము.
హియరింగు తేదీ : 06-01-2025
యు. రవీంద్ర నాథ్
పిటీషనరు తరపు న్యాయవాది

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: మార్కాపురం**
I.A. No. 771 / 2024
O.S. No. 297 / 2023
బోగినేని వెంకట సతీష్ కుమార్ ...వాది
Vs.
గంజి సుందరమ్మ @ వసుంధరమ్మ మరియు ఇతరులు ...ప్రతివాదులు
**నోటీసు**
To
1. వెన్నా వెంకట రెడ్డి, S/o. లెట్ వెన్నా చెన్నా రెడ్డి, C/o. అమీర్ మంజిల్ H.No. 1-110/A/66, కొండాపూర్, హైదరాబాదు. (D6)
2. వెన్నా జనార్ధన్ రెడ్డి, S/o. లెట్ వెన్నా చెన్నా రెడ్డి, C/o. అమీర్ మంజిల్ H.No. 1-110/A/66, కొండాపూర్, హైదరాబాదు. (D7)

పై నెంబరు దావాలో వారి పలుమార్లు మీకు నోటీసులు పంపించినను వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపుటచే గౌరవనీయులైన కోర్టు వారు మీ ఇరువురికి ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు ఆర్డరు చేసియున్నారు. ఇందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తేది 06-01-2025 పై కోర్టులో ఉదయం 10-00 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానము చేయబడును అని ఖండితముగా తెలియజేయుచున్నాము.
హియరింగు తేదీ : 06-01-2025
యు. రవీంద్ర నాథ్
పిటీషనరు తరపు న్యాయవాది

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: మార్కాపురం**
I.A. No. 772/2024 in I.A.No. 299/2023 in O.S. No. 297/ 2023
బోగినేని వెంకట సతీష్ కుమార్ ...వాది
Vs.
వెన్నా చెన్నా రెడ్డి (మృతుడు) మరియు అతని వారసులు
వెన్నా వెంకట నారాయణమ్మ మరియు ఇతరులు ...ప్రతివాదులు
**నోటీసు**
To
1. వెన్నా వెంకట రెడ్డి, S/o. లెట్ వెన్నా చెన్నా రెడ్డి, C/o. అమీర్ మంజిల్ H.No. 1-110/A/66, కొండాపూర్, హైదరాబాదు. (R4)
2. వెన్నా జనార్ధన్ రెడ్డి, S/o. లెట్ వెన్నా చెన్నా రెడ్డి, C/o. అమీర్ మంజిల్ H.No. 1-110/A/66, కొండాపూర్, హైదరాబాదు. (R5)

పై నెంబరు పిటిషనులో వారి పలుమార్లు మీకు నోటీసులు పంపించినను వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపుటచే గౌరవనీయులైన కోర్టు వారు మీ ఇరువురికి ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు ఆర్డరు చేసియున్నారు. ఇందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తేది 06-01-2025 పై కోర్టులో ఉదయం 10-00 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానము చేయబడును అని ఖండితముగా తెలియజేయుచున్నాము.
హియరింగు తేదీ : 06-01-2025
యు. రవీంద్ర నాథ్
పిటీషనరు తరపు న్యాయవాది

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: మార్కాపురం**
I.A. No. 773 / 2024 in I.A.No. 299/2023 in O.S. No. 297/ 2023
బోగినేని వెంకట సతీష్ కుమార్ ...వాది
Vs.
వెన్నా చెన్నా రెడ్డి (మృతుడు) మరియు అతని వారసులు
వెన్నా వెంకట నారాయణమ్మ మరియు ఇతరులు ...ప్రతివాదులు
**నోటీసు**
To
1. వెన్నా వెంకట రెడ్డి, S/o. లెట్ వెన్నా చెన్నా రెడ్డి, C/o. అమీర్ మంజిల్ H.No. 1-110/A/66, కొండాపూర్, హైదరాబాదు. (R4)
2. వెన్నా జనార్ధన్ రెడ్డి, S/o. లెట్ వెన్నా చెన్నా రెడ్డి, C/o. అమీర్ మంజిల్ H.No. 1-110/A/66, కొండాపూర్, హైదరాబాదు. (R5)

పై నెంబరు పిటిషనులో వారి పలుమార్లు మీకు నోటీసులు పంపించినను వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపుటచే గౌరవనీయులైన కోర్టు వారు మీ ఇరువురికి ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు ఆర్డరు చేసియున్నారు. ఇందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తేది 06-01-2025 పై కోర్టులో ఉదయం 10-00 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానము చేయబడును అని ఖండితముగా తెలియజేయుచున్నాము.
హియరింగు తేదీ : 06-01-2025
యు. రవీంద్ర నాథ్
పిటీషనరు తరపు న్యాయవాది

## నేడు పెన్షనర్స్ డైరీ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఎటి) ఆధ్వర్యంలో 2025 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ సీనియర్ పెన్షనర్లకు సన్మానం శుక్రవారం జరుగుతుందని, జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు పాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య కోరారు. గురువారం ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, అలాగే తెలంగాణ జెఎసి సెక్రటరీ ఏలూరి శ్రీనివాస రావు, రాష్ట్ర అధ్యక్షులు అర్వీణి రాజేంద్రబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవి.నర్సింహారావు, ఖాజానా శాఖ డిడి ఎస్‌విఎస్ నర్సింహారావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి కస్తాల సత్యనారాయణ, ఖమ్మం ఎస్‌టిఓ మోదుగు యాలాద్రి తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఆర్థిక కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షులు భాస్కరాచారి, ఉపాధ్యక్షులు పెదమళ్ల సత్యనారాయణ, రామనాధం, కార్యదర్శులు అల్లిక నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లయ్య పార్థివదేహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ లక్ష్మీ దేవిపల్లి :** లక్ష్మీ దేవిపల్లి మండలం బంగారు చెలకలో సిపిఐ సీనియర్ నాయకులు గోదుమల మల్లయ్య పార్థివదేహానికి పూల మాల వేసి గురువారం కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు పరా మర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ మల్లయ్య మృతి సిపిఐ పార్టీకి తీరని లోటని అన్నారు. భవిష్యత్తులో మల్లయ్య కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు దీటి లక్ష్మీ పతి, సొసైటీ డైరెక్టర్ కంటెం సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి దారా శ్రీనివాస్, జోగా రామయ్య, పారిపర్తి రాజు, కంటెం శేఖర్, వర్మ, రామ స్వామి, దేవర గట్ల రాంబాబు, పుల్లయ్య, నాగయ్య, శర్వాన్, శంకర్, ముత్తయ్య, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ఏన్కూరు :** టిఎస్‌యుటిఎఫ్ ఆధ్వర్యంలో 2025 సంవత్సర డైరీ, వాల్ క్యాలెండర్లు, స్టిక్కర్ క్యాలెండర్లను గురువారం ఆవిష్కరించారు. మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపిడివో రమేష్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 డైరీ, క్యాలెండర్లు ఆకర్షణీయంగా ఉన్నాయని ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు క్యాలెండర్లు డైరీలు దిక్సూచిగా ఉపయోగపడుతున్నాయని అన్నారు. విద్యారంగ అభివృద్ధిలో ఉపాధ్యాయులు మంచి ఫలితాలు సాధించే విధంగా తగు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం ఎన్ఈపి 2020ను రద్దు చేయాలని, నో డిటెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. విద్యారంగానికి బడ్జెట్‌లో 15% నిధులు కేటాయించాలన్నారు. నూతన మండలాలకు ఎంఈవో పోస్టులు, జిల్లాలకు డిఈవో పోస్టులు, రెవిన్యూ డివిజన్‌లకు డిప్యూటీ డిఈవో పోస్టులు మంజూరు చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సిఆర్‌పిలకు, కెజిబివి, యుఆర్ఎస్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో, గురుకులాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ టీచర్లందరికి మినిమం బేసిక్ పేను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రామ్‌చంద్, ఎం.పుల్లయ్య, ఉపాధ్యక్షులు శ్రీదేవి, జె.పుల్లయ్య, కోశాధికారి నర్సింహారావు, సీనియర్ నాయకులు రాఘవరావు, శంకర్‌రావు, బి.హతిరామ్, ఎం.నాగేశ్వరరావు, చంద్రశేఖర్, బి.రవి, గోపాల్, బి.లక్ష్మా, సింధు, సునీల్‌వర్మ, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నూతన సంవత్సరంలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలైన ఇందిరమ్మ ఇళ్లు, అర్హులకు గ్యారెంటి పథకాల అమలు, జాతీయ రహదారుల నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా జరిగేలా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం నూతన కలెక్టర్ కార్యాలయంలో తన చాంబర్‌లో జరిగిన నూతనసంవత్సర వేడుకల్లో ఆయన మాట్లాడారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్‌రెడ్డి, ట్రైని కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరిలో ఆనందం నింపాలని, ప్రభుత్వ ఉద్యోగులు వారి కుటుంబాల్లో సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో ప్రతి ఉద్యోగి తన ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, రోజు శారీరక వ్యాయామం చేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు వ్యక్తి గత జీవితంలో కూడా సఫలికృతం కావాలని ఆకాంక్షించారు. వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌ను పక్కాగా పాటించాలన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన విధులను విజయవంతంగా చేస్తూనే వ్యక్తిగత బాధ్యతలను సైతం పక్కాగా నిర్వహించుకోవాలని అందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కలెక్టర్ పేర్కొన్నారు.

**ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్‌ను లాభదాయకంగా నడపాలి**

ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్‌ను లాభదాయకంగా నడపాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్‌ను ఆయన పరిశీలించి నిర్వాహకులు, డిఆర్డిఓ సన్యాసయ్యతో మాట్లాడారు. క్యాంటిన్ వద్ద పాత్రలు కడిగేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉద్యోగుల డిమాండ్ మేరకు మోనూ ఏర్పాటు చేయాలని, క్యాంటిన్‌కు వచ్చే ప్రజలు, ఉద్యోగులకు అందిస్తున్న సేవలు, భోజనం నాణ్యత, పదార్థాల రుచిపై వారి అభిప్రాయాలు, సూచనలు స్వీకరిస్తూ లోటుపాట్లు లేకుండా క్యాంటిన్‌ను లాభదాయకంగా నడపాలన్నారు. వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే వారికి రెండవ అంతస్తులో క్యాంటిన్ ఉన్నట్లు తెలిసే విధంగా కార్యాలయ ఆవరణ, బస్టాప్ వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. క్యాంటిన్‌లో బయటి భోజనం అనుమతించరాదని, ఉద్యోగులు తమ వెంట తెచ్చుకున్న భోజనాన్ని వారికి కేటాయించిన భోజనశాలలో కూర్చుని తినే విధంగా సూచించాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు డిఆర్డీఓ నూరొద్దీన్ తదితరులు ఉన్నారు.

# మున్నేరు వరద నియంత్రణకు పకడ్బందీ చర్యలు

### రిటైనింగ్ వాల్ నిర్మాణం భూసేకరణపై సంబంధిత అధికారులతో సమీక్షించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం :** మున్నేరు వరద నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, భూసేకరణ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్నేరు నదికి ఇరువైపుల రిటైనింగ్ వాల్ నిర్మాణానికి బఫర్ జోన్, ఎఫ్‌టిఎల్, డిజైన్, గత రికార్డుల ప్రకారం అత్యధిక నీటి ప్రవాహం స్థాయి ఎంత, రిటైనింగ్ వాల్ ఎంత ప్రవాహానికి ఎంత ఎత్తులో నిర్మించాలి వంటి అంశాలను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బఫర్‌జోన్ వద్ద ఎంత భూమి ఆక్రమణకు గురైంది, మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఎంత సమయం పడుతుంది. ఎంత భూసేకరణ చేయాలి. వచ్చే వానాకాలం నాటికి పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయా, రాబోయే వరదల నియంత్రణకు ఏ చర్యలు తీసుకోవాలి వంటి వివరాలు తెలుసుకున్నారు. అత్యధికంగా వరద ప్రవాహం ఉన్న సమయంలో మున్నేరు నది వద్ద 3 లక్షల 50 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చినా తట్టుకునేలా బఫర్‌జోన్ నిర్దేశిస్తూ రిటైనింగ్ వాల్ డిజైన్ చేయడం జరిగిందన్నారు. రికార్డుల ప్రకారం మున్నేరునది 36 మీటర్ల ఎత్తులో నీరు ప్రవహించిందని దానిని పరిగణలోకి తీసుకుంటూ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రణాళికలు చేసినట్లు సంబంధిత అధికారులకు కలెక్టర్ తెలిపారు. మున్నేరు నది రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి సంబంధిత ఆమోదం పొందిన డిజైన్ ప్రకారం అవసరమైన భూసేకరణ జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, ఇరిగేషన్ ఎస్ వెంకటేశ్వరరావు, ఇఇ అనన్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, ఖమ్మం అర్బన్, రూరల్ తహశీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ కళాశాల వీడియో ఘటనపై ప్రభుత్వం విచారణ జరిపించాలి




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మేడ్చల్ సిఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలల గర్ల్స్ స్టూడెంట్స్ వీడియోలు ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మేడ్చల్ శివార్లో ఉన్న సిఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినుల బాత్రూమ్‌లలో గత 3 నెలల నుండి స్పై కెమెరాలు పెట్టి అశ్లీల వీడియోలు తీస్తున్నారని, కళాశాలలో సౌకర్యాలు, ఫీజులు అక్రమాలు గురించి ప్రశ్నిస్తున్న విద్యార్థినులను అట్టి వీడియోలు బయట పెడతామని బెదిరింపులు బ్లాక్‌మెయిల్ పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ చర్య సభ్య సమాజం తలదించుకునేలా ఉందని విమర్శించారు. ఈ చర్యలను అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. తక్షణమే వార్డెన్ ప్రీతిరెడ్డిని, మల్లారెడ్డి, గోపాల్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివ నాయక్, వంశీ, జిల్లా నాయకులు రాకేష్ రాజు, ప్రతాప్, నరేష్, గోపి, రోహిత్, నాగరాజు పాల్గొన్నారు.

## వైరా మున్సిపాలిటీలో ఫుట్‌పాత్ ఎక్కడ?

### డ్రైనేజీలు మూసివేసి రోడ్లపైనే వ్యాపార వస్తువులు పెడుతున్న నిర్వాహకులు

**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీలో రోజురోజుకి వాహనాలు, ప్రజల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ క్రమంలో రోడ్డ ప్రక్కన నడిచేందుకు మున్సిపాలిటీలో డ్రైన్‌ను ఏర్పాటు చేసి ప్రక్కన ఫుట్‌పాత్ కోసం ఉపయోగించుకునే విధంగా చేపట్టారు. కాని ఇప్పుడు ఫుట్‌పాత్ అనేది వైరా మున్సిపాలిటీలో కనిపించకుండా వ్యాపార సముదాయాలు నిర్వహణ కోసం ఉదయం నుంచి రాత్రి వరకు డ్రైనేజీలు దాటి రోడ్డుపై వరకు వ్యాపార వస్తువులను ఏర్పాటు చేసి వ్యాపార నిర్వహణ కొనసాస్తున్నారు. దీనివలన రోడ్లపై నడిచే బాటసారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఫుట్‌పాత్ చోటు లేకుండా మూసి వేయడంతో రోడ్లు పక్కన నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మీద నడుస్తూ వెళుతుంటే పలుసార్లు ప్రమాదాలు సైతం చోటు చేసుకున్నాయి. ఇలా ప్రమాదాలకు ఫుట్‌పాత్ లేకపోవడమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. అప్పటి కమిషనర్ వెంకటస్వామి, వెంకటపతిరాజు సమయంలో వైరా మున్సిపాలిటీ పరిధిలోని రోడ్డు వెంబడి డ్రైన్ మూసివేసిన వ్యాపార నిర్వాహకుల షాపులు ముందు డ్రైనేజీలు మొత్తం తీసివేసి వేసిన రేకులను సైతం తీసి రోడ్లు కనబడే విధంగా చేశారు. అలా రోడ్ల ప్రక్కన స్థలాలను మొత్తాన్ని ప్రక్షాళన చేశారు. ఆ క్రమంలోనే డ్రైనేజీ ఇవతల ఉన్న ప్రతి షాపు రేకులను, రోడ్లపై పెట్టిన పైపులను ఇతరత్రా వ్యాపార వస్తువులను మొత్తాన్ని తీయించారు. అలా కొన్ని రోజులు గడిచిన తర్వాత మరల క్రమేనా ఫుట్‌పాత్ ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రస్తుతం వైరా మున్సిపాలిటీలో రోడ్లు ప్రక్కన ఖాళీ స్థలం లేకపోవడంతో పలువురు పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని రోడ్డు వెంబడి డ్రైనేజీలు దాటి వచ్చిన వ్యాపార షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.







# గుట్టలను నిలువునా తోడేస్తున్నారు...






### ప్రభుత్వాదాయానికి గండి
### మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతులు శూన్యం

**ప్రజాపక్షం/చర్ల :** మండలంలోని ఇసుక రీచ్‌లకు రహదారులు నిమిత్తం గుట్టలను నిలువునా తోడేస్తున్నారు. ఇసుక మైనింగ్ కాంట్రాక్టర్లు. మండలంలోని మొగళ్లపరిధిలోని గోదావరి పరివాహక ప్రాంతంలో గల చింతకుంటలో 34.20 ఎకరాల్లోనూ, మొగళ్లపల్లి పరిధిలోని 30 ఎకరాల్లోనూ సీతమ్మసాగర్ ప్రాజెక్టు డీసెల్టింగ్ పేరిట ఇసుకరీచ్‌లకు ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చాయి. భూమిపుత్ర మహిళా గిరిజన మహిళా గిరిజన ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్టర్ మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ మొగళ్లపల్లి పేరిట ఈ అనుమతులున్నాయి. గిరిజన సొసైటీ ద్వారా అనుమతులు పొందిన డీసెల్టింగ్ ఇసుక క్వారీకి రేసింగ్ కాంట్రాక్టర్ల పేరిట కొందరు వ్యక్తులు ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా క్వారీకి రహదారుల నిమిత్తం గ్రావెల్ తవ్వకాలు ప్రారంభించారు. ఇక ప్రైవేటు వ్యక్తి పేరిట పట్టా భూమిలో ఉన్న గ్రావెల్ గుట్టను మైనింగ్ అండ్ జియాలజీ, రెవెన్యూశాఖల వద్ద నుండి ఎటువంటి అనుమతులు లేకుండానే సంబంధిత డిపార్ట్‌మెంట్ నుండి ఎన్ఓసి తీసుకోకుండా గత వారం రోజులుగా ఇష్టానుసారంగా తవ్వకాలు సాగిస్తున్నారు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఖజానాకు భారీగానే గండిపడిందని చెప్పొచ్చు. సుమారు 64 ఎకరాల్లో 6,50,595 క్యూబిక్ మీటర్ల ఇసుకును లారీల ద్వారా తోడుకునేందుకు భారీగానే గ్రావెల్ అవసరం ఉంది. మైనింగ్, రెవెన్యూశాఖల అనుమతులు తీసుకున్నట్లయితే సమయం వృధా అవుతుందని భావించిన బినామీ కాంట్రాక్టర్లు మండలంలోని సంబంధిత ఆయా శాఖల అధికారులకు ఆమ్యామ్యాలు సమర్పించి భారీగానే గ్రావెల్ తోలకాలు సాగిస్తున్నారనే విమర్శలున్నాయి. స్థానిక అవసరాల నిమిత్తం ఒకటి, రెండు ట్రక్కుల గ్రావెల్ తోలుకుంటే తమ విశ్వరూపాన్ని చూపించే అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ గ్రావెల్ వ్యవహారాలపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి, తగు విచారణ జరిపించి, సంబంధిత వాహనాలను సీజ్ చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## డివైడర్ పగులగొట్టిన వారిపై చర్యలు తీసుకుంటాం

**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురు సమీపంలో ఉన్న డివైడర్‌ను పగొలగొట్టారు. ఎందుకు పగులగొట్టారు అనే దానిపై మున్సిపల్ అధికారులు ఆర్అండ్‌బి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చింతా వేణును వివరణ అడుగగా డివైడర్ పగులగొట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని మరల పగులగొట్టిన డివైడర్ మరమ్మత్తులు చేపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ఒక విజ్ఞప్తి కూడా చేశారు. డివైడర్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరికి వారే ఇష్టానుసారంగా పగులగొడితే చట్టపరంగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి కేసులు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## ‘ఆంధ్రా సిండికేట్’ దెబ్బతో వేరుశెనగ రైతు విలవిల

### సెజ్ చెల్లించకుండానే సరిహద్దులు దాటుతున్న శెనగ

**ప్రజాపక్షం/దమ్మపేట :** దమ్మపేట మండలంలో వేరుశనగ పంట రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షణ లోపించిన కారణంగా ఆంధ్రా ప్రాంత దళారులు ముఠా మండలంలో రాజ్యమేలుతుంది. క్వింటా వేరుశెనగ ధర ఎంతా అనేది వారు నిర్ణయించిందే దళారులే కావటంతో ధర గిట్టుబాటు ధర అందకా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతఏడాదితో పోలిస్తే ప్రస్తుతం మండల పరిధిలో వేరుశెనగ పంట విపరీతంగా పెరగటానికి దీనికి అసలు కారణం ఆంధ్రాకు చెందిన కొందరు పెట్టుబడిదారులు అన్నట్టు తెలుస్తుంది. మండల పరిధిలో అత్యధికంగా సాగుతున్న మొక్కజొన్న రైతులకు అధిక లాభాలు ఆశ చూపి, అధిక వడ్డీలకు పెట్టుబడి పెట్టి శనగపంట వైపు మళ్లించటం తోపాటు, ఆంధ్రకు చెందిన శనగ పంట రైతులు సైతం ఇక్కడి గిరిజన భూములకు అత్యధిక కౌలు ధర చెల్లిస్తూ ఆశ చూపుతూ రసాయన ముందులను ఇష్టానుసారం వినియోగిస్తూ పంటను పెంచినట్టు తెలుస్తుంది. ఎప్పుడు లేనంతగా మండల పరిధిలో అనధికారిక లెక్కల ప్రకారం సుమారు 10 వేల ఎకరాలలో శనగ పంటను పండించినట్టు తెలుస్తుంది. వేరుశెనగ కు ఒక్కో ఎకరాకు పెట్టుబడి మొత్తంగా సుమారు 90 వేల నుంచి లక్ష రూపాయిల వరకు అవుతుండగా, రైతు సరైన ధర లేక తీవ్రంగా నష్టపోతున్నాడు. ఈ ధరల నియంత్రణ స్థానికంగా తిష్ట వేసి కూర్చొని పంట సేకరిస్తున్న ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొందరు దళారు లు నిర్ణయిస్తూ ఉండటంతో రైతులకు సరైన మద్దతు ధర లభించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్ర దళారుల ఆగడాలు కొనడంతోనే కాకుండా వేరుశనగ ఇద్దరం నుంచి మందులు కూలీలకు కూడా సైతం వారే పెట్టుబడి అందిస్తూ రైతుల నుంచి పంట దిగుబడి అనంతరం అధిక వడ్డీలతో వెనక్కి లాగుతున్నట్టు తెలుస్తుంది. ఓవైపు క్వింటాకు ధర సుమారు గత ఏడాదితో పోలిస్తే 2000 వరకు తగ్గగా పంట అమాంతం నాలుగు 4 ఎకరా లకు పైగా పెరిగింది. మొత్తంగా చూసుకున్నట్లయితే గత ఏడాది క్వింటాకు ధర 8400 వరకు పాలికగా,ఈ ఏడాది ధర 6500గా వుంది. ఇక్కడ గమనిం చాల్సిందేమిటంటే వేరుశనగ విత్తనం తోపాటు క్రిమిసంహారక మందులు, కూలీలకు సైతం ఆంధ్రకు పెట్టుబడిదారులే ఇస్తూ ఉండటం గమనార్హం. తక్కువ ధరకే పంటను కొన్న దళారులు రాత్రికిరాత్రే ప్రభుత్వానికి సెజ్ కూడా చెల్లించకుండానే పంటను తెలంగాణ నుంచి ఆంధ్రాకు తరలిస్తున్నట్లు సమా చారం. ఈ ఆంధ్రా దళారులకు స్థానికంగా ఉండే కొందరు వ్యక్తులు సహకరి స్తూ ఇక్కడ రైతులను తమ కమీషన్లకు కక్కుర్తిపడి నిండా ముంచుతున్నట్లు తెలుస్తుంది.

# అసంపూర్తిగా గత ఇందిరమ్మ ఇండ్లు

### ఇప్పుడు లబ్ధిదారులుగా చేర్చాలని పేదల వేడుకోలు
### పూర్తి కావస్తున్న ప్రస్తుత ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే

**ప్రజాపక్షం/ఖమ్మం :** అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు లేని పేదలను వారి సొంత స్థలాల్లో ఇండ్ల నిర్మాణానికి అవకాశం కల్పించింది. ఇందిరమ్మ ఇండ్ల పేరిట అనుమతులు ఇచ్చి ఇండ్లు ప్రారంభం అయిన తర్వాత దశల వారీగా బిల్లులు చెల్లించింది. 2014 సం.నాటికి రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఇండ్ల నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. తొలుత పూర్తి నగదు ఇచ్చిన ప్రభుత్వం, ఆ తర్వాత కొంత నగదు, ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇసుక అందించారు. 2014లో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం లోనికి వచ్చిన తర్వాత సొంత స్థలాల్లో ఇండ్ల నిర్మాణానికి స్వస్తి చెప్పి డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని పథకాన్ని మార్పు చేసింది. డబుల్ బెడ్రూం ఇండ్లకు సంబంధించి ఆశించిన స్థాయిలో లక్ష్యాన్ని చేరుకోలేక పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం 2006 నుండి 2014 వరకు మూడు దశల్లో ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టింది. మొదటి దశలో రూ.25వేలు ఇచ్చిన ప్రభుత్వం రెండవ దశలో ఒక్కొక్క ఇంటికి రూ.50వేలు ప్రకటించింది. మూడవ దశలో ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.1 లక్ష 60 వేలు చొప్పున, ఇతరులకు రూ.70వేలు చొప్పున మంజూరు చేసింది. చాలా మంది లబ్ధిదారులు వారుండే పూరిళ్లను తొలగించి ఇండ్ల నిర్మాణం మొదలుపెట్టారు. మూడవ దశలో ఇండ్లు మంజూరైన వారిలో దాదాపు 70 శాతం మందికి బిల్లులు చెల్లించలేదు. ఇందులో ఎక్కువ మందికి బిల్లులు రాక నానా అవస్థలు పడుతున్నారు. ఇందులో కొందరు అప్పులు చేసి స్లాబ్‌లు వేసుకోగా, స్థోమత లేని మరి కొందరు ఇండ్లను అసంపూర్తిగా వదిలేసి గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం స్వంత స్థలాల్లో ఇండ్ల నిర్మాణ పథకాన్ని ప్రారంభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కూడా ఇందిరమ్మ పేరిట ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రజాపాలనలో భాగంగా ఇందు కోసం గ్రామాల వారీగా దరఖాస్తులు స్వీకరించారు. ఈ ప్రభుత్వం లబ్ధిదారులుగా ఉండి ఇండ్లను పూర్తి చేసుకోలేకపోయిన వారిని గుర్తించి కూడా ప్రస్తుత లబ్ధిదారులుగా చేర్చాలని, ఏఏ దశల్లో ఇల్లు ఆగిపోయాయో అక్కడి నుండి నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందో ఆ మేరకే బిల్లులు చేయించి నిధులు మంజూరు చేయాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇండ్ల నిర్మిస్తామని ప్రకటించిన విషయం విధితమే. కానీ దరఖాస్తులు పెద్ద సంఖ్యలో వచ్చాయి. సగటున నియోజవర్గానికి పదిహేను వేల నుండి ఇరవై వేల దరఖాస్తులు వచ్చాయి. వీటిలో నుండి 3500 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం అంత సులువైన పని కాదు. నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. ఇక బిఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పట్లో ఈ శాఖలో పని చేసిన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను కూడా విధుల్లోనికి తీసుకో వాలని కోరుతున్నారు.

# సాంప్రదాయ గిరిజన మ్యూజియం

### ఆకర్షించేలా ఏర్పాట్లు
### పాతకాలపు ఇండ్లు, వెదురు నివాసాలు
### నోరూరించే గిరిజన వంటకాలు
### బోట్ షికార్, అబ్బురపరిచే కళారూపాలు
### ముక్కోటి నాటికి అందుబాటులోకి









**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన ముఖద్వారమైన భద్రాచలం ఐటిడిఏ ప్రాంగణంలో పూర్తి గ్రామీణ వాతా వరణం ఉట్టిపడేలా సాంప్రదాయ మ్యూజియం సిద్ధమవుతోంది. ఇప్పటికే మట్టిగోడలతో ఇంటిని నిర్మించారు. మరో రెండు, మూడు గిరిజన నివాసాలను అస్సాంకు చెందిన వెదురు బొంగులను తెప్పించి అక్కడి వారిని ఇక్కడికి రప్పించి సిద్ధం చేస్తున్నారు. మరో ప్రక్క పిల్లలకు ఆహ్లాదాన్ని పంచే బోటింగ్, గిరిజన సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు, రుచికరమైన గిరిజన వంటకాలను అందుబాటులోకి తేనున్నారు. ఇవన్నీ ముక్కోటి నాటికి సిద్ధం చేసి భద్రాచలం వచ్చే భక్తులను ఆకర్షించే విధంగా తయారుచేస్తున్నారు. సహజ సిద్ధమైన ప్రకృతి ఒడిలో పర్యాటకులు సేద తీరేలా తీర్చిదిద్దుతున్నారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఏ పిఓ బి రాహుల్ కేంద్ర పర్యాటక శాఖ సూచనలు, సలహాలతో నిర్మాణాలు చేయిస్తున్నారు.



**నోరూరించే గిరిజన వంటకాలు..**

ఫాస్ట్ ఫుడ్ కల్చర్‌కు అలవాటు పడి ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్న తరుణంలో గిరిజనులు పూర్వకాలం ఆచరిస్తున్న ఆహారపు అలవాట్లు అయిన అంబలి, జావ, గటక, గంజితో పాటు రాగి, మొక్క జొన్న, జొన్న, ఉలవ లడ్డూలు, బిస్కెట్లు, కరకొమ్ముల కూర, పచ్చకూర, బొద్దకూర, చెంచల కూరను వండి అందుబాటులోనికి తేనున్నారు. అంతే కాకుండా నాటు కోడి పులుసు, ఎండుచేపలు, పచ్చి చేపలు, రొయ్యలు, ఎండు చేపల కారం, కర్వే పాకు, కారం, ఉల్వకారం, మునగా కు కారం, బొంగు చికెన్, గుగ్గి ళ్లు, సీజన్ వారిగా దొరికే తునికి, పాల, ఎలగ పండ్లు, ఊసిరి కాయలు, రేగి ప ండ్లు, పరిగి పండ్లు, నక్కెర పండ్లు, సీమ చింత కాయలు, చింత కాయలు అందుబాటులోనికి ఉంచ నున్నారు.



**అందుబాటులో గిరిజన సామాగ్రి...**

ఇప్పటికే ఉన్న గిరిజన మ్యూజియంలో గిరిజనులు ఉపయోగించే అన్ని రకాల ఆటా, వేడుక, వ్యవసాయ వస్తువులు అందుబాటు ఉన్నాయి. కొమ్ము, డోలు, బాణాలు, బరి సెలు, సొరకాయ బుర్రలు, పాత కాలపు నులక, వెదురు మంచాలు, కుర్చీలు, ఎడ్ల బండి, గొమ్ములు, ఉయాల, చెక్కరోలు, రోకలి, ఇసు ర్రాయి, వంట సామాగ్రి, అడవి, వ్యవసాయ పని ముట్లు, చెక్కబొమ్మ లు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయి. వీటితో పాటు నూతన నిర్మిస్తున్న పూర్వకాలపు ఇండ్లు, పాకల తో అంతా ఆకర్షణీయంగా తయా రు చేసి యాత్రికు లను ఆకట్టుకుని ఆహ్లాద పరిచే విధంగా సిద్ధం చేస్తున్నారు. ముక్కోటి వచ్చే భక్తులు గిరిజన మ్యూజియాన్ని తిలకించి ఆనందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## చెరువుల ఎఫ్‌టిఎల్ తేల్చండి: హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హెచ్ఎండీయే పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్ గుర్తింపు ప్రక్రియ పురోగతిపై నివేదిక ఇవ్వాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశించింది. చెరువుల ఎఫ్‌టీఎల్ ప్రక్రియ పూర్తి చేయాలంది. వీటిపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలంది. ఫైనల్ నోటిఫికేషన్ జారీకి సంబంధించి తీసుకుంటున్న చర్యలపై పూర్తి వివరాలు ఇవ్వాలంది. ఇందుకు ఫిబ్రవరి 4వ తేదీ వరకు గడువు ఇచ్చింది. రామమ్మ కుంటలో ఎఫ్‌టీఎల్ పరిధిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కట్టడాలపై పిల్ దాఖలైంది. దీనిని విచారణ చేపట్టిన హైకోర్టు, హెచ్ఎండీయే పరిధిలోని చెరువులపై విచారణ ప్రారంభించింది. చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన బెంచ్ ఎదుట గురువారం విచారణ చేపట్టింది. హెచ్ఎండీయే పరిధిలో 3342 చెరువులున్నాయి. వాటిలో 2793లకు ఎఫ్‌టీఎల్ గుర్తింపునకు ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడింది. 708 చెరువులకు ఎఫ్‌టీఎల్ కోసం ఫైనల్ నోటిఫికేషన్ వెలువడింది.. అని ప్రభుత్వం చెప్పింది. సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు విచారణను వచ్చే నెల 4కి వాయిదా వేసింది.

## లగచర్ల రైతుల ముందస్తు బెయిల్ పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ఆఫీసర్లపై దాడి చేశారంటూ దాఖలైన కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ పవర్ నాయక్ మరో 11 మంది పిటిషన్ వేశారు. వీటిని జస్టిస్ కె.లక్ష్మణ్ విచారించి ప్రభుత్వానికి, బొమ్మరాస్‌పేట పీఎస్‌కు నోటీసులు జారీ చేశారు. గత నవంబరు 11న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు అధికారులపై దాడిలో తమ పాత్ర లేదని పిటిషనర్ల వాదన. కౌంటర్లు వేయాలన్న హైకోర్టు, తదుపరి విచారణను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది.

## నోటిఫికేషన్ తర్వాత కట్టడాలా?

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నల్గొండ జిల్లా శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం చేసేందుకు భూసేకరణ చేపట్టాక సదరు భూముల్లో నిర్మాణాలు చేయడంపై హైకోర్టు ఆగ్రహాన్ని వెలిబుచ్చింది. భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేశాక అనుమతులు ఎలా ఇస్తారని, మండల, గ్రామ పంచాయతీ అధికారులను ప్రశ్నించింది. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని జస్టిస్ టి.వినోద్‌కుమార్ అభిప్రాయపడ్డారు. భూసేకరణకు వ్యతిరేకం కాదని, నష్టపోయిన తనకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాస చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ శ్రీనివాసాచారి కోరారు. విచారణ ఈ నెల 20కి వాయిదా పడింది.

## ఘనంగా సావిత్రిబాయి పూలే 194వ జయంతి

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే 194వ జయంతిని వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుం జయ నాయుడు బిసి శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన హైదరాబాదులోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యా యురాలైన సావిత్రి బాయి పూలే జీవితం ఆద్యంతం అత్యంత ఆదర్శవం తమైనదన్నారు. మహిళలను కనీసం బయటకు కూడా వెళ్లకుండా మనువాదులు కట్టడి చేసిన ఆ రోజుల్లో తను చదువు నేర్చుకొని బాలికలకు విద్య ఎంతో అవసరమని భావించి అనేక అవమానాలు భరించి 1885 సంవత్సరంలోనే పూనాలో మొట్టమొదటి బాలికల పాఠశాల ఏర్పాటు చేసిన ఘనత సావిత్రిబాయి పూలేది అని ఆయన పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో చదువు ఎంతో ముఖ్యమైనది అని ఆమె భావించడం వల్లనే ఇవాళ అనేకమంది విద్యలో రాణిస్తున్నారని అందువల్ల సావిత్రి బాయి పూలే ను స్మరించుకుంటూ ఆమె చేసిన అసమాన త్యాగాలను నేటితరం వారికి వివరించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళా ఉపాధ్యాయురాళ్ళకు బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

## పార్టీ కార్యకర్తలు గులాబీ జెండాకు వెన్నముక: కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గెలుపు, ఓటములతో నిమిత్తం లేకుండా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో కనబర్చిన కదనోత్సాహం రాష్ట్ర స్థాయిలో పని చేసే నాయకత్వంలో కూడా మాటలకందని స్థాయి లో కొండంత స్ఫూర్తి నింపిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. గ్రామ, గ్రామాన ఉన్న గులాబీ సైనికులు రాష్ట్ర ప్రజలపక్షాన విరామం ఎరుగని పోరాటం చేస్తున్నారన్నారు. ఈ మేరకు కెటిఆర్ తన ట్విట్టర్‌లో (ఎక్స్) పోస్ట్ చేశారు. కార్యకర్తలే పార్టీకి పునాది రాళ్లని, బిఆర్ఎస్‌కు మూలస్తంభాలు అని, గులాబీ జెండాకు వెన్నుముక లాంటి వారని కెటిఆర్ అన్నారు.

## 'ఐఎల్' ప్యాకెట్ క్యాలెండర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎల్) ప్యాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గురువారం మల్కాజ్‌గిరి బార్ అసోసి యేషన్ కార్యాలయంలో ఐఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవిఎల్, మల్కాజ్‌గిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌తో పాటు పలువురు సభ్యులు ప్యాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

## ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేక రైళ్లు

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల నుంచి ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు వెళ్లేవారి కోసం రైల్వే శాఖ 26 ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ నెల14 నుంచి 45 రోజుల పాటు ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే ప్రత్యేక రైళ్లను నడుపుతోన్న రైల్వే శాఖ తాజాగా తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లేవారి కోసం అదనంగా మరో 26 ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నట్లు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం, కాకినాడ టౌన్, తెలంగాణలోని మౌలాలి జంక్షన్, వికారాబాద్, సికింద్రాబాద్ స్టేషన్ల నుంచి ఈ ప్రత్యేక రైళ్లు వెళ్లనున్నాయి. భక్తుల అవసరాలు, భద్రత కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో 45 కోట్లమంది భక్తులు పాల్గొని గంగాస్నానం ఆచరించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## టిజిఓ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2025 క్యాలెండరును గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిజిఓ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.బి. కృష్ణ యాదవ్, ఉపాధ్యక్షులు డాక్టర్ సురేందర్, రాజేందర్, ఆర్. కోటజి, శ్రీరామ్, సునీత జోషి, మంజుల రెడ్డి, నర్సింగ రావు, బి. కుమార్, శ్రవణ్ కుమార్ రెడ్డి, ఎం.డి గౌస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన 'సిఎం కప్-2024' క్రీడా పోటీలు

సంతాపదినాల నేపథ్యంలో నిరాడంబరంగా కార్యక్రమం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామీణ క్రీడారంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో, మట్టిలో మాణిక్యాల క్రీడా ప్రతిభకు గుర్తింపునిచ్చి వారిని చాంపియన్లుగా తీర్చిదిద్దాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సిఎం కప్ 2024 క్రీడా పోటీలు నిరాడంబరంగా ముగిసాయి. మొట్టమొదటిసారి గ్రామీణ స్థాయి నుండి మండల జిల్లా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో దాదాపు 2 లక్షల మంది యువ క్రీడాకారులు పాల్గొన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారుల సమాచారాన్ని గేమ్స్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా నిక్షిప్తం చేశారు. వివక్షతకు తావు లేకుండా ప్యారా క్రీడాంశాల్లో కూడా ఈ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొంటున్న యువ క్రీడాకారులకు ఉత్సాహం కల్పించేందుకు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ టార్చ్ రిలే కార్యక్రమాన్ని నిర్వహించింది. అక్టోబర్ 3వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ టార్చ్ రిలేను ప్రారంభించారు.

**16 రోజులపాటు..**

33 జిల్లా కేంద్రాల్లో దాదాపు 2700 కిలోమీటర్లు ఈ టార్చ్ రిలే కొనసాగింది. ఇందులో పెద్ద ఎత్తున విద్యార్థినీ విద్యార్థులు, యువ క్రీడాకారులు భాగస్వామ్యం అయ్యారు. డిసెంబర్ 7వ తేదీ ప్రజా పాలన దినోత్సవంలో భాగంగా జరిగిన కార్యక్రమాల్లో నల్లగొండ జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. డిసెంబర్ 7, 8 వ తేదీల్లో గ్రామస్థాయి పోటీలు, డిసెంబర్ 10 నుండి 12 వరకు మండల స్థాయి పోటీలు, డిసెంబర్ 16 నుండి 21 వరకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. డిసెంబర్ 27న రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభమై గురువారం వరకు కొనసాగాయి. 36 క్రీడ అంశాల్లో సాగిన ఈ పోటీలు కేవలం హైదరాబాద్ నగరంలో ఉన్న స్టేడియాలకే పరిమితం కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని జెఎన్ స్టేడియంలో సెపక్‌తక్రా హ్యాండ్ బాల్ బ్యాడ్మింటన్ అథెటిక్స్ రెజ్లింగ్ అంశాలలో మెన్ అండ్ ఉమెన్ పోటీలు, వరంగల్ జిల్లా కేంద్రంలో ఖోఖో పోటీలు, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ కేంద్రంగా జూడో పోటీలు, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కబడి నెట్ బాల్ పోటీలు, మెదక్ జిల్లా కేంద్రంలో సాఫ్ట్ బాల్ పోటీలు, ఖమ్మం జిల్లా కేంద్రంలో వాలీబాల్ ఆర్చరీ పోటీలు నిర్వహించారు.

హైదరాబాద్ గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో హాకీ కిక్ బాక్సింగ్ స్విమ్మింగ్ టైక్వాండో, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో బాస్కెట్ బాల్, ఆటిపాట్యా యోగ ఎల్.బి.నగర్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, పవర్ లిఫ్టింగ్, చెస్ అకింపేట స్పోర్ట్స్ స్కూల్లో ఫుట్‌బాల్ మెన్ అండ్ విమెన్, షూటింగ్ రేంజ్‌లో షూటింగ్ ఈవెంట్స్ సైక్లింగ్ మహేశ్వరంలో సైకిల్, మాదాపూర్ హైటెక్ సిటీ గేమ్స్ పాయింట్‌లో స్క్వాష్ పోటీలు, హుస్సేన్ సాగర్‌లో రోయింగ్, కాయ కింగ్ అండ్ కానో యింగ్, కెవిపి ఈఆర్ ఇండోర్ స్టేడియంలో ఉషా కరాటే పోటీలు నిర్వహించగా గచ్చిబౌలి స్టేడియంలో పారా క్రీడాంశాలు అథెటిక్స్ సిట్టింగ్ బాస్కెట్‌బాల్ సిట్టింగ్ వాలీబాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

**ఇకనుండి ప్రతి సంవత్సరం సిఎం కప్ నిర్వహణ**

సిఎం కప్ పోటీల నిర్వహణ ద్వారా గ్రామీణ క్రీడాకారులకు రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనే అవకాశం కల్పించామని, ఇకనుండి ప్రతి సంవత్సరం మరింత పకడ్బందీగా ఈ పోటీలు నిర్వహిస్తామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన రెడ్డి తెలిపారు.

ఈ పోటీలో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడి సమాచారాన్ని నిక్షిప్తం చేశా మని, భవిష్యత్తులో ఆయా క్రీడాంశాల్లో జరిగే పోటీల్లో కానీ అకాడమీ అకాడమీ సెలక్షన్‌లో వీరికి ప్రాధాన్యత ఇవ్వబోతున్నామని ఆయన చెప్పారు. మరిన్ని గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహించడానికి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ 2025 సంవత్సరంలో ప్రణాళికలు రూపొందిస్తుందని ఆయన వివరించారు.

## రెండు రోజుల్లో ప్రభుత్వ కుంభకోణాలు బయటపెడతా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల కుంభకోణాలు చోటు చేసుకుంటున్నాయని బిజెపి శాసనసభాపక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మరో రెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ అవినీతి కుంభకోణాన్ని బయట పెట్టబోతున్నానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కుంభకోణాలలో మంత్రుల హస్తం కూడా ఉందని, ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలతో అన్ని వివరాలు బయట పెడతామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఏ ఒక్క హామీని నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. గత సంవత్సరమంతా ఎగవేతల నామ సంవత్సరంగా ముగిసిందని కనీసం కొత్త సంవత్సరమైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు భరోసాను ఇ కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తూ రైతులను పూర్తిగా మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్రాంతి నుంచైన రైతు భరోసాను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా పరిమితికి మించి రాష్ట్ర ప్రభుత్వం అప్పుల మీద అప్పుల చేస్తోందని, అధికారం చేపట్టిన 390 రోజుల్లోనే రోజుకు 354 కోట్ల అప్పు.. గంటకు 14 కోట్ల 70 లక్షల చొప్పున ఇప్పటి వరకు 1,38,117 కోట్ల (1.38 లక్షల కోట్ల) రూపాయలు అప్పులు చేసిందని విమర్శించారు. అయినా రైతులకు ప్రజల ఇచ్చిన హామీలను మాత్రం నేరవేర్చడం లేదని, ఈ డబ్బులకు ఎక్కడికి పోతున్నాయో తెల్చుతామన్నారు.




'టిఎస్‌జిఆర్‌ఇఎ డైరీ-2025'ని ఆవిష్కరించిన శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఈ కార్యక్రమంలో 'టిఎస్‌జిఆర్‌ఇఎ అధ్యక్షుడు జి.దామోదర్ రెడ్డి తదితరులు..

# నష్టపోయిన బిసి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించండి

ఈ నెల 8న 'విద్యుత్ బిసి ఉద్యోగుల రాష్ట్ర మహాసభ'



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బిసి ఉద్యోగులకు పదోన్నతులను కల్పించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్‌పిడిసిఎల్, ఎన్‌పిడిసిఎల్ సంస్థల్లో పని చేస్తున్న వేలాది మంది విద్యుత్ బిసి ఉద్యోగుల రాష్ట్ర మహాసభ'ను ఈ నెల 8న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన 'బిసి ఉద్యోగుల మహాసభ'కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను, పలు డిమాండ్ల మహాసభలో తీర్మానం చేస్తామని, అలాగే '2025 సంవత్సరానికి చెందిన డైరీ, వాల్ క్యాలెండర్, క్యాలెండర్ క్యాలెండర్ల'ను ఆవిష్కరిస్తామని వివరించారు. జూన్ 2,2014 తర్వాత ఇచ్చిన పదోన్నతులను సమీక్షించి,నష్టపోయిన బిసి ఉద్యోగులకు పదోన్నతులను, బిసి ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్లను కల్పించాలని అన్నారు.1999 నుండి 2004 సంవత్సరం వరకు చేరిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని, విద్యుత్ సంస్థల్లో సుమారుగా 24 వేల మంది ఉద్యోగులు ఆర్టిజన్లుగా కొనసాగుతున్నారని, ఇందులో వారి వారి అర్హతల ఆధారంగా పదోన్నతులు కల్పించాలని కోరారు. విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల నియామకాల్లో 50 శాతం పోస్టులను బిసి అధికారులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమానికి బిజెపి ఎంఎల్‌ఎ ఈటల రాజేందర్, లోక్‌సభ సభ్యులు ఉన్నతాధికారులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న బిసి ఉద్యోగులు వేలాదిగా హాజరై మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, తెలంగాణ విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోడెపాక కుమార స్వామి, ముత్యం వెంకన్న గౌడ్, రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్, ఎం అశోక్ కుమార్, డాక్టర్ చంద్రుడు, పి యాదగిరి, మారం శ్రీనివాస్, నీలారపు రాజేందర్, సదానందం, సామల శివాజీ, ఎం విజయ కుమార్, కొమరవెల్లి రవీందర్, ఆడెపు శ్రీకాంత్, పిల్లి అశోక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# 3వ రోజుకు చేరుకున్న సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికుల సమ్మె

పెంచిన హమాలీ రేట్లు చెల్లించేవరకూ సమ్మె కొనసాగిస్తాం : బాల్‌రాజు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 3వ రోజు విజయవంతంగా కొనసాగింది. పెంచిన హమీలను ఛార్జీలను చెల్లించేంత వరకు తమ సమ్మె కొనసాగుతూనే ఉంటుందని, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు స్పష్టం చేశారు. ప్రజా పంపిణీ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు హమాలీ కార్మికులు బరువులు మోస్తూ 187 మండల పాయింట్లలో ఎగుమతి, దిగుమతి చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లయిస్ హమాలీలను కార్మికులుగా గుర్తించకుండా శ్రమదోపిడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక పోరాటాల, ఉద్యమాల వల్ల గత ప్రభుత్వం యూనియన్లతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి హమా లీ రేట్లు పెంచి అమలు చేస్తామని అంగీకరించి చెల్లించారు. అయితే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 12 నెలలు దాటినా హమాలీ రేట్ల జి.ఓ. విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ హమాలీ కార్మికుల శ్రమదోపడికి పాల్పడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 3600 హమాలీలు 160 మంది మహిళా కార్మికులకు ప్రభుత్వం జనవరి 2024 నుండి హమాలీ రేట్లను పెంచి అమలు చేయాల్సివుండగా, ప్రత్యక్షంగా కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చలలో ప్రతి క్వింటాల్ ఎగుమతి, దిగుమతికి రూ.29లు చెల్లిస్తామని అంగీకరించిందని వెల్లడించారు. అయితే ఇందుకు సంబంధించిన జి.ఓ.విడుదల చేయకపోవడంతో హమాలీ కార్మికులు చాలని చాలని డబ్బులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదే క్రమంలో అధికారులు డిసెంబర్ 31 లోపే జి.ఓ.విడుదల చేస్తామని హామీ ఇచ్చి 3 నెలలు గడుస్తున్నా జి.ఓ. ఇవ్వకుండా కాలయాపన చేయడంతో అనివార్య పరిస్థితుల ఈనెల 1 నుంచి నిరవధిక సమ్మె చేపట్టినట్లు బాల్‌రాజు వెల్లడించారు. సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే జి.ఓ.విడుదల చేసి బకాయి హమాలీ రేట్లను చెల్లించి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ సమ్మెను విరమణకు చర్యలు తాసుకోవాలని కోరారు. లేకపోతే నిరవధిక సమ్మెలో భాగంగా నిరసన కార్యక్రమాలు, ప్రదర్శనలు, ధర్నాల ద్వారా తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# 6న చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

దక్షిణ మధ్య రైల్వే ప్రకటన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం తేదీ ఖరారైంది. జనవరి 6వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించనున్నారు. రూ.413 కోట్లతో ఏర్పాటు చేసిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను గతేడాది డిసెంబర్ 28 ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిచెందడంతో కార్యక్రమం వాయిదా పడింది. మాజీ ప్రధాని మృతి కారణంగా వారం రోజులపాటు కేంద్ర ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించింది. ఈ మేరకు కార్యక్రమం వాయిదా పడింది. అయితే తాజాగా జనవరి 6వ తేదీన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, జి. కిషన్ రెడ్డి నేరుగా పాల్గొంటారని, ప్రధాని మోదీ మాత్రం వర్చువల్‌గా హాజరై రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించనున్నారు. రెండు నెలల్లో మొత్తం నాలుగు సార్లు టెర్మినల్ ప్రారంభోత్సవం వాయిదా పడడం రైల్వే వర్గాలను తీవ్రంగా నిరాశపరిచింది. మరో కొత్త తేదీ ప్రకటించడంతో ఈసారైనా ఎలాంటి అవాంతరాలూ లేకుండా కార్యక్రమం జరగాలని రైల్వే అధికారులు, రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు.

**చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రత్యేకతలు..**

జనవరి 6న చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమైతే సుమారు 50 వేల మంది ప్రయాణికులకు ట్రాఫిక్ నుంచి ఉపశమనం లభిస్తుంది. గంటల తరబడి ట్రాఫిక్ సమస్య నుంచి వారికి విముక్తి కలుగుతుంది. చర్లపల్లి వద్ద ప్రస్తుతం 26 రైళ్లు ఆగుతుండగా, ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ప్రతి రోజూ 50 రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. దీంతో వేగంగా గమ్య స్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుంది.

రైల్వే అధికారులు ప్రస్తుతం ఇక్కడ 2 ఎంఎంటిఎస్ ప్లాట్‌ఫామ్‌లతో కలిపి మొత్తం 9 ప్లాట్‌ఫామ్‌లు, 6 ఎస్కలేటర్లు, 2 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. ప్రయాణికుల కోసం ఉచిత వైఫై సౌకర్యం కల్పించేందుకు చర్య లు చేపట్టారు. వెయిటింగ్ ఏసి, నాన్ ఏసి హాల్స్, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, రిజర్వేషన్ కౌంటర్లు, టికెట్ కౌంటర్లు వంటివి సిద్ధం చేశారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభమైతే హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్‌లపై ప్రయాణికుల భారం తగ్గనుంది.

## న్యాయవ్యవస్థలోనూ... సామాజిక న్యాయం పాటించాల్సిందే




**ప్రజాపక్షం/ హైదరాబాద్:** న్యాయ వ్యవస్థలోనూ సామాజిక న్యాయాన్ని పాటించాల్సిందేనని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయి నపల్లి వినోద్ కుమార్ అన్నారు. తెలంగాణ హైకోర్టుకు 42 మంది న్యాయమూర్తులు ఉండాలని నిర్ణ యం తీసుకున్నప్పటికీ, ఎపుడూ 23 మంది న్యాయమూర్తులకు మించి భర్తీ చేయడం లేదన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వెంటనే జోక్యం చేసుకుని, పూర్తి స్థాయిలో న్యాయమూర్తుల నియామకానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంల ఆయన మాట్లాడుతూ తెలంగాణ న్యాయ మూర్తులలో ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించిన వారె వ్వరూ లేరన్నారు. హైకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య నానాటికీ పెరుగుతోందని, న్యాయమూర్తులు పూర్తి స్థాయిలో ఉంటె తప్ప, ఆ కేసులు తొంద రగా పరిష్కారానికి నోచుకోబోవని వినోద్‌కుమార్ చెప్పారు. శామీర్‌పేటకు మెట్రో రైల్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదని, ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజల కష్టాలు పోవాలంటే నాగపూర్ తరహాలో జెబిఎస్ నుంచి శామీర్ పేటకు డబుల్ డెక్ ఫ్లై ఓవర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభు త్వానికి సూచించారు.

## 'తెలంగాణ మీ కోసం ఎదురుచూస్తోంది'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాల ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసే ప్రక్రియలో భాగంగా టూరిజం ప్రమోషన్‌లో భాగంగా రూపొందించిన ప్రచార వీడియోని పర్యాటక శాఖ గురువారం విడుదల చేసింది. ప్రపంచ నలుమూలాల నుంచి పర్యాటకులను ఆకర్శించడమే లక్ష్యంగా సహజమైన ప్రకృతి అందాలు, వారసత్వ కట్టడాలను ఈ వీడియోలో అద్భుతంగా చూపించారు. 'తెలంగాణ మీ కోసం ఎదురుచూస్తోంది' అనే పేరుతో రూపొందించిన 58 సెకన్ల నిడివి గల ఈ ప్రమోషనల్ వీడియో జోడేఘాట్ లోయ, నల్లమల అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కిన్నెరసాని వైల్ లైఫ్ శాంక్చురీ, కుమ్రం భీం ప్రాజెక్ట్, ఎస్ఆర్ ఎస్పీ (నందిపేట) బ్యాక్ వాటర్స్ , ప్రపంచ వారసత్వ ప్రదేశంగా యునెస్కో పొందిన రామప్ప ఆలయం, ప్రపంచ పర్యాటక సంస్థ (యూఎన్డబ్ల్యూటీవో)చే బెస్ట్ టూరిజం విలేజ్‌గా గుర్తింపు పొందిన భూదాన్ పోచంపల్లి, యాదగిరిగుట్ట ఆలయం, ఘనపురం కోటగుళ్ళు, పాండవుల గుట్ట, నాగార్జునసాగర్, ఘనపురం చెరువు, వంటి అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి.

## వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సర్వే నెంబర్ 255లో గల ప్రభుత్వ భూమిలో పేదలు కట్టుకున్న ఇండ్లకు పట్టాలు ఇచ్చి వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మేరకు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎస్.వీరయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఒక విజ్ఞాపన పత్రాన్ని అందజేసింది. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 255 లోని 220 ఎకరాల ప్రభుత్వ భూమిలో 150 ఎకరాల భూమిని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా గాంధీ హయాంలో కొంతమంది పేద రైతులకు అగ్రిమెంటు పట్టాలు ఇచ్చారని, మిగిలిన 70 ఎకరాల భూమిని గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎంఎల్ఎ బానోత్ శంకర్‌నాయక్, అతని బినామీలు అయిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్ముకుం టున్నారని వారు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సర్వేనంబర్లోనే సిపిఐ (ఎం) ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకుని రెండేళ్ళుగా నివసిస్తు న్నారని, మాజీ ఎంఎల్ఎ శంకర్‌నాయక్, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రోద్భలంతో ఆనాటి అధికారులు పేదల గుడిసెలను తొలగించి, ఆ భూమిని ఆక్రమణదారులకు అప్పగించడం కోసం గుడిసెవాసులపై 18సార్లు దాడులు చేశారని, గుడిసెలను కూల్చివేసి 200 మందిపై అక్రమ కేసులు పెట్టారని, 20 మందిని జైలుకు పంపారని వారు సిఎంకు వివరించారు.ఈ విషయంలో జోక్యం చేసుకుని, గుడిసెలు వేసుకుని నివాసముంటున్న స్థలంలో పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఈ పేదలను ఆదుకోవాలని వారు సిఎంని కోరారు.

## టిజిటిడిసి చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ (టిజిటిడిసి) చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిని గురువారం తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, ఔట్‌సోర్సింగ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు శ్రీరాముల యాదవ్, ప్రణీత్, దిగంబరం, రవి, సురేష్, రమేష్, మల్లేష్‌తో కలిసి రాజమౌళి గురువారం హిమాయత్ నగర్‌లోని టూరిజం ప్రధాన కార్యాలయంలో చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టూరిజం కార్పొరేషన్‌లో పని చేస్తున్నటువంటి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని వారు కోరినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి తెలియజేశారు. 2025 సంవత్సరంలో టూరిజం బాగా అభివృద్ధి చెందాలని చైర్మన్‌తో అన్నట్లు, ఉద్యోగుల పక్షాన కూడా పూర్తి సహకారం అందిస్తామని చెప్పినట్లు రాజమౌళి తెలిపారు.

## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో ప్రజాపక్షం క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు అన్ని పథకాలు అమలుపరుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, డిహెచ్‌పిఎస్ జిల్లాప్రధాన కార్యదర్శి బండిలక్ష్మి పతి, వైస్‌ఎంపిపి జానకిరాములు, ఇందిరమ్మ కమిటీసభ్యులు వెంకటస్వామి, ఖాజ పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాపక్షం/వెల్దండ:మండలపరిధిలోని పెద్దాపూర్ గ్రామపంచాయతీకి చెందిన కాయితి మధుకర్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.34వేల చెక్కును గురువారం బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధివలన బలహీనవర్గాల ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని ఈ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌కమిటీ డైరెక్టర్ శేకుమల్లకృష్ణ, దుబ్బతండాశ్రీనునాయక్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## దిశ జిల్లా కమిటీ సభ్యుడిగా మోతిలాల్ నాయక్



ప్రజాపక్షం/వెల్దండ : జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ(దిశ) సభ్యులుగా, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎం.మోతిలాల్ నాయక్‌ను నియమిస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి పియూష్‌రంజన్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. మోతిలాల్‌నాయక్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికోసం ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షణ జరిపి ప్రజలకు అభివృద్ధిని సార్థకంచేసేందుకు తాను కృషిచేస్తానని ఆయన తెలిపారు.

## అవినీతి రహిత ప్రజాపాలనే లక్ష్యం



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : అవినీతి రహిత ప్రజాపాలన ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్య మని, అందుకు అనుగుణంగా జిల్లా అధికారులు సైతం ప్రజలకు సేవ చేయాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యా లయంలోని విడిమో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలోకి స్వేచ్ఛగా సంతోషంగా అడుగు పెట్టబోతున్నామన్నారు. మాది అధికారుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని ఆయన స్పష్టం చేశారు. అక్కడిక్కడా కొందరిలో ఆలసత్వం ఉందని, తమ దృష్టికి వచ్చిన చిన్న చిన్న పనులను సైతం పెండింగ్ లో పెట్టవద్దని తమ దృష్టికి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు, అన్నివిభాగాలజిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



ప్రజాపక్షం/వంగూర్: మండలపరిధిలోని రంగాపూర్ గ్రామమాజీ సర్పంచ్ కాశమోనిచంద్రమౌళి అనారోగ్యంతో గత పదిరోజులక్రితం మృతిచెందారు. రాష్ట్ర వ్యవసాయ కమీషన్‌సభ్యులు కెవిఎన్‌రెడ్డి గురువారం చంద్రమౌళి దశదినకర్మలో పాల్గొని కుటుంబసభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు మొగులయ్య, రాజు, శ్రీనివాసులు, నాగయ్య పాల్గొన్నారు.

## టిజెఎస్ వనపర్తి జిల్లా యువజన అధ్యక్షుడిగా కుప్పిరెడ్డి సాయికుమార్ రెడ్డి

ప్రజాపక్షం/పెద్దమందడి: వనపర్తి జిల్లా టిజెఎస్ పార్టీ జిల్లా యువజన అధ్యక్షుడిగా ప్రొఫెసర్ కోదండరాం పార్టీ అధ్యక్షునిగా ఆదేశాల మేరకు గత మూడు సంవత్సరాల నుండి పెద్దమందడి మండల అధ్యక్షుడిగా పని చేసిన కుప్పిరెడ్డి సాయికుమార్‌రెడ్డిని వనపర్తి జిల్లా యువజన అధ్యక్షుడిగా నియమించినట్లు వనపర్తి జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా నిన్న వినతి పత్రం అందజేశారు.అదేవిధంగా ప్రొఫెసర్ కోదండరాం మన తెలంగాణ రాష్ట్రంలో అతి త్వరలోనే మంత్రివర్గంలో స్థానం సంపాదిస్తారనిఆయన తెలియజేశారు. అనంతరం పార్టీ సభ్యులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిపిఆర్‌ఒ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు



ప్రజాపక్షం/నారాయణపేట : నారాయణపేట జిల్లా పౌర సంబంధాల సమాచార శాఖ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్‌ను డిపిఆర్‌ఒ ఎంఎ రషీద్ కట్ చేసి కార్యాలయ ఉద్యోగులు,సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరం అందరి జీవితాలలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి



ప్రజాపక్షం/వెల్దండ : నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంపి మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. గురువారం వెల్దండ మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయాన్ని ఎమ్మెల్యేతో కలిసి ఎంపి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యాలయంలో మూత్ర, మరుగుదొడ్లు, స్నానపుగదులను ఆయన పరిశీలించి, విద్యార్థినిల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపి మల్లు రవి మాట్లాడుతూ తానుసైతం 5వతరగతి నుంచి ఎంబిబిఎస్ వరకు వసతిగృహాలలో ఉండి చదువుకున్నానని గుర్తు చేశారు. పత్రికలో వచ్చిన వార్తనుచూసి చలించిపోయానని అందుకే వచ్చినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలనుంచి విద్యార్థు లు విద్యతోనే ఉన్నతస్థానాలు సాధ్య మని, గుర్తురెగి ప్రణాళికబద్ధంగా చదివి ఎంచుకున్న లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. తన నిధుల్లోంచి అవసరమగు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చా రు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలపై దృష్టిపెట్టి గొప్ప వ్యక్తులుగా తయారుకావాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వం అందజేస్తున్న కొత్తమెనూ ప్రకారం అందజేస్తున్నారా అని ప్రిన్సిపాల్ స్వర్ణరత్నం విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. పిసిబి సభ్యులు బాలాజిసింగ్, తహాసీల్దార్ కార్తీక్‌కుమార్, ప్రిన్సిపాల్ స్వర్ణరత్నం, నాయకులు మోతిలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, భూపతి రెడ్డి, వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్‌యాదవ్, శేఖర్, ఆలీ, శ్రీను, అంజయ్య పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుపై దృష్టి సారించాలి : జిల్లా కలెక్టర్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి : కొత్త సంవత్సరంలో అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల అమలులో జిల్లాను సమష్టి కృషితో ముందువరుసలో ఉంచుదామని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో నూతన 2025 సం వత్సర శుభాకాంక్షలను కలెక్టర్ బదావత్‌సంతోష్‌కు కలెక్టరేట్ వివిధశాఖల ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియ జేశా రు. అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జిల్లాఅధికారులు ఆర్‌డిఓలు , కలెక్టరేట్ ఎఒ చంద్రశేఖర్ , పలువురు పాత్రికేయులు కలెక్ట ర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలందరికి మంచి జరగాలన్నారు. యువత సన్మార్గంలో పయనిస్తూ మంచిదిశగా వెళ్లడంతోపాటు తల్లి దండ్రులు పిల్లల భవిష్యత్తుపైదృష్టి సారించాలన్నారు. అదేవిధంగా పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకా ంక్షించారు. జిల్లా అధికారులు అందరూ కలిసికట్టుగా పనిచేసి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధికా రులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికి చేరేలా కృషి చేయాలని సూచించారు. వివిధశాఖల సిబ్బంది, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, తహసీల్దార్లు కలెక్టర్‌కు కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## అమరుల ఆశయాలు సాధిద్దాం



ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : ప్రజల కోసం పోరాడిన అమరుల ఆశయాలను సాధించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కె. విజయరాములు, నేతలు పిలుపునిచ్చారు. గురువారం వనపర్తి సిపిఐ కార్యాలయంలో సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బర్ధన్, వనపర్తి సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి డి. చంద్రయ్య వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కె. విజయరాములు, కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, రమేష్ , శరీరాం, గోపాలకృష్ణ, శ్రీహరి, రవీందర్ , పృథ్వీనాదంలు మాట్లాడారు. దేశంలో బిజెపి మత రాజకీయాలు ముమ్మరమైన దశలో బర్ధన్ సిపిఐ పార్టీ పగ్గాలు చేపట్టి సమర్థ నాయకత్వం పార్టీని పటిష్టం చేసిందన్నారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో ఎన్నో కార్మిక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. ఫలితంగా కార్మికులకు అనుకూలంగా పలు చట్టాలు వచ్చాయన్నారు. వనపర్తిలో ప్రజా పోరాటాలకు కేరాఫ్ అడ్రస్‌గా చంద్రయ్య నిలిచారన్నారు. పేదలకు ఇండ్లు , ఇండ్ల స్థలాలు భూముల కోసం పోరాడారన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ జె. చంద్రయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ , ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, ఉపాధ్యక్షుడు శ్రీరాం, ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, డిహెచ్ పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ , ఏఐవైఎఫ్ నేత లక్ష్మీనారాయణ, ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ పట్టణ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్ శిరీష, సిపిఐ సీనియర్ నాయకులు చిన్న కురుమన్న, పృధ్వీనాదం తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి సర్వసిద్ధం



ప్రజాపక్షం/మక్తల్: మక్తల్ నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్న మక్తల్ మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి సర్వం సిద్ధమైందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని ఎమ్మెల్యే తెలిపారు. మంత్రి బిజీ షెడ్యూల్ లో శుక్రవారం ఉదయం 9 గంటలకు మక్తల్ పట్టణ శివారులోని పెద్ద చెరువు సమీపంలోని దండు క్రాసింగ్ వద్దకు చేరుకుంటారని అక్కడికి పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చి ఘన స్వాగతం పలకాలని సూచించారు. అనంతరం అక్కడి నుంచి భూత్పూర్ గ్రామానికి మంత్రి వెళ్లి అక్కడ పునరావస పనులపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారన్నారు. అనంతరం 11 గంటలకు మక్తల్ మార్కెట్ కార్యాలయం వద్ద జరిగే నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి మంత్రి జూపల్లితో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు , ఇతర ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సమస్యలతో పాటు ముంపు గ్రామాలైన భూత్పూర్ , నేరేడు గోమ్ లకు సంబంధించి ఇంకా నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉందని దీనిపై మంత్రితో చర్చిస్తామని తెలిపారు. ఇప్పటికే ముంపు గ్రామాలైన అనుగొండ అంకెన పల్లి దాదన్‌పల్లిలకు ముంపు కింద ఇంకా నిధులు కేటాయిం చాల్సిందని అదేవిధంగా సంగం బండ ఉజ్జలిలకు సైతం కొన్ని నిధులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నింటిపైన మంత్రితో చర్చిస్తామని హామీనిచ్చారు. అనంతరం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణారెడ్డి, లక్ష్మా రెడ్డి, గవినోళ్ల గోపాల్ రెడ్డి, ఏ. రవికుమార్ , గాయత్రి,అనిల్,శివరాంరెడ్డి, అబ్దుల్ రెహమాన్ శంషుద్దీన్ , అస్మద్దీన్ , నాగరాజ్ , కావలి రాజేందర్, బోయనర్సింహ, గడ్డం రమేష్ , చెన్నయ్య గౌడ్ , గుంతలి రవి , వేణుగౌడ్ , మల్లేపల్లి రవీందర్ , వాకిటి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలో వీపనగండ్ల విద్యార్థికి మూడో బహుమతి




ప్రజాపక్షం/వీపనగండ్ల: హనుమకొండలో సిఎంకప్ 2024 రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలో వీపనగండ్ల గ్రామానికి చెందిన విద్యార్థి తృతీయ బహుమతి పొంది తన సత్తా చాటారు. గ్రామానికి చెందిన మధుగని రా ముడు పెద్ద కుమారుడు మధుగని శశింద్ర హైదరా బాద్‌లోని ఉస్మాని యా యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ ఇటీవల వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపి కయ్యారు. హనుమకొండలో బుధ, గురువారాల్లో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని తృతీయ బహుమతిని గెలుచుక్నునాడు

## పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



ప్రజాపక్షం/వీపనగండ్ల: అప్పుల బాధ భరించలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐకె రాణి కథన ప్రకారం మండల పరిధిలోని తూముకుంట గ్రామానికి చెందిన ఆవుల రాముడు (48) తనకున్న కొద్దిపాటి వ్యవసాయ పొలం పనులు చేసుకోవడంతో పాటు , కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు అని తెలిపారు. ఇద్దరు ఆడపిల్లల పెళ్లి ఇటీవల చేయడంతో పాటు, వ్యవసాయానికి చేసిన అప్పులు కూడా ఎక్కువ కావడంతో ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా వెంటనే బంధువులు కొల్లాపూర్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసంనాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించిచికిత్స పొందుతుం డగా సాయంకాలం మృతి చెందినట్లు ఎస్ఐ కె. రాణి తెలిపారు. మృతునికి భార్య రేణుక ఇద్దరు ఆడ పిల్లలు , ఒకరు కుమారుడు ఉన్నట్లు తెలిపారు.

# బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

డిఎస్‌పి ఎన్. లింగయ్య



ప్రజాపక్షం నారాయణపేట : జిల్లాలో 1 నుండి 31 వరకు ఆపరేషన్ స్మైల్ 11 కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయం కాన్ఫరెన్స్‌హాల్‌లో డిఎస్‌పి ఎన్. లింగయ్య వివిధ డిపార్టుమెంట్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పా టు చేశారు. డిపార్టుమెంట్ వారీగా నిర్వహించే విధుల గురించి చర్చించి తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు ఇచ్చారు. ఆపరేషన్ స్మైల్ 11 కార్యక్రమం ద్వారా తప్పిపోయిన పిల్లలను గుర్తించడం, బాల కార్మికులుగా పని చేస్తు న్న చిన్నారుల సమస్యలను పరిష్కరించడం, అ క్రమ రవాణాకు గురైన చిన్నారుల రక్షణ, వారికి పునరావాసం కల్పించి, చట్టపరమైన హక్కులు, రక్షణ వంటి వివిధ అంశాలను డిఎస్పి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ పిల్లల హక్కులను కాపాడేందుకు పోలీసు విభాగం ఇతర విభాగాలు కలిసి బృందాలుగా ఏర్పడి బస్టాండ్లు, ఫ్యా క్టరీలు, వాణిజ్య సంస్థలు, హోటళ్లు, ఇతర ప్రదేశాలను సందర్శించి బాల కార్మికులుగా పని చేస్తున్న పిల్లలను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గల్లంతైన, బాల కార్మికులుగా బాధపడుతున్న పిల్లలను రక్షించడం సమాజ పు నాదులను బలోపేతం చేయడంలో కీలకమైన చర్య అని, పిల్లల భవిష్యత్తును రక్షించడం ద్వారా సమాజంలో ఒక శక్తివంతమైన మార్పును తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల హక్కులను కాపాడుతూ వారి భవిష్యత్తు మెరుగ్గా తీర్చిదిద్దే దిశగా ముం దడుగు వేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మురళీ, సునీత, డిఈఓ గోవిందరాజులు, సిడబ్ల్యూసి మెంబర్ యాదయ్య, డిసిపిఓ తిరుపతయ్య, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ నర్సింహ, మెడికల్ డిపార్ట్మెంట్ నర్సింహరావు, లేబర్ డిపార్ట్మెంట్ తిలక్ , పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి : డిఇఒ



ప్రజాపక్షం/కల్వకుర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోరానున్న పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా సబ్జెక్టు ఉపాధ్యాయులంతా కృషిచేయాలని, వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ సూచించారు. గురువారం వెల్దం డ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్‌స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి గదిలో విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన పద్ధతులను పరిశీలించారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయులు ఐదుఅంశాలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల, పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఉపాధ్యాయుల కృషి వల్లే ప్రభుత్వ పాఠశాలల విద్య బలోపేతం అవుతుందన్నారు. రానున్న పదోతరగతి ఫలితాల్లో నాగర్ కర్నూల్ జిల్లా ఉత్తమస్థానంలో నిలిచేలా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. డిఇఒ వెంట వెల్దండ, ఎంఇఒ చంద్రుడునాయక్‌లు ఉన్నారు.

## విద్యార్థులకు అల్పాహార వితరణ



ప్రజాపక్షం/పెబ్బేరు : మండల పరిధిలోని అ య్యవారిపల్లి గ్రామంలో గురువారం నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థు లకు అల్పాహారం ఏర్పాటుకు పూర్వ విద్యార్థులు గ్రామస్తులు ముం దుకువచ్చినట్లు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు , ఎనిమిది గంటల నుంచి జరుగుతున్నందున కాంగ్రెస్ నాయకులు లక్ష్మ ణ్ నాయుడు పదో తరగతి ఎగ్జామ్స్ అయిపోయే వరకు అల్పాహా రాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, కర్ణచారి, వడ్ల రాములు, ప్రభాకర్ గౌడ్ , శ్రీను, రాజాగౌడ్ , భాస్కర్ , నిరంజన్ , బాలరాజ్ , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మాసోత్సవాలపై అవగాహన




ప్రజాపక్షం/పెబ్బేరు: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో పెబ్బేరు ఎంవిఐ కార్యాలయంలో ఎంవిఐ వాసుదేవరావు ఆఫీసులో వివిధ రకాల వినియోగదారులకు ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. పెబ్బేరు మోడల్ స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ , రోడ్డు ప్రమాదాల నివారణపై సైన్స్ ప్రదర్శన నిర్వహించగా విద్యార్థులు తమదైన శైలిలో ప్రదర్శనలు చేసి వాటిని ఆంగ్లంలో క్షుణ్ణంగా వివరించి అక్కడికి వచ్చిన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఎ ఆఫీసు స్టాఫ్ వెంకటేష్ , పిడి కమలాకర్ పాల్గొన్నారు.

## వైభవంగా వెంకన్న కల్యాణం



ప్రజాపక్షం / కొత్తకోట: కొత్తకోట పట్టణ సమీపంలో వెంకటగిరి క్షేత్రం వెలిసిన శ్రీ భూలక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణం వైభోగంగా నిర్వ హించారు. పూజలు అనంతరం అమ్మవారికి మంత్రోచ్చరణల మధ్య మేళ తాళాలతో స్వామివారి కళ్యాణం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. నూతన సంవత్సరం సందర్భంగా కొత్తకోట పట్టణ ప్రాంతానికి చెందిన భక్తులు గురువారం వెంకటగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కళ్యాణ కార్యక్రమంలో గొల్లబాబు, వేముల శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, బలిజేపల్లి శ్రీనివాసులుశెట్టి, ధన్వాడ వెంకటేష్ ,గాయత్రి శేఖర్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనశాల తనిఖీ



ప్రజాపక్షం/కొత్తకోట : కొత్తకోట మున్సిపాల్టీ కేంద్రంలోని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉర్దూ మీడియం పాఠశాలలోని ఆకస్మా త్తుగా మధ్యాహ్న భోజనశాల పథకం పదార్థాలు కొత్తకోట కాంగ్రెస్ పార్టీ నాయకులు తనిఖీలు చేశారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు సలీమ్‌ఖాన్, టౌన్ ఉపాధ్యక్షులు తయ్యబ్ టౌన్ , ప్రెసిడెంట్ ఎజాజ్ అలీ, ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం



ప్రజాపక్షం/కొత్తకోట:కొత్తకోట పట్టణంలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో జాతీయ రహదారికి అనుకొని అయ్యప్ప జంక్షన్‌లో నిర్మి స్తున్న శ్రీ భూతనాథ అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి సన్ రైజర్స్ వాకర్స్ క్లబ్ సభ్యులు రూ.25,116 విరాళాన్ని అయ్యప్ప సేవా సమితి వ్యవస్థ పకులు శ్రీ గోపాలకృష్ణ గురుస్వామి, అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు శ్రీ దూపం నాగరాజుకి అందజేశారు. పి.జె.బాబుతో పాటు సన్ రైజర్స్ వాకింగ్ సభ్యులు న్యాయవాది రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోకస్

# వ్యవసాయం



## సైడ్ బిజినెస్‌గా 'పుట్టగొడుగులు'



వ్యవసాయదారులకేగాక, వ్యవసాయేతర పనులు చేసే వారు కూడా అదనపు ఆదాయం కోసం సైడ్ బిజినెస్‌గా పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టవచ్చు. ఎన్నో పోషక విలువలు కలిగి, కొవ్వు, పిండి పదార్థం తక్కువగా ఉండడం వీటి ప్రత్యేకత. మాంసకృత్తులు అధికంగా ఉంటాయి. పెరుగుదలకు అవసరమైన లైసిన్ అమైనో ఆమ్లం వీటిలో అధిక మోతాదులో ఉంటుంది. అందుకే, ఇటీవల కాలంలో పుట్టగొడుగులకు డిమాండ్ పెరిగింది. నగరాలు, పట్టణాల్లో కూడా, రూఫ్ గార్డెన్‌గా వీటిని పెంపకాన్ని మొదలుపెట్టడం లాభదాయకం. దేశంలో వివిధ రకాల పుట్టగొడుగులు సాగు చేస్తున్నారు. వాటిలో ముత్యపుచిప్ప పుట్టగొడుగు, వరి గడ్డి పుట్టగొడుగు, పాల పుట్టగొడుగువంటివి కీలకం. పుట్టగొడుగులు విచ్చుకొని ముత్యపు చిప్ప ఆకారంలో ఉండటం వల్ల వీటికి ఆపేరు వచ్చింది. వీటిలో తెల్ల ముత్యపు చిప్ప, ఎల్లో ముత్యపు చిప్ప, గ్రే, పింక్ రకం ప్రాచుర్యంలో ఉన్నాయి. వీటిని రైతులు తమ వద్ద లభించే వరిగడ్డితోనే కాక వ్యవసాయ సంబంధమైన ఏ వ్యర్థపదార్థం ఉపయోగించి అయినా సులభంగా పండించవచ్చు. మిగతా రకాలతో పోలిస్తే ఇవి అధిక దిగుబడులను ఇస్తాయి. కాబట్టి తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడికి అధిక లాభాలను సంపాదించే రకంగా ఇవి ప్రాచుర్యాన్ని పొందాయి. వీటిని అధికంగా దక్షిణ భారతదేశంలో సాగు చేస్తారు. దీని సాగు కోసం, వరిగడ్డిని సుమారు 35 సెంటీ మీటర్ల పొడవుతో ముక్కలుగా చేసుకోవాలి. తరువాత మంచి నీటిలో 46 గంటలు నానబెట్టిన తర్వాత నీటిని తీసివేయాలి. ఇలా నానబెట్టిన గడ్డిని గోనె సంచిలో నింపి వేడి నీటిలో ఒక గంట పాటు ఉంచి తరువాత తీసివేసి గడ్డిలో 60 నుంచి 65 శాతం తేమ ఉండేలా ఆరబెట్టాలి. తేమ శాతం తనిఖీ చేయడానికి చేతినిండా గడ్డిని తీసుకోని వెళ్ళ మధ్య ఉంచి పిండినట్లయితే నీరు కారకుండా ఉంటే, తగినంత తేమ శాతం ఉన్నట్లుగా నిర్ధారించుకోవచ్చు. పాలిథీన్ సంచుల్లో ఆరబెట్టిన వరిగడ్డి ముక్కల్ని 5 సెంటీ మీటర్ల మందాన వేసి విత్తనాన్ని అంచుల వెంట కాకుండా మధ్యలో వేయాలి. 1 కేజీ వరిగడ్డికి 50 గ్రాముల స్పాన్ కలిపి మరి గట్టిగా వత్తకుండా సంచులలో నింపి రబ్బరు బ్యాండ్ బిగించాలి. తర్వాత సంచులను స్పాన్ రన్నింగ్ గదిలోకి మార్చాలి. ప్రతి రోజు గదిలో తగినంత తేమ, ఉష్ణోగ్రత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. 34 వారాల్లో బెడ్లపైన తెల్లని శిలింధ్రం దట్టంగా వ్యాపిస్తుంది. ఇలా తయారైన బెడ్లపైన పాలిథీన్ సంచులను శుద్ధి చేసిన బ్లేడుతో కత్తిరించాలి. గదిలో గాలి, వెలుతురు సరఫరా అయ్యేలా చూసుకోవాలి. ఇలా చేసిన తర్వాత 67 రోజులకు మొదటి పంట వస్తుంది. బెడ్లను రోజుకు 2 సార్లు తడిపి తేమ 65 శాతం ఉండేలా చూసుకోవాలి. తర్వాత 15 రోజుల వ్యవధిలో రెండవ మరియు మూడవ పంట వస్తుంది. బెడ్లను ప్రతిరోజు పరిశీలిస్తూ నలుపు, ఆకుపచ్చ, పసుపుపచ్చ రంగు ఉన్న బెడ్లను తీసి దూరంగా గుంటలో వేయాలి. లేకుంటే ఇతర బెడ్లకు వ్యాపించే అవకాశం ఉన్నది. ప్రతి కిలో ఎండు గడ్డి నుండి దాదాపు కిలో పచ్చి పుట్టగొడుగులు వస్తాయి. వీటిని



తాజాగా ఉన్నప్పుడే 24 గంటల్లో మార్కెటింగ్ చేయాలి. ఫ్రిజిలో అయితే 3 రోజుల వరకు నిల్వ ఉంటాయి. అదే ఎల్లో పుట్టగొడుగులు గది ఉష్ణోగ్రత వద్ద 3 రోజులు, ఫ్రిజ్ లో అయితే 10 రోజుల వరకు నిల్వ ఉంటాయి. పాల పుట్టగొడుగుల పెంపకం కూడా దాదాపు ముత్యపుచిప్ప పుట్టగొడుగుల మాదిరిగానే ఉంటుంది. వీటికి 30 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, 80 నుంచి 95 శాం గాలిలో తేమ, తగినంత వెలుతురు అవసరం. మార్చి నుంచి అక్టోబర్ వరకు ఈ రకమైన పుట్టగొడుల పెంపకం అనువైన కాలం. వీటి సాగులో రెండు దశలు ఉంటాయి. మొదటి దశలో 21 నుంచి 24 రోజులు ఇంక్యుబేషన్ కోసం డార్క్ రూమ్ సృష్టించుకోవాలి. 24వ రోజున కేసింగ్ చేసి కాంతి అందే చోట సాగు చేయాలి. పాల పుట్టగొడుగు సాగు కోసం వరిగడ్డిని సేకరించి క్రిమిరహితం చేసుకోవాలి. ఇలా క్రిమిరహితం చేసిన గడ్డిని 50 శాతం తేమశాతం ఉండేలా ఆరబెట్టుకోవాలి. నాణ్యమైన పాల పుట్టగొడుగు స్పాన్‌ను తీసుకొని, సమాన నాలుగు భాగాలుగా చేసుకోవాలి. స్పానింగ్ చేసే ముందు చేతులను క్రిమిరహితం చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ సంచిలో స్పాన్, వరిగడ్డి పొరలుగా వేసుకోవాలి. ఇలా తయారు చేసుకున్న బ్యాగులకు రంధ్రాలు పెట్టి వాటిని డార్క్ రూమ్ లో 21 నుంచి 24 రోజుల వరకు ఉంచామి. డార్క్ రూమ్‌లో 28 నుంచి 35 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉండాలి. కేసింగ్ ప్రక్రియ 24 వ రోజున పాటించాలి. ఇందుకోసం నల్లమట్టి, కొకోపీట్, వెర్మికాంపోస్ట్, వంటివి వాడవలెను. పి. హెచ్ నిర్వహణ కోసం చాక్ పౌడెర్ వంటివి కలపవచ్చు. ఒక సంచిని రెండు భాగాలుగా చేసి దానిమీద కేసింగ్ మట్టిని వేసుకోవాలి. ఇలా కేసింగ్ చేసిన వాటిని కాంతి అందే గదిలో పెట్టుకోవాలి. ఇక్కడ 28 నుంచి 35 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత, 80 నుంచి 85 శాతం తేమఉండాలి. ప్రతిరోజు పైన ఉన్న మట్టిలో తేమశాతం ఉండేలా చూసుకోవాలి. ఒక 10 నుంచి 12 రోజుల తరువాత మొలకలు కనిపిస్తాయి. అనంతరం 18 నుంచి 20 రోజుల్లో పంట అందుతుంది.

### పుట్టగొడుగుల పెంపకములో పాటించవలసిన మెళకువలు

- మంచి రకం విత్తనం (స్పాన్)నే వాడాలి. సాగు చేయు స్థలంలో పూర్తి పరిశుభ్రతను పాటించాలి.
- గదిలో తగినంత ఉష్ణోగ్రత, తేమ వుండేలా జాగ్రత్త వహించాలి.
- వారానికి కనీసం 2 సార్లు గోడలు, నేలపై ఫార్మాలిన్ ద్రావణాన్ని పిచికారి చేయాలి.
- పిచికారి చేసే సమయంలో బెడ్స్ పై నీరు పడకుండా తప్పనిసరిగా ఏదైనా కప్పాలి. క్రాపింగ్ రూములలో తగినంత వెలుతురు, గాలి ప్రసరణ వుండేలా చూడాలి.
- క్రాపింగ్ సమయంలో పుట్టగొడుగులు తీసిన తరువాత మాత్రమే బెడ్స్ నీరు చల్లాలి.
- గదిలోకి ఎలుకలు, కీటకాలు ప్రవేశించకుండా చూడాలి. గది కిటికీలకు జాలి బిగించాలి.
- ఆకుపచ్చని నల్లని మచ్చలు కనిపించిన బెడ్స్ తక్షణం అక్కడి నుండి తొలగించి పారవేయాలి. తద్వారా వ్యాధి వ్యాపిచకుండా నిరోధించవచ్చు.

ఇవి వివిధ మార్గాల్లో సేకరించిన వివరాలు మాత్రమే... నిపుణుల సలహా తీసుకొని పుట్టగొడుగుల సాగును చేపట్టాలి).

# వికేంద్రీకృత నీటి వ్యవస్థలు అవసరం



సాగు, తాగు నీరుకు ఎలాంటి ప్రాధాన్యం ఉందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. అయితే, గత కొన్ని దశాబ్దాలుగా వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయి. మనిషి స్వయకృతమే పలు వైపరీత్యాలకు కారణమవుతున్నది. దాదాపు అన్ని దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో నీటి వనరులది అగ్రస్థానం. కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో అనావృష్టిని చూస్తునే ఉన్నాం. ఇలాంటి విపరీతమైన ధోరణుకల ఆఫ్రికా దేశాలను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు ఇథియోపియాలోని సొమాలీ ప్రాంతంలో నీటి అభద్రత విపరీతంగా పెరిగింది. ఫలితంగా వికేద్రీకృత నీటి వ్యవస్థల అవసరం మరోసారి తెర పైకి వచ్చింది. ఆయా ప్రాంతాలకు అనువైన నీటి వ్యవస్థలవైపు దృష్టి సారించక తప్పని పరిస్థితి ఏర్పంది. కన్సల్టేటివ్ గ్రూప్ ఆఫ్ ఇంటర్నేషనల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (సిజిఐఎఆర్) నివేఇదకను అనుసరించి, వలసలు, సహజ జనాభా పెరుగుదల, పట్టణీకరణ వంటి అనేక కారణాలతో ఒక ప్రాంతంలో వసతుల కొరత ఏర్పడుతుంది. ప్రత్యేకించి నీటికి అధిక డిమాండ్ ఏర్పడుతుంది. ఇథియోపియా–సొమాలియా సరిహద్దుకు సమీపంలో ఉన్న బోకోల్మ్యాయో, మెల్యాడిడా, కోబ్, హిలావేన్, బురామినో అనే ఐదు ప్రాంతాల్లోని శరణార్థుల శిబిరాల వద్ద పరిశోధకులు విస్తృత అధ్యయనాలు జరిపారు. స్థానికుల అవసరాలు తీరడమే అంతంత మాత్రంగా ఉన్న తరుణంలో, శరణార్థులు వచ్చి చేరడం వల్ల మౌలిక సదుపాయాలకు తీవ్రమైన కొరత ఏర్పడింది. నీటి కటకట పెరిగింది. వరుస కరువుల కారణంగా, భారీగా పశునష్టం సంభవించింది. వ్యవసాయానికి నీటి కోసం నదులపై ఆధారపడక తప్పలేదు. కొంత మంది లోతట్టు ప్రాంతాలకు వెళ్లారు. అక్కడ కూడా అకాల వర్షాలు. వరదలతో నష్టపోక తప్పడం లేదు. గత ఏడాది ముంచెత్తిన వరదలు ఇథియోపియాతోపాటు సొమాలియాను కూడా దారుణంగా దెబ్బతీశాయి. మొత్తం మీద ఇక్కడ నీటి వనరులు సమృద్ధిగా లేవు. భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. నదుల మళ్లింపు జరగలేదు. దీనితో అతివృష్టి, అనావృష్టి. ఈ పరిస్థితులను పరిశీలించిన తర్వాత నీటి వనరుల వికేంద్రీకరణ లేదా వికేంద్రీకృత నీటి వనరుల ఆవస్యకత గురించి చర్చ మొదలైంది. యుద్ధ ప్రాతిపదిక మీద చర్యలు తీసుకోక పోతే, భవిష్యత్తు మరింత ప్రమాదకరంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్న తరుణంలో, నీటి వనరులపై జాగ్రత్తలు అవసరమన్న ఆలోచన అందరికీ కలిగింది. సాగు, తాగు నీటి అవసరాలను గుర్తించి, వికేంద్రీకృత నీటి వ్యవస్థల వృద్ధికి ప్రయత్నాలు జరిగాయి. యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్ (యుఎన్‌హెచ్‌సిఆర్) గతంలో ఈ ప్రాంత నీటి వ్యవస్థలలో పెట్టుబడి పెట్టినప్పటికీ, క్రమంగా నిధులు తగ్గాయి. స్థానిక, ప్రాంతీయ అధికారులకు పాలనా బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఈ మార్పు ఎంత వరకూ ఫలితాన్ని ఇస్తుందో చూడాలి. అన్ని ప్రాంతాలకూ నీటి వసతి ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసి, వాటిని సమర్థంగా అమలు చేస్తే, కరువు పరిస్థితులు కొంత వరకైనా తగ్గుతాయి. ఇది కేవలం ఇథియోపియా లేదా సోమాలియాకు మాత్రమే పరిమితం కాదు కాబట్టి, ప్రపంచ దేశాలన్నీ ఇక్కడి పరిస్థితులను గమనించి, పాఠాలు నేర్చుకొని, తదుపరి చర్యలకు ఉపక్రమించక తప్పదు.

# పర్యావరణం

### పర్యావరణ పరిరక్షణకు తక్షణం చేపట్టాల్సిన చర్యలు

- అన్ని దేశాలు మూకుమ్మడిగా కర్బన ఉద్గారాల్ని 2050 నాటి కల్లా సున్నా శాతానికి తగ్గించివేయాలి. ముందుగా జి20 దేశాలు ఇందు కు నడుము భిగించాలి. కాలుష్య కారక ఇంధనాలకు బదులుగా, పునరుద్ధరించబడే సహజ సిద్ధ ఇంధనాల్ని, సౌరశక్తిని వినియోగంలోకి తేవాలి.
- ఈ దశాబ్దాంతానికి (2030) హరిత వాయువల్ని విడుదలను గణనీయంగా తగ్గించాలి.
- కొత్తగా థర్మల్ విద్యుత్ కేంద్రాల్ని నిర్మించవద్దు. ఉన్నవాటిని దశల వారిగా మూసివేయాలి.
- కొత్తగా పెట్రోలియం నిక్షేపాల కోసం అన్వేషణ, తవ్వకాలు చేపట్టవద్దు.
- కర్బన్ ఉద్గారాల్ని అన్ని స్థాయిల్లోనూ, మొత్తంగా లేదా క్యుమిలేటివ్‌గా లెక్కించాలి.
- కాలుష్యరహిత సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలి.
- ఇప్పటికే వెలువడిన కార్బన్ డయాక్సైడ్ను వాతావరణం నుంచి తొలగించాలి.
- అత్యధిక శాతం శాశ్వత అడవుల్ని పెంచాలి.
- శిలజ ఇంధనాల వినియోగం ఆపివేయాలి.
- అడవుల నరికివేతను ప్రపంచవ్యాపితంగా నిషేధించి, పోగొట్టుకున్న అడవిని తిరిగి యుద్ధ ప్రాతిపదికన పునరుద్దరించాలి.
- పట్టణీకరణను నియంత్రించాలి.
- అంటే భూగోళాన్ని 19వ శతాబ్దిస్థాయి నాటి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మార్పు చెందించాలి.

### కాలుష్యం ఉచ్చులో 'హిండన్'



ఒకప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని పలు కీలక ప్రాంతాల్లో వ్యవసాయానికి, మత్స్య సంపదకు ఎంతగానో ఉపయోగపడిన హిండన్ నది నేడు కాలుష్యమయమైంది. శుద్ధి చేయని వ్యర్థాల కాలువగా మారింది. ఈ పరిణామం పర్యావరణ క్షీణతకు ప్రతీక. ఈ కాలుష్యం పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని పారిశ్రామిక బెల్ట్‌లో ఉన్న సమాజాలను ప్రమాదంలోకి నెడుతున్నది. హిండన్ నది ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్పూర్ జిల్లాలోని దిగువ శివాలిక్ శ్రేణుల నుండి ఉద్భవించింది. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని పారిశ్రామిక ప్రాంతం మీదగా సుమారు 400 కిలోమీటర్లు ప్రవహించి, నోయిడాలోని యమునా నదిలో కలుస్తుంది. ఈ నదికి కాళి (పశ్చిమ), కృష్ణా ఉపనదులుగా హరాయి. కాగా, మితిమీరిన పారిశ్రామికీకరణ, అదుపులేని పట్టణీకరణ హిండన్ నది పర్యావరణ సమతుల్యతను నాశనం చేశాయి. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి) 2015లోనే హిండన్‌ను 'మృత నది'గా ప్రకటించింది. విపరీతమైన కాలుష్య స్థాయిలు ప్రజారోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. పర్యావరణ క్షీణతకు దారితీసే మితిమీరిన కాలుష్యంతో కూడిన నదులను 'డెడ్ రివర్'గా పేర్కొంటారు. హిండన్ పరిరక్షణకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వంగానీ, ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ సర్కారుగానీ చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. పెరుగుతున్న కాలుష్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని, ఇప్పటికైనా నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ప్రజాహితమే ప్రధాన లక్ష్యం కావాలి

### ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణలో ఎంఎల్ఎ కూనంనేని



ప్రజాపక్షం/భద్రాచలం: ప్రజాహితమే ప్రధాన లక్ష్యంగా పత్రికలు పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం కొత్తగూడెం క్యాంపు కార్యాలయంలో 2025 సం.ప్రజాపక్షం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా ముందుండాలని, ప్రజలకు మేలు జరిగేందుకు నిర్భ యంగా నిష్పక్షపాతంగా వార్తలు రాయాలని సూచించారు. ప్రజాపక్షం దినపత్రిక ప్రగతిశీల భావా జాలంతో ప్రజలగొంతుకై పనిచేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, ప్రజాపక్షం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పందా సత్యానంద్, కొత్త గూడెం టౌన్, లక్ష్మీ దేవిపల్లి, పాల్వంచ రిపోర్టర్లు రమేష్,చంద్రగిరి ప్రసాద్, తదితరులున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గం కావాలి

### 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం దినపత్రిక ప్రజాసమస్యల పరిష్కారానికి మార్గం కావాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ అన్నారు. 2025 సం. ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్‌ను గురు వా రం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. పత్రికలు ప్రజా సమస్యలను బాహ్య ప్రపంచానికి తెలిసే విధంగా కథనాలు రాస్తూ వారు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు దొరికే విధంగా ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లాలని, ప్రగతిశీల భావాలతో ముందుకు సాగుతున్న ప్రజాపక్షం దినపత్రిక మరింత నూతన ఒరవడితో ప్రజా సమస్యల పరిష్కారానికి వారధి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిపోర్టర్ పందా సత్యానంద్, ఏపూరి వెంకటేశ్వరరావు, ఎస్‌విఎస్ నాయుడు,మహేష్, కొండబాబు, పాటు తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లై హమాలీల నిరవధిక సమ్మె



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి సివిల్ సప్లై గోదాంలో పని చేస్తున్న హమాలీ కార్మికులు బుధవారం సమ్మె బాట పట్టారు. 2024 అక్టోబర్ నెలలో అధికారులతో జరిగిన చర్చల్లో హమాలీ రేట్లు పెంచడానికి అంగీకారం కుదిరినా 3 నెలలుగా పెంచిన రేట్లు చెల్లించడం లేదని హమాలీ తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై హమాలీ యూనియన్ పెద్దపల్లి అధ్యక్ష, కార్యదర్శులు కడారి తిరుపతి, కడారి నరేష్ తెలిపారు. పెంచిన రేట్లను చెల్లించాలని అనేక సార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో సమ్మె నోటీసు అందజేసి ఆందోళన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం పెంచిన హమాలీ రేట్లను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గోదాం ముందు గురువారం భైఠాయించి నిరసన దీక్ష చేశారు. దీక్షను ఎఐటియుసి నాయకులు కడారి సునీల్, పూసాల రమేష్ ప్రారంభించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్‌ఉపాధ్యక్షుడు బూత్కూరి పోషమల్లు, నాయకులు ధర్ని సతీష్, బెల్లపు శ్రీనివాస్, పెసరి లింగయ్య, నర్ర సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల కమ్యూనిస్టు 'ఎ.బి.బర్ధన్'



ఖమ్మంలో ..



హనుమకొండలో.



మంచిర్యాలలో..



ఖమ్మంలో ..

### సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతురావు

ప్రజాపక్షం/ ఖమ్మం : తుది శ్వాస వరకు ఎర్రజెండా నీడలో పేదల అభ్యున్నతి కోసం పని చేసిన బర్ధన్ నిబిబద్ధత గల కమ్యూనిస్టు అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతురావు యువజన విద్యార్థి ఉద్యమం నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్య దర్శి వరకు అంచెలంచలుగా ఎదిగి బర్ధన్ కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిన మ హోన్నత వ్యక్తి అని ఆయన అన్నారు. సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీనియర్ కమ్యూ నిస్టు ఎబి బర్ధన్ సీనియర్ కమ్యూనిస్టు ఎబి బర్ధన్ 9వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో బర్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతురావు మాట్లాడుతు నిరంతరం శ్రమ జీవిగా పేరొందిన బర్ధన్ ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శిగా, శాసన సభ్యు డిగా పనిచేశారని ఆయన తెలిపారు.భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శిగా పలు రాష్ట్రాల్లో కమ్యూనిస్టు పార్టీని విస్తృత పర్చడానికి బర్ధన్ తీవ్రంగా కృషిచేశారని హేమం తురావు తెలిపారు. వామపక్ష శక్తుల ఐక్యత ప్రజాపోరాటాలే బర్ధన్‌కు సరైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్‌కె జాని మియా, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సబ్యులు పోటు కళావతి, పోటు పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిస్టు సైద్ధాంతిక తత్వవేత్త బర్ధన్

#### రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్

ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి : కమ్యూనిస్టు సైద్ధాంతిక తత్వవేత్త ఎబి బర్ధన్ అని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్ అన్నారు. శుక్రకవారం ఎబి.బర్ధన్ 9వ వర్ధంతి సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రజా సం ఘాల శ్రేణులు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్ మాట్లాడుతూ కామ్రేడ్ ఎబి.బర్ధన్ తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలనుఅనుసరించి ప్రజలతో, కార్యకర్తలతో నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. బర్ధన్ విద్యార్థి దశ నుంచి ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలీందర్ అలీఖాన్, జోగుల మల్లయ్య, కారుకురి నగేష్, మిట్టపల్లి శ్రీనివాస్, లింగం రవి, మిట్టపల్లి పౌలు దేవి పోచన్న, కుంచాల శంకరయ్య, మొగిలి లక్ష్మణ్, కొడి వేంకటేశం, పూజారి రామన్న, మంద యాదగిరి, నర్స య్య, సారయ్య, రాయమల్లు,జోసేఫ్, పాల్గొన్నారు.

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : దేశంలోనే ఆదర్శ కమ్యూనిస్టు నేత కామ్రేడ్ ఎ.బి. బర్ధన్ జీవితం ఆదర్శమని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. గురువారం హనుమ కొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి అమర జీవి కామ్రేడ్ ఎబి బర్ధన్ 9వవర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఐ నాయకులు పూలమాల లు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కర్రె బిక్షపతి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మాజీ జాతీయ కార్యదర్శి ఎ.బి.బర్ధన్ కామ్రేడ్ ఎ.బి.బర్ధన్ తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలను అనుసరించి ప్రజలతో, కార్యకర్తలతో నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా మా జీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్. అశోక్ స్టాలిన్, జిల్లా నాయకులు మునిగాల బిక్షపతి,బత్తిని సదానందం, వేల్పు ల సారంగపాణి, యేషబోయిన శ్రీనివాస్, జక్కురాజు గౌడ్, గుంటిరాజేందర్,బరిగలకుడి స్వామి పాల్గొన్నారు.

### కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి జీవితాన్ని ధారబోసిన బర్ధన్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : భారత కమ్యూనిస్టు పార్టీని దేశవ్యాప్తంగా బలోపేతం చేయడం కోసమే తన జీవితాన్నంతా ధారబోసిన మహోన్నతమైన గొప్ప వ్యక్తి ఎ.బి.బర్ధన్ అని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి కొనియాడారు. సిపిఐ జా తీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఎబి బర్ధన్ 9వ వర్ధంతిని పురస్కరించుకుని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బర్ధన్ చిత్రపటానికి వెంకటస్వామి పూలమాల వేసి నివాళుల ర్పించారు. వెంకటస్వామి మాట్లాడుతూ ఎబి బర్ధన్ విద్యార్థి దశ నుంచే కమ్యూనిజం వైపు ఆకర్షింపబడ్డారని, ఉన్నత విద్య అభ్యసించినప్పటికీ క మ్యూనిస్టు సిద్ధాంతాన్ని నమ్మి దేశవ్యాప్తంగా అనేక కార్మిక సం ఘాల



కరీంనగర్‌లో..

ఏర్పాటులో కీలక భూమిక పోషించారని, ఎన్నో కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించి దేశంలో కార్మికవర్గ పక్షపాతిగా పేరు ప్రఖ్యాతలు గడించారన్నా రు. ఆయన ఆశయాలను, లక్ష్యాలను నేటితరం కమ్యూనిస్టు శ్రేణులు ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ, కౌన్సి ల్ సభ్యులు కొయ్య డ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సమ్మయ్య, పైడిపల్లి రాజు, బూడిద సదాశివ, కంది రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో..

### బర్ధన్ ఆశయాలను కొనసాగిద్దాం

#### నెల్లికంటి సత్యం సిపిఐ జిల్లా కార్యదర్శి

ప్రజాపక్షం/నల్లగొండ: సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఎబి వర్ధన్ ఆశయాలకు ముందుకు తీసుకుపోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి అన్నారు. గురువారం ఎబి. బర్ధన్ 9వ వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా కా ర్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సత్యం మాట్లాడుతూ కార్మికవర్గం రైతాంగం అనేక ఉద్యమాలకు నాయక త్వం వహించి దేశ వ్యాప్తంగా పీడిత ప్రజల పక్షంగా నిలబడి ప్రజా ఉద్యమాలు నిర్వహించిన యోధుడని అన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్య దర్శి పల్లా దేవేందర్ రెడ్డి,ఎల్ శ్రావణ్ కుమార్,జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి, ఎఐఎస్ఎఫ్ నాయకుడు బి.వెంకటేష్, ఎఐటియుసి నాయకుడు వెంకన్న, లెనిన్, అంకులయ్య పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఉద్యమిద్దాం

### మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్, సిపిఐ జిల్లాకార్యదర్శి మర్రి వెంకటస్వామి, ఎఐటియుసి జిల్లా కార్యద ర్శి సమ్మయ్యలు హాజరై ప్రసంగించారు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణం మెతక వైఖరి వహిస్తుందని వెంటనే పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరుపేద కార్మికులకు పనిముట్లతో సహాయ సహకారాలు అందించి లోన్లు వెంటనే కల్పించాలని, భవన నిర్మాణ బోర్డులో యూనియన్ సభ్యులిద్దరినీ తీసుకోవాలని, అర్హులైన వారందరికీ డబు ల్ బెడ్‌రూం ఇండ్లు,పథకాలు అమలు చేయాలన్నారు. కరీంనగర్ జిల్లాలో భవన నిర్మాణ కార్మికుల గ్రామ, మ ండల, మహాసభలు నిర్వహించుకుని జిల్లా స్థాయి మహాసభ ను పెద్ద



ఎత్తున నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య, ఉపాధ్యక్షులు పిట్టల శ్రీనివాస్, కోశాధికారి ఎండి.రజాక్, కార్యవర్గ సభ్యులు బాలయ్య, కన్నం చంద్రయ్య, సదానందం, పూదరి ఓదయ్య,కమల్ పాషా, తదితరులున్నారు.

# మహానగరి

## అలరించిన నాట్య ప్రదర్శనలు



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : సంక్రాంతి సంబరాల్లో భాగంగా భద్రాద్రి సాంస్కృతిక వారధి ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దైవాజ్ఞశర్మ, భద్రాద్రి సాంస్కృతిక వారధి అధినేత కొండల్‌రావు, ప్రతినిధులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో తగ్గిన అవినీతి



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : రాష్ట్రంలోని ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వ పాలన బాగుందని, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తగ్గిందని జాతీయ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ఆళ్ల రామకృష్ణ కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిపై ఉక్కుపాదం మోపి, అవినీతి అధికారుల గుండెల్లో రైలు పరిగెత్తిస్తోందని గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా, కాంగ్రెస్ పాలనలో ప్రజారంజక పాలన కొనసాగుతుందని తెలిపారు. లక్షలాది మంది నిరుద్యోగుల ఆకాంక్షలను ప్రజాప్రభుత్వం నెరవేర్చిందని పేర్కొన్నారు.

## జీవిత కాలం పోరాటం చేసిన బర్దన్

అందోజు రవీంద్రాచారి



ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ : జీవిత కాలం పేదల పక్షాన పోరాటం చేసిన గొప్ప కమూనిస్టు యెధుడు ఎబి బర్దన్ అని సిపిఐ రాష్ట్ర సమితి కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రా చారి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల సిపిఐ కమిటీ అధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం కూంట్లూర్ భూ పోరాట కేంద్రం పేష్3లోని రావినారాయణరెడ్డి నగర్ కాలనీలో బర్దన్ వర్ధంతిని నిర్వహించారు. బర్దన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల యాదిరెడ్డి, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, ఎఐటియుసి మండల అధ్యక్షులు దాసరి ప్రసాద్, కేతరాజు నర్సింహ్మా, సైదులు, వినోద్‌నాయక్, యాదగిరి, కాటి అరుణ, దేవమ్మ, సుభద్ర, లక్ష్మి తదితరులు పాల్గొనారు.

## 'ప్రజాపక్షం' క్యాలెండర్ అవిష్కరణ



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: ప్రజాపక్షం జాతీయ తెలుగు దినపత్రిక 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శ్రీలీడ్ ఇండియా హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి నేనావత్ వంశీ నాయక్ ఆవిష్కరించారు. గురువారం హస్తినాపురంలోని పంచాయిత్ రాజ్ ఫేస్3 కాలనీలో భువన డెవలపర్స్ కార్యాలయంలో ఎల్‌బి నగర్ ప్రజాపక్షం పత్రిక రిపోర్టర్ మెగావత్ సీతారాం నాయక్‌తో కలిసి ఆయన క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, కేతావత్ మోహన్ నాయక్ తదితరులు ఉన్నారు.

## ఎంపి ఈటల రాజేందర్‌ను కలిసిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: మల్కాజ్‌గిరి ఎంపి, మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి గురువారం ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి డివిజన్‌లోని పలు కాలనీలలో సమస్యల పరిష్కారానికి, సిసి కెమెరాలు ఏర్పాటుకు కృషి చేయాలని ఎంపిని కోరారు. కార్యక్రమంలో వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శంకరయ్యగౌడ్, శరత్‌కుమార్, విష్ణు వర్ధన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చిగురింత సికిందర్‌రెడ్డి, మెందు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : వనస్థలి పురం డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ఎల్‌బి నగర్ జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ని వారి కార్యాలయంలో కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కాలనీల్లో ధ్వంసమైన రోడ్ల మరమత్తులకు, పార్కుల సుందరీకరణకు, సిసి రోడ్డు ఏర్పాటుకు, వీధి దీపాలకు, ఓపెన్ జిమ్‌ల కోసం నిధులు కేటాయించాలని కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి కమిషనర్‌ను కోరారు.

## అధికారులు బాధ్యతగా పనిచేయాలి

రాజేంద్రనగర్ మునిసిపల్ కమిషనర్ బి.శరత్‌చంద్ర




ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ : అధికారులు బాధ్యతగా పనిచేయాలని మునిసిపల్ కమిషనర్ బి.శరత్ చంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం హిమాయత్‌సాగర్‌లోని బిజెఎంసి ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో శరత్‌చంద్ర, మేనేజర్ మంజులత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యాదయ్యతో కలిసి మాట్లాడారు. సమావేశం ప్రారంభానికి ముందు మాజీ ప్రధాని డాక్టర్.మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆఫీసర్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు పాతదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారిణికి ఉపేందర్‌రెడ్డి చేయూత

ప్రజాపక్షం/సరూర్ నగర్: పేద విద్యార్థులకు, క్రీడాకారులకు చేయూతను అందించడానికి ముందు ఉంటానని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్‌కెపురం డివిజన్ పరిధిలోని ఎన్‌టిఆర్‌నగర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన యువ క్రికెట్ క్రీడాకారిణి చందన అండర్ 23 ఎంపిక అయ్యింది. ఆధునిక క్రికెట్ కిట్టు కొనుగోలుకు రూ.25ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో లింగ స్వామిగౌడ్, జగిని రమేష్, శ్యామ్, విప్లవ్, శ్రీకాంత్, కిషన్, సంతోష్ పాల్గొన్నారు.



## 'ఈదులకుంట'ను వెలికితీసిన 'హైడ్రా'



ప్రజాపక్షం/హైదరాబాద్ : శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో ఉన్న ఈదులకుంట చెరువు ఆనవాళ్లను హైడ్రా వెలికితీసింది. సర్వేఆఫ్ ఇండియా సహకారంతో గురువారం సర్వే చేయించి, హద్దుల నిర్ధారించే పనికి హైడ్రా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఖానామెట్ కూకట్‌పల్లి గ్రామాల సరిహద్దులో ఉన్న ఈ చెరువు మాయమైందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా చర్యలు చేపట్టింది. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌కు చెందిన హై రిజల్యూషన్ మ్యాప్‌ల ఆధారంగా చెరువు ఆనవాళ్లను హైడ్రా ఇదివరకే గుర్తించింది. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ నెల క్రితం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. చెరువు ఆక్రమణలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు చెందిన వారు ఆ స్థలం తమదంటున్న వారితో పాటు ఫిర్యాదు చేసిన స్థానికులను హైడ్రా కార్యాలయానికి హైడ్రా ఉన్నతాధికారులు పిలిపించి విచారించారు. సైబర్‌సిటీ (హైటెక్ సిటీ) వద్ద వంతెన నిర్మాణంతో గతంలో తుమ్మిడికుంట ఈదులకుంట మధ్య ఉన్న వరద కాలువ పూడుకపోయిందని, ఆ చెరువులోకి నీరు రాకపోవడంతో మట్టితో నింపి కబ్జాకు పాల్పడ్డారంటూ విచారణలో ఫిర్యాదుదారులు ఆధారాలతో రుజువు చేశారు. ఖానామెట్ కూకట్ పల్లి గ్రామాల సరిహద్దుల్లో ఉండడంతో సులభంగా చెరువును ఆక్రమించారంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సర్వే ఆఫ్ ఇండియాను హైడ్రా రంగంలోకి దించింది. సర్వే ఆఫ్ ఇండియా టోపో మ్యాప్ ప్రకారం పూర్తి స్థాయిలో గురువారం సర్వే చేయించారు. ఖానామెట్ కూకట్‌పల్లి గ్రామాల మ్యాప్‌ల ఆధారంగా అక్కడ ఈదులకుంట చెరువు ఉందని సర్వే ఆఫ్ ఇండియా నిర్ధారించింది. అలాగే ఎఫ్‌టిఎల్, నీటి విస్తరణ ప్రాంతాలను కూడా గుర్తించింది. సర్వేలో హైడ్రా, ఇరిగేషన్, రెవెన్యూ, జిహెచ్ ఎంసి, హెచ్‌ఎండిఎ అధికారులు ఉన్నారు.

## నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్ : నూతన సంవత్సరం సందర్భంగా జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో గురువారం కమిషనర్ ఇలంబర్తిని జోనల్ కమిషనర్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, కార్పొరేటర్లు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించడానికి కొత్త సంవత్సరంలో మరింత సంకల్పంతో పని చేయాలన్నారు. కార్పొరేటర్లు ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని కమిషనర్ కోరారు.



## సమస్యల పరిష్కారానికి కృషి

మాజీ ఎమ్మెల్యే కెఎల్ఆర్




ప్రజాపక్షం/సరూర్‌నగర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సరూర్ నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్ లోని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు, యువజన నాయకులు స్వరూప్ రాజ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ కాలనీ, జింకలాభావి కాలనీ, వికాస్ నగర్, క్రాంతి నగర్, సాయి కృష్ణ నగర్, నరసింహపురి కాలనీలో పారిశుద్ధ కార్మికులకు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనిత దయాకర్ రెడ్డి, మహేందర్ యాదవ్, బోయిన శంకర్ యాదవ్, గోవర్ధన్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్, కాలనీవాసులు దయాకర్, ఆంజనేయులు, నరేష్, సూర్యనారాయణ, ఆచార్యులు, కృష్ణమూర్తి, డాక్టర్స్ కాలనీ మహిళా మండలి అధ్యక్షులు మమతా, ప్రధాన కార్యదర్శి సరితా, నిత్య, సంధ్య, వాణి, రమ, రాధికా, రేణుక, శ్రీలక్ష్మి, సౌమ్య, ప్రశాంతి, ధనరాజ్, యంఐ గల్పాని, చిక్కుల శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ఆలోచనలు, సరికొత్త ఆశయాలతో ముందుకు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: కొత్త ఆలోచనలు, సరికొత్త ఆశయాలతో కొత్త సంవత్సరంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో రెట్టింపు ఉత్సహంతో పనిచేసి జిల్లాను మరింత ప్రగతి పథంలోకి తీసుకువెళ్లాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నూతన సంవత్సరం సందర్భంగా మాట్లాడుతూ ప్రతి శాఖ తన పనితీరును మెరుగుపరుస్తూ కార్యాచరణ సిద్ధం చేసుకోని ముందుకెళ్ళాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందెలా పని చేయడం మనందరి బాధ్యత అన్నారు. ఏదైన సమస్య ఉంటే తన దృష్టి తీసుకు వచ్చి పరిష్కరించుకోవచ్చని అధికారులకు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్, మండల పంచాయతీ అధికారుల అసోసియేషన్ సహకారంతో సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు 200 బ్లాంకెట్స్, 100 నోట్ బుక్స్‌ను కలెక్టర్‌కు అందజేశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో

రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. జిల్లా అభివృద్ధి కోసం అధికారులంతా కలిసి పని చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి, అసోసియేట్ అధ్యక్షులు పి సి వెంకటేష్, ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్, అలివేలు మంగ, సంయుక్త కార్యదర్శులు లక్ష్మణ స్వామి, సుజాత, సైదమ్మ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.





## రైతుల సంక్షేమమే లక్ష్యం




ప్రజాపక్షం/తుర్కయంజాల్: రైతు సంక్షేమ కేంద్ర ప్రభుత్వ లక్ష్యం అని బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసు పల్లి ప్రతాప్ అన్నారు. గురువారం తుర్కయంజాల్ భారతీయ జనతా పార్టీ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ మునిసిపాలిటిలో గత రెండు నెలలుగా సంస్థాగతపరంగా పార్టీ సభ్యతము, బూత్ కమిటీల ఎంపిక పూర్తయిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమం దిశగా అడుగులు వేస్తుందని, అందులో భాగంగా పీఎం కిసాన్ యోజన పథకం సంవత్సరానికి రూ. 6000 నుంచి, రూ. 10000 రూపాయలకు పెంచడం హర్షనీయమని పేర్కొన్నారు. సేంద్రియ ఎరువుల మీద సబ్సిడీని ప్రకటించినందుకు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బచ్చిగల్ల రమేష్, భిక్షపతి, యూసుఫ్ రెడ్డి, రాంరెడ్డి, కొంతం బాల్ రెడ్డి, బలదేవరెడ్డి, నరసింహా గౌడ్, ఎలిమినేటి నరసింహారెడ్డి, కొత్త రాంరెడ్డి, ఆదిభట్ల మున్సిపల్ జనరల్ సెక్రెటరీ గజ్జల నరసింహా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## గైర్హాజరైతే...రూ.500 ఫైన్

గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన




ప్రజాపక్షం/కొందుర్గు: ప్రభుత్వ పాఠశాల, గురుకుల పాఠశాల విద్యార్థులు అనివార్య కారణాలతో పాఠశాలకు రాకపోతే... 500 రూపాయల ఫైన్ కట్టాల్సిందే... దీనిపై విద్యార్థుల తల్లి దండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం మేరకు... కొందుర్గు మండల కేంద్రంలోని టిజిఎస్ డబ్ల్యుఆర్ పాఠశాల, జూనియర్ కళాశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు 16 సెక్షన్లల్లో 593 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత నెల డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగ సెలవుల దృష్ట్యా తమ ఇళ్లకు వెళ్లారు. చాలా మంది విద్యార్థులు పండుగ తరువాత పాఠశాలకు రాలేదు. కాగా ఆలస్యంగా వస్తున్న విద్యార్థులతో లెటర్ రాయించుకుంటూ, ఫైన్‌గా 500 రూపాయలు తీసుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పాత్రికేయులు పాఠశాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. మా పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే ఆర్థిక స్థోమత లేకనే ప్రభుత్వ పాఠశాలల్లో చదివిసున్నామని, తీరా ఇక్కడ కూడా డబ్బులు వసూలు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయం గురించి పాత్రికేయులు ప్రిన్సిపల్ ఖుర్షిద్‌ను వివరణ కోరగా పండుగకు వెళ్లిన విద్యార్థులు పాఠశాలకు తిరిగి రావడంలో ఆలస్యం అవుతుందని, ఇలాంటి సమయాల్లో ఉన్నతాధికారులు పాఠశాల తనిఖీలకు వస్తే, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటుందని, అందువల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు భయం ఉండాలని, కొద్ది మంది విద్యార్థుల వద్దే డబ్బులు తీసుకున్నామని, మొదటి సారి ఇలా జరిగిందని, డబ్బులు తీసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులకు తిరిగి డబ్బులు పంపుతున్నామని, మరోసారి పొరపాటు జరగదన్నారు.

## ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసిన నేతలు

ప్రజాపక్షం/నార్సింగి: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, స్టేట్ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లను వారి నివాసాల్లో గురువారం నార్సింగి మున్సిపల్ చైర్మన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్ నరేందర్‌రెడ్డి, పత్తి శ్రీకాంత్, పత్తి ప్రవీణ్ కూతాడి నరేష్ కలిశారు.

**కౌన్సిలర్ రామకృష్ణరెడ్డికి శుభాకాంక్షలు** ...మణికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుదోళ్ల శ్రీరాములు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ బాలిరెడ్డిరెడ్డి, ఎరుపుల కుమార్, నాయకులు లక్ష్మయ్య, గంగాధర్, శివగంగా, స్పందన మల్లేష్ విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.



## ప్రభుత్వ విద్య బలోపేతం మొదటి ప్రాధాన్యం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/షాద్‌నగర్: విద్యాభివృద్ధికి ఎన్ని నిధులు ఖర్చు చేసినా తక్కువేనని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ విద్య బలోపేతానికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి సంజీవిని ప్రొడక్ట్ యజమాని, రియల్టర్ పత్తిపాటి శ్రీధర్ రెండు లక్షల చెక్కును విరాళంగా ఎమ్మెల్యే శంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు ఉన్నారు. అనంతరం పట్టణంలోని శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లష్కర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రెటికల్ నందీశ్వర్, దాస కృష్ణయ్య, అంగనూరి బస్వం, అందె మోహన్‌స్వామి, ఆకుల వీరేష్, కోటిలింగం స్వాములు పాల్గొన్నారు.

### అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ళు

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించి నిజమైన లబ్దిదారులకు గుర్తించడంతోపాటు వారి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



### క్రీడలతో మానసిక ఉల్లాసం

కొందుర్గు: క్రీడలతో మానసిక ఉల్లాసం వస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆగిర్యాలలో ఆగిర్యాల ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో టోర్నమెంట్ల నిర్వాహణ వల్ల ప్రతిభ కలిగిన విద్యార్థులు వెలుగులోకి వస్తారని, నిర్వాహకులను అభినందించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన చాకలి బుగ్గమ్మ అనారోగ్యంతో మృతి చెందగా మృతురాలి కుమారుడు మహేశ్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమాల్లో కృష్ణారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ చిట్టెం దామోదర్‌రెడ్డి, నాయకులు బి నరేందర్, పురుషోత్తంరెడ్డి, కె రాములు గౌడ్, జిబి కృష్ణ, రాయికంటి రామస్వామి, చేవెళ్ల కృష్ణయ్య, కె మహేందర్, టి గోపాల్, శ్రీనివాస్ రెడ్డి, బి నర్సింలు, ప్రసాద్, చంద్రశేఖర్, మల్లయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



### అన్నిరంగాల్లో రాణించేందుకు యువత కృషి

ఫరూఖ్‌నగర్: యువత ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 20వ వార్డు పటేల్ రోడ్డుకు చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు నీరటి వాసు జన్మదినం సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో చెన్నయ్య, బస్వం, దంగు శ్రీనివాస్ యాదవ్, మంగ మధు, నల్లమోని శ్రీధర్, నక్క బాలరాజ్, జాంగారి రవి, రాజమోని నర్సింగ్, రాజమోని జగదీష్, శేఖర్ పాల్గొన్నారు.



### ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వివిధ శాఖల అధికారులు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ డిఎంహెచ్ డాక్టర్ విజయలక్ష్మీ, హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు, ఫరూఖ్‌నగర్ మండల తహసీల్దార్ పార్థసారథి ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## క్రిస్మస్ కిట్లు అందజేసిన కౌన్సిలర్



**ప్రజాపక్షం/దుండిగల్:**దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బహదూర్ పల్లి 13వ వార్డ్ వినాయక్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్ ఎల్లుగారి సత్యనారాయణ హాజరై బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, ఎస్.కే సద్దాం, నరేష్ యాదవ్, రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

## బిఎంఆర్‌కు శుభాకాంక్షలు డిసిసిబి అధ్యక్షులు

**ప్రజాపక్షం/తాండూరు:**తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ రవీందర్‌రావు, వైస్ చైర్మన్ కొత్తకుర్వ సత్తయ్యలతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి అధ్యక్షులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి నివాసంలో ఎంఎల్‌ఎకును వారు మర్యాద పూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



## ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/దౌల్తాబాద్:**కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన మండల పార్టీ అధ్యక్షులు వెంకట్రావు ,సీనియర్ నాయకులు బోడ వెంకట్‌రెడ్డి జంగంవీరన్న , కృష్ణ మండల్ యూత్ అధ్యక్షులు వలిగరి మహిపాల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివసంలో నూతన అంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



## మన్నేకు మంత్రులు నివాళులు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మన్నే సుబ్రమణ్యం మరణం తీరని లోటని మంత్రులు సీతక్క, రామానాయుడులు అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, కీర్తిశేషులు మన్నే సుబ్రమణ్యం కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క, ఆంధ్రప్రదేశ్ భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులు పరామర్శించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడిపి మాజీ ఉపాధ్యక్షులు టిజికె మూర్తి, కొత్తపల్లి రాంబాబు, రాములుయాదవ్, నీరుగొండ సతీష్‌బాబు, సాంబశివరావు, బోస్, సాయినాగార్జున, శివానంద్, తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**ప్రజాపక్షం/అల్వాల్ :** అల్వాల్ డివిజన్ శ్రీనివాస్ నగర్‌లో జరుగుతున్న అంతర్గత రోడ్లు నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. అదేవిధంగా గీత స్కూల్ పక్కనగల 665 గజాల పార్క్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా అధికారులతో మాట్లాడి కబ్జాలకు గురికాకుండా చూస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు డిఈ ప్రశాంతి, ఎఇ అభిషేక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, కాలనీవాసులు హరినాథ్‌రావు, సునీల్, రఘురాం రెడ్డి, సతీష్, నాయకులు ప్రేమ్ కుమార్‌లు పాల్గొన్నారు.




## మేరు కులవృత్తిని కాపాడాలి

**ప్రజాపక్షం/అల్వాల్ :** మేరు సంఘం తెలంగాణ జోన్–11 ఆల్వాల్ నూతన సంవత్సర క్యాలెండర్ మేరు సంఘం ఆధ్వర్యంలో అల్వాల్ లోతుకుంట కార్యాలయంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వ స్కూల్ యూనిఫామ్‌లు ప్రభుత్వ కళాశాల యూనిఫామ్‌లు, ప్రభుత్వ వైద్య కళాశాలలో దుస్తులు కుట్టడానికి మా కులవృత్తి కుట్టుపని టైలర్‌కి సంబంధించినటువంటి ఏ పని అయినా మాకు ఇవ్వాలని, అదేవిధంగా వృత్తిపరంగా ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి కాబట్టి ఆరోగ్య భీమా కల్పిస్తూ 55సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని, టైలర్ షాపులకు ఉచితంగా విద్యుత్, కొత్త షాపులు పెట్టుకోవడానికి మూడు లక్షల నుండి 5లక్షల వరకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి మా కుల వృత్తిని కాపాడుకోవాలని మేరు కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దీకొండ వెంకటేష్, ఉపాధ్యక్షులు మాడిశెట్టి బాలయ్య, రామగిరి గోపాల్, మంతాపురం, సత్యనారాయణ, వెన్ను భూపాల్, కార్యదర్శులు కీర్తి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికులకు దుప్పట్లు అందజేత

**ప్రజాపక్షం/నాగారం:** మున్సిపల్ సిబ్బంది సేవలు చాలా ఓపికతో కూడుకున్నవని, నిరంతరాయంగా జరగవలసినవేనని కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఈస్ట్ గాంధీనగర్ కాలనీలో మున్సిపల్ సిబ్బందికి క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా కల్వరీ గ్రేస్ చర్చ్ నిర్వహకులు గాబ్రియేల్, 15వ వార్డు కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డిలు దుప్పట్లు, రగ్గులు, స్వీట్లు పంచి పెట్టారు. వారి కష్టాన్ని గుర్తించి మున్సిపల్ సిబ్బందిని సత్కరించడం అభినందనీయ ని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు శ్రావణ్‌కుమార్, కెవి రమణ తదితరులు పాల్గొన్నారు.

## చెత్తను ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్చొద్దు

### మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశం




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** కాలుష్యం పెరుగుదలకు కారణమయ్యే విధంగా చెత్తను ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్చరాదని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం సూచించారు. గురువారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఇళ్లల్లో వచ్చే చెత్తను కాల్చటం వల్ల వాయు కాలుష్యం పెరగటమే కాయ విషపూరిత వాయువులు విడుదలవుతాయని, కాలుస్తున్నప్పుడు వచ్చే పొగ వల్ల శ్వాస సంబంధిత సమ్యలు, హృద్రోగాలు, ఆస్తమాతో పాటు క్యాన్సర్ వచ్చే అవకాశాలుంటాయని, అదే విధంగా చెత్తతో పాటు ఉండే ప్లాస్టిక్ కాలుతుండటంతో క్యాన్సర్ కారకాలైన విషపూరిత రసాయనాలు విడుదలవుతాయని, మరో పక్క భూగోళ ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగిపోతుంటాయన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యాభ్యాసం

### ఎమ్మెల్యే కాలే యాదయ్య



**ప్రజాపక్షం/నవాబుపేట్ :**నవాబ్‌పేట్ మండలం పులుమామిడి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ గదులను చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య ప్రారంభించారు. మొదటగా జ్యోతి ప్రజ్వలన చేసి, డిజిటల్ గదులను, ప్రొజెక్టర్ గదులను ప్రారంభించి, విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు బెల్ట్, టై లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. తెలంగాణ ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విద్యారంగ రక్షణకు శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్లె కాలే యాదయ్య, నోట్ బుక్స్ టై పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, పిఎసిఎస్ చైర్మన్ పోలీస్ రామ్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాథోడ్ గీత సింగ్, ఎంఈఓ అబ్దుల్ రెహమాన్, ప్రతినోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు పౌష్టికాహారం

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లాలోని హాస్టల్ విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హస్టల్స్ లో ప్రతి రోజు నూతన మెనూ ప్రకారం వంట చేయడం కోసం అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించబడతాయని, వంట సామాగ్రి ఏర్పాటు, వంటకు ఉపయోగించే సరుకులు కూరగాయాలు అన్నింటిలో నాణ్యత పాటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. శాఖల వారీగా రేట్ చాట్ ప్రకారం కొత్త మెనూ పాటించాలని అధికారులకు అదేశించారు. హస్టల్‌లో మైనర్ రిపేర్‌లు పూర్తి చేయాలని అదేశించారు. అలాగే జిల్లాలో కుక్కల బెడద నివారించడానికి జిల్లాలోని 4 మున్సిపలిటీల్లో పశువైద్యులచే కుక్కల జనన నియంత్రణ ఆపరేషన్ చేశామని అన్నారు. ఇప్పటి వరకు 700ల వీధి కుక్కలకు ఆపరేషన్ చేయడం జరిగింది అన్నారు. వీది కుక్కలను ఆంధ్రా ప్రాంతానికి చెందిన అనుభవజ్ఞులైన వ్యక్తులను నియమించామని పట్టిన కుక్కలను పెట్టానికి 4 సెంటర్లును ఏర్పాటుచేసి ఒక్కో దానిలో 50కుక్కలను పెట్టడంకోసం ప్రత్యేక బోనులు తయారుచేయించి అందులో కుక్కలను విడివిడిగా ఉంచి ఆపరేషన్ అనంతరం పట్టుకున్న స్థలంలో వదిలి పెట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్ .ట్రైనిం గ్ కలెక్టర్ ఉమాహారతి, డిఆర్‌డిఓ శ్రీనివాస్ ఎస్సి అభివృద్ధి అధికారి మల్లేశం, బిసి సంక్షేమ శాఖ ఉపేందర్, గిరిజన సంక్షేమ అధికారి కమలాకర్‌రెడ్డి, అధికారి హనుమంతురావు, తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన రెవెన్యూ ఉద్యోగులు**



వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు, ట్రైనింగ్ కలెక్టర్ ఉమహారతిని కలిసి నూతన సంవత్సరా శుభాకాంక్షలు తెలిపిన వికారాబాద్ ఆర్‌డిఓ వాసుచంద్ర, ట్రెసా వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయేందర్. దీపక్, ఫర్వీన్ ఖాతున్, లక్ష్మీ నారయణ, వెంకటేష్ , ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## వైద్యానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:**పేదరికంతో వైద్యం జరిపించుకోవటంలో ఇబ్బందులు పడుతున్న ఓ రోగి చికిత్స నిమిత్తం 'మానవ సేవే మాధవ సేవ సంస్థ' సేవా దృక్పథంతో రూ.10 వేలు ఆర్థిక సాయం అందించింది. మల్కాజిగిరిలోని ఇందిరా బాధితురాలి తల్లి నెహ్రూ నగర్ ప్రాంతంలో ఇళ్లల్లో పాచి పనులు చేసుకొంటూ తన ఐదుగురి సంతానాన్ని పోషించుకొంటోంది. గత కొద్దికాలంగా తన తొమ్మిదేళ్ల కుమార్తె దీపాలి అనారోగ్యంతో బాధ పడుతుంటే ఆస్పత్రికి తీసుకొని వెళ్లగా కాలేయ సమస్య ఉందని వైద్యులు తెలిపారు. సంస్థ ప్రతినిధులు కుమ్మరి రాజు, మహ్మద్ రషీద్, సత్యనారాయణ, సతీష్‌కుమార్, రవికుమార్, తదితరులు గురువారం బాలిక చికిత్స నిమిత్తం ఆర్థికసాయాన్ని అందించారు.

## మెట్రోరైలు కారిడార్ పెంపుపై సిఎంకు రుణపడి ఉంటాం

### ఎంఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహ్మాయాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మెట్రో కారిడార్‌లను జెబిఎస్ నుంచి శామీర్ పేటకు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. గురువారం తూంకుంట మున్సిపాలిటీ లో సిఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యారడైజ్ నుంచి మేడ్చల్‌కు, జెబిఎస్ నుంచి శామీర్‌పేటకు మెట్రో రైలు కారిడార్‌ల నిర్మాణం చేపట్టడానికి సిఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారని, ఈ ప్రాంత అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి పాటుపతున్నారని, మేడ్చల్‌ను మరింత అభివృద్ధి పరుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ బిక్షపతి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్‌డిఓకు సర్వశిక్షణ ఉద్యోగులు వినతి

### 28రోజులుగా ధర్నా



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలోని ఉన్న సర్వశిక్షణ ఉద్యోగులు ,ఏపీఓలు ,సిస్టమ్ అనలిస్టులు ,టెక్నికల్ పర్సన్, అపరేటర్స్, డీఎల్ఎంటీ, మెసెంజర్స్,మండల స్థాయిలో ఎంఐఎస్ కోఆర్డినేటర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఐఈఆర్‌పీఎస్, మెసేంజర్స్, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్ల రీసార్స్ పర్సన్, కేజీబీవి,అర్బన్ రెసిడేన్సియల్, స్కూల్స్‌లో స్పెషల్ ఆఫీసీర్లు ,కంట్రాక్ట్ రిసోర్స్ టీచర్స్ పీఈటిలు, ఏఎన్ఎంలు ,అకౌంటెట్స్, క్రాఫ్ట్ అండ్ కంప్యూటార్ ఇన్‌స్ట్రక్టర్స్, కుక్స్, వాచ్‌ఉమేన్స్ స్వీపర్లు,స్కావెంర్లు, పాఠశాలస్థాయిలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్, భవిత కేంద్రాల్లో ఇంటక్లూజివ్, ఎడ్యుకేషన్ రిసార్స్ టీచర్లుగా పనిచేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమనంగా పని చేస్తున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రాంలోని ఆర్‌డిఓ కార్యాలయం ముందు గత 28 రోజులుగా దర్నా కార్యాక్రమం నిర్వహిస్తున్నారు.తమ సమస్యలను పరిష్కారించాలని వికారాబాద్ ఆర్‌డిఓకు వినితిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ఏళ్ల తరబడి సేవలందిస్తున్న తాము శ్రమదోపిడికి గురవుతున్నామని చాలి చలని జీతలతో పని చేస్తున్నామని ,ఉద్యోగులు అవేదన వ్యాక్తం చేశారు. కనీస వేతనం కూడా అమలు చేయడం లేదని ,అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంటేనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వేంటనే రెగ్యులరైజ్ చేస్తామని అన్నారు , రెగ్యులరైజ్ చేయాలని సమ్మెబాట పట్టారు. కాంట్రక్ట్ పద్దతిలో నియమకమైనప్పటికీ మెరిట్ రోస్టర్ ,రుల్ ఆఫ్ రిజర్వేషన్ విధానంలోకి నియమితులయ్యామని ఉద్యోగులు పేర్కోంటున్నారు. రెగ్యులర్ ఉద్యోగుల వేతనాల్లో నాలుగోవంతు జీతం మాత్ర మే ఇస్తున్నారు. సర్వశిక్షణ చని పోతే పట్టించుకునే వారు లేరనిఅన్నారు. 10లక్షల అరోగ్యభిమా కల్పించలని అన్నా రు. మహిళ ఉద్యోగుల వేతనంతో కుడిన 180 ప్రసూతి సెలవులు ,మరణించిన ఉద్యోగలకు 20లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలని 28రోజులుగా సమ్మె చేస్తున్నా రు. టిఏడిఎలు ఇవ్వలని డిమాండ్ చేశారు , సమస్యలు పరిష్కరించే వారకు సమ్మె కోనసాగుతుంది అని తెలిపారు.సమ్మెచేస్తున్న ఉద్యోగులు ముఖ్యమంత్రి,మంత్రులకు సంబందించిన మస్కులతో వికారాబాద్ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.ఉద్యోగులు ఇచ్చిన వినతిపత్రంపై , ఈ సందర్భంగా ఆర్‌డిఓ వాసుచంద్ర మాట్లాడుతూ మీ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువేళ్తానాని అన్నారు.



## పద్మశాలీల అభ్యున్నతికి కృషి

### కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** మూడు పర్యాయాలు నా గెలుపులో కీలకంగా వ్యవహరించి హ్యాట్రిక్ గెలుపును అందించిన పద్మశాలి కులస్తులకు రుణపడి ఉంటానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్ 2 రింగ్ రోడ్డు వద్ద చింతల్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్ ను గురువారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పద్మశాలి సంఘం అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయన్నారు. అనంతరం చింతల్ పద్మశాలి సంఘం అధ్యక్షులు పాలడుగు సత్యనారాయణ జన్మదినం సందర్భంగా ఆయన చేత కేక్ ను కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్, మేడ్చల్ ఫిషరీస్ కో అపరేటీవ్ చైర్మన్ మన్నెరాజు, మాజీ కౌన్సిలర్ సూర్యప్రభ, డివిజన్ అధ్యక్షులు దేవర కొండ శ్రీనివాస్, పుప్పాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్, అధ్యక్షులు పాలడుగు సత్యనారాయణ, ముఖ్య సలహదారులు, ఉపాధ్యక్షులు భూ లక్ష్మ ణ్, బొంట్యాల రాజు, గోలి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సిలివేరి ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ సిలివేరి సత్యనారాయణ, కోశాధికారి నక్క గణేష్, కార్యవర్గ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** పనికి వెళ్లి వస్తానని ఇంటినుండి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఉదంతమిది. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుధానగర్ ప్రాంతంలో నివసించే బహదూర్ కుమార్తె జానకి (20) సమీపంలోని ఓ కర్రీ పాయింట్‌లో పనిచేస్తోంది. ఎప్పటి లాగే బుధవారం మధ్యాహ్నం ఇంటినుండి పనికి వెళతానని చెప్పి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు, ఎంత వెతికినా ఆమె జాడ కనపడక పోవటంతో తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నా రు.

## లారీని ఢీ కొట్టిన బైక్... వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/పరిగి రూరల్:** లారీ ఢికోని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో గురువారం జరిగింది. పరిగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్నాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా గంగానగర్ చెందిన శాంతుకుమార్ హైదరాబాద్ నుండి బైక్ (టిఎస్27హచ్ వై9951)పై పరిగి మీదుగా వెళ్తున్న సమయంలో పరిగి పట్టణ పరిధి ఎబిఎస్ ప్లాజా వద్ద ఎదురుగా వస్తున్న లారీ డీ కోట్టాడు. ఘటనలో శాంతుకుమార్ అక్కడిక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి నర్సప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## ఎంఎల్‌ఎకు శుభాకాంక్షలు తెలిపిన అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :**వికారాబాద్ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి మహేశ్వరం ఎమ్మెల్యే మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిని కౌన్సిలర్ అనంత్‌రెడ్డితో కలిసి అంగ్లనూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వికారాబాద్ పట్టాణ రాజకీయలపై మాట్లడటం జరిగింది అని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

## కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా

### మాజీ ఎంపిటిసి సరసం అశోక్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మజీద్‌పూర్‌లోని ప్రజయ్‌హోమ్స్ కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మాజి ఎంపిటిసి సరసం అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లోని ప్రజయ్‌హోమ్స్‌లో తన సొంత నిధులతో రూ. 2.50 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులను ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజయ్‌హోమ్స్‌లో సుమారు 100 కుటుంబాలకు అండర్ గ్రౌండ్ డ్రైనేజి సరిగా లేకపోవడంతో దోమలు భారిన పడి అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. తనకు వచ్చిన విన్నపంలో బాగంగా కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను ప్రారంబించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

## రైతుల పక్షపాతి ప్రధాని మోదీ

**ప్రజాపక్షం/అల్వాల్ :** పిఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు అందిస్తున్న పెట్టుబడి సహాయం పెంచడం హర్షణీయమని దేశవ్యాప్తంగా రెండు కోట్ల ఇండ్ల నిర్మాణం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ నూతన సం. కానుక ఇచ్చారని తెలుపుతూ అల్వాల్ పట్టణ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మీ సేవ సెంటర్‌లో ప్రధానమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ మల్లికార్జున్ గౌడ్, మూడు డివిజన్ల అధ్యక్షులు అజయ్ రెడ్డి, కార్తీక్ గౌడ్,రవి కిరణ్, సీనియర్ నాయకుడు శేఖర్, సంతోష్ గౌడ్, మాచర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



క్రీడ

# రోహిత్‌కు విశ్రాంతి... బుమ్రాకు కెప్టెన్సీ?



**సిడ్నీ టెస్టులో ఆసక్తికరంగా మారిన భారత తుది జట్టు కూర్పు**

బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాతో చివరి టెస్టు భారత జట్టుకు అత్యంత కీలకం. సిరీస్‌ను కోల్పోకుండా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో తప్పకుండా గెలవాల్సిందే. అయితే, కీలకమైన ఈ పోరుకు ముందు భారత జట్టు కూర్పు అత్యంత క్లిష్టంగా మారింది. ఏకంగా సారథి రోహిత్ శర్మకు విశ్రాంతి ఇస్తారనే కథనాలు వస్తున్నాయి. పేలవ ఫామ్‌తో సిరీస్‌లో నాణ్యమైన ఆటతీరు ప్రదర్శించని విషయం తెలిసిందే. దీంతో అతడిని విశ్రాంతి పేరుతో పక్కన పెడతారని తెలుస్తోంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కూడా రోహిత్ విషయంలో కఠినంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రోహిత్ గైర్హాజరీలో మరోసారి భారత జట్టును జస్‌ప్రీత్ బుమ్రానే నడిపించనున్నాడు. ఇప్పుడు జట్టుకు అతడే వైస్ కెప్టెన్. అంతేకాకుండా, పెర్త్ టెస్టులో బుమ్రా నాయకత్వంలోనే టీమ్‌ఇండియా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. రోహిత్‌కు విశ్రాంతి ఇచ్చి గత మ్యాచ్‌లో ఆడని శుభ్‌మన్ గిల్‌కు ఛాన్స్ ఇవ్వడం ఖాయంగానే కనిపిస్తోందని కథనాలు వస్తున్నాయి. అప్పుడు యశస్వి జైస్వాల్‌తో కలిసి కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తాడు. మెల్‌బోర్న్ మ్యాచ్‌లో రోహిత్ ఓపెనర్‌గా రావడంతో కేఎల్ వన్‌డౌన్‌కు మారాడు. ఈ సిరీస్‌లో ఓపెనర్‌గా విజయవంతమైన కేఎల్.. వన్‌డౌన్‌లో మాత్రం విఫలమయ్యాడు. ఇప్పుడు మళ్లీ తనకిష్టమైన ప్లేస్‌కు రావొచ్చు. అలాగే ఈ సిరీస్‌లో తన స్థాయి ప్రదర్శన ఇవ్వడంలో విఫలమైన రిషభ్ పంత్‌నూ పక్కన పెట్టేయనున్నట్లు తెలుస్తోంది. అతడికి బదులు ధ్రువ్ జురెల్‌ను తీసుకొనేందుకు మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు సమాచారం. పెద్దగా ప్రభావం చూపని ఆకాశ్ దీప్ స్థానంలోనూ యువ పేసర్ ప్రసిధ్ కృష్ణకు ఛాన్స్ దక్కనుంది. ఆకాశ్ దీప్ గాయం కారణంగా వైదొలిగినట్లు ఇప్పటికే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వెల్లడించాడు.

**ఇది గెలిస్తే రేసులో ఉంటాం..**

ఆసీస్ గడ్డపై బోర్డర్ గావస్కర్ ట్రోఫీని హ్యాట్రిక్ కొట్టాలనే లక్ష్యంతో భారత్ అడుగు పెట్టింది. తొలి మ్యాచ్‌లోనే గెలిచి పర్యటనను ఘనంగా ప్రారంభించింది. ఇక గులాబీ టెస్టులో ఘోర ఓటమితో ఇబ్బంది పడింది. ఆ తర్వాత గబ్బా టెస్టులో భారత పోరాటానికి వరుణుడు కలిసొచ్చాడు. డ్రాతో సరిపెట్టుకోగలిగాం. కానీ బాక్సింగ్ డే టెస్టులో మాత్రం ఒకరిద్దరు మినహా.. మిగతా బ్యాటర్లు చేతులెత్తేయడంతో పరాభవం ఎదురైంది. దీంతో 2-1 ఆధిక్యంలోకి ఆసీస్ కొనసాగుతోంది. ఇప్పుడు సిడ్నీలో విజయం సాధించకపోతే సిరీస్ ఓటమితో పాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆశలు కూడా గల్లంతు కావడం ఖాయం.

# గంభీర్‌కు గండం



కొన్నేళ్లుగా భారత క్రికెట్‌కు మూలస్తంభాలుగా ఉన్న రోహిత్ శర్మ, కోహ్లీ త్వరలో రిటైర్మెంట్ ప్రకటిస్తారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. భారత జట్టు సంధి దశలో ఉన్న కీలక సమయంలో కోచ్ గౌతమ్ గంభీర్, సహాయ సిబ్బంది భవిష్యత్ సవాళ్లకు తగినట్టుగా టీమిండియాను ఎలా నడిపిస్తారనేది ప్రస్తుతం హాట్ టాపిక్‌గామారింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో సమతుల్యమైన జట్టును ఎంపిక చేయడం సంక్లిష్టంగా మారింది. సిరీస్ చేజారకుండా ఉండాలంటే సిడ్నీలో జరిగే ఐదో టెస్ట్‌లో భారత్ నెగ్గి తీరాల్సిందే. కాగా, వరుస వైఫల్యాల నేపథ్యంలో టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో అనిశ్చితి నెలకొందనే టాక్ రోజురోజుకూ పెరుగుతోంది. జట్టులోకి ఎక్కువ మంది ప్లేయర్లతో గంభీర్‌కు శ్రుతి కుదరడం లేదనే ప్రచారం సాగుతోంది. రవిశాస్త్రి, ద్రవిడ్ తరహాలో ఆటగాళ్లతో సమాచార మార్పిడి సజావుగా జరగడం లేదనేది ప్రముఖంగా వినిపిస్తున్న ఆరోపణ. సీనియర్లు కాకుండా.. ఈ మధ్య కాలంలో జట్టులో చోటును సుస్థిరం చేసుకొన్న కొందరు క్రికెటర్లు గౌతీ తీరుపై అసంతృప్తిగా ఉన్నారని సమాచారం.

**అలా జరిగితే.. ఉద్వాసనే?**

'మరో టెస్ట్ ఆడాల్సి ఉంది. ఆ తర్వాత చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్. టీమిండియా ప్రదర్శన మెరుగుపడకపోతే మాత్రం కోచ్‌గా గంభీర్ పోస్టు ప్రమాదంలో పడినట్టేన'ని బోర్డు అధికారి ఒకరు చెప్పారు. మరోవైపు ప్రయోగాలు చేస్తుండడంతో జట్టులోని ఆటగాళ్లు కూడా అభద్రతా భావానికి లోనవుతున్నారని తెలుస్తోంది. బీసీసీఐలో ఖాళీ అయిన పదవులు భర్తీ అయిన తర్వాత.. భారత జట్టుపై కొన్ని నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉంది.

## రోహిత్ శర్మ రిటైర్ అయినా ఆశ్చర్యం లేదు: రవిశాస్త్రి

రాబోయే రోజుల్లో రోహిత్ శర్మ టెస్టు క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్నా.. దాంట్లో ఆశ్చర్యం ఏమీ ఉండబోదని మాజీ కోచ్ రవి శాస్త్రి అన్నారు. శుభమన్ గిల్ లాంటి యువ క్రికెటర్లు ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌లోని చివరి అయిదు ఇన్నింగ్స్‌లో రోహిత్ శర్మ అత్యధికంగా 10 రన్స్ కూడా చేయలేకపోయాడు. రేపటి నుంచి ప్రారంభం అయ్యే సిడ్నీ టెస్టుకు ముందు గురువారం జరిగిన మీడియా సమావేశానికి రోహిత్ రాకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. టెస్టు కెరీర్‌పై రోహిత్ ఓ నిర్ణయం తీసుకుంటాడని, ఒకవేళ అతను రిటైర్ అయినా షాక్ అయ్యేది ఏమీ లేదని, ఎందుకంటే అతనే యువకుడిగా మారడం లేదన్నారు. శుభమన్ గిల్ గత ఏడాది 40 యావరేజ్‌తో బ్యాటింగ్ చేశాడని, అలాంటి ప్లేయర్ వృధాగా ఉన్నాడని, ఇలాంటి సందర్భంలో రోహిత్ రిటైర్ అయినా ఆశ్చర్యం లేదన్నాడు. ఆసీస్‌తో సిరీస్‌లో రోహిత్ తన ఫీట్ మూమెంట్‌తో ఇబ్బందిపడినట్లు రవిశాస్త్రి తెలిపాడు. ఒకవేళ సిడ్నీ టెస్టులో ఆడితే, అప్పుడు రోహిత్ ప్రత్యర్థి బౌలర్లను టార్గెట్ చేసి పరుగుల వరద సృష్టించాలన్నాడు. అయిదో టెస్టును గెలిచి, సిరీస్‌ను సజీవంగా ఉంచాలన్నాడు.

## గేమ్ ఛేంజర్ ట్రైలర్ రిలీజ్




గ్లోబల్ స్టార్ రాంచరణ్ టైటిల్ రోల్ పోషిస్తోన్న చిత్రం గేమ్‌ఛేంజర్. శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు భామ అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ఈ మూవీని 2025 జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్‌ను లాంచ్ చేశారు మేకర్స్. కడుపునిండా వంద ముద్దలు తిన్న ఏనుగు ఒక ముద్ద వదిలి పెడితే పెద్దగా దానికొచ్చే నష్టమేం లేదు. కానీ అది లక్ష చీమలకు ఆహారం నేను మిమల్ని అడిగేది కూడా కేవలం ఆ ఒక్క ముద్ద మాత్రమే.. అంటూ మొదలైంది ట్రైలర్. మా పార్టీ సేవ చేయడానికే కానీ సంపాదించడానికి కాదంటూ సాగుతున్న డైలాగ్స్ అందరినీ ఆలోచింపజేసేలా సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. శంకర్ ఓ వైపు రాంచరణ్ అభిమానులకు కావాల్సిన ఎలిమెంట్స్ మిస్సవకుండా చూసుకుంటూనే.. మరోవైపు పొలిటికల్ టచ్ ఇస్తూ కట్ చేసిన ట్రైలర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. రాంచరణ్ మల్టీ షేడ్స్‌లో కనిపిస్తూ అభిమానులకు ఫుల్‌మీల్స్ అందించబోతున్నట్టు ట్రైలర్ క్లారిటీ ఇచ్చేస్తుంది. ఈ చిత్రంలో నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

రీల్

# ఫ్యాన్స్‌కు పూనకాలే..

నందమూరి బాలకృష్ణ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం డాకు మహారాజ్. ఎన్‌బీకే 109గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాబీ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. ఇందులో భాగంగా ముందుగా అందించిన అప్‌డేట్ ప్రకారం డాకు మహారాజ్ థర్డ్ సింగిల్ దబిడి దిబిడి సాంగ్ లాంచ్ చేశారు. అన్‌స్టాపబుల్ మాస్ బ్లాస్ట్ సాంగ్‌లో బాలకృష్ణ, ఊర్వశి రౌటేలా కాంబోలో సాగే స్టైలిష్ మాస్ డ్యాన్స్ అభిమానులకు పూనకాలు తెప్పించడం ఖాయమని విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను థమన్, వాగ్దేవి పాడారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశాడు.




ఈ చిత్రంలో బాబీ డియోల్ విలన్‌గా నటిస్తుండగా.. శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యాజైశ్వాల్, చాందినీ చౌదరి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ , సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టెక్సాస్‌లోని డల్లాస్‌లో జనవరి 4న Texas Trust CU Theatreలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన హై ఎనర్జిటిక్ FIERCE Track నెట్టింట వైరల్ అవుతోంది. దబిడి దిబిడి సాంగ్‌పై మీరూ ఓ లుక్కేయండి మరి.



ఇప్పుడు ఇండియన్ సినిమా అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రాల్లో బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ ఏదన్నా ఉంది అంటే అది ఖచ్చితంగా సూపర్ స్టార్ మహేష్ బాబు అలాగే దర్శక దిగ్గజం ఎస్ ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో చేస్తున్న సెన్సేషనల్ చిత్రం అనే చెప్పాలి. మహేష్ కెరీర్‌లో 29వ సినిమాగా మహేష్, రాజమౌళి కాంబినేషన్‌లో మొదటి సినిమాగా ఇది తెరకెక్కుతుంది. అయితే ఈ సినిమా ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న తరుణంలో మేకర్స్ గురువారం సైలెంట్‌గా ముహూర్త కార్యక్రమాలు చేసేసారు. హైదరాబాద్ లోనే అల్యూమియం ఫ్యాక్టరీలో చిత్రం ప్రధాన బృందం మాత్రమే ఈ ముహూర్త కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయితే ఎలాంటి ఫోటో లేదా వీడియో ఫుటేజ్‌ని చిత్ర యూనిట్ అధికారికంగా విడుదల చెయ్యలేదు. కానీ సినిమా అయితే నేడే ఆరంభం అయ్యింది. మరి అధికారికంగా అనౌన్సమెంట్ కోసం అభిమానులు ఇపుడు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అలాగే ఆల్రెడీ సోషల్ మీడియాలో కూడా ఫ్యాన్స్ ట్రెండింగ్ చేస్తూ అదరగొడుతున్నారు.

## రాజమౌళి, మహేశ్‌బాబు ప్రాజెక్ట్ షురూ!

## నేరెళ్ల ఇసుక మాఫియా బాధితులకు పరిహారం ఇచ్చారా?

### పోలీసులపై చర్యలు తీసుకున్నారా? వివరణ కోరిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిరిసిల్ల జిల్లా నేరెళ్ల, రామచంద్రాపురాలలో 8 మంది దళితులపై ఇసుక మాఫియా దాడి ఘటనపై దర్యాప్తు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. దాడి చిత్రహింసలకు సంబంధించి నమోదైన కేసు దర్యాప్తు పురోగతిని తెలియజేయాలంది. చీర్లవంచ, కొదురుపాక ప్రాంతాల నుంచి ఇసుక లారీలు, టిప్పర్లు తిరగడంతో ప్రమాదాలపై 2017 జులైలో దళితేలు నిరసన వ్యక్తం చేసిన సంఘటనలో 8 మంది దళితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు చిత్రహింసలకు గురి చేశారంటూ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మ ణ్, రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ పిల్స్ వేశారు. వీటిని చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం విచారించింది. బాధ్యులైన పోలీసులపై కేసు నమోదు చేశారో లేదో చెప్పాలని, బాధితులకు పరిహారం ఇచ్చారో లేదో చెప్పాలని, అసలు కేసు దర్యాప్తు ఏదశలో ఉందో చెప్పాలని పోలీసులను, ప్రభుత్వాన్ని ఆదేశించింది. తొలుత ప్రభుత్వ ప్లీడర్ వాయిదా వేయాలని కోరడంతో హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. దీంతో అదనపు అడ్వొకేట్ జనరల్ వచ్చి పోలీసులపై కేసు పెట్టామని చెప్పి వాయిదా అడిగారు. దీంతో విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా పడింది.

# తప్పుడు అభిప్రాయం సృష్టి

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది రైతు నాయకులు మీడియాకు బాధ్యతారాహిత్య ప్రకటనలు ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితిని మరింత జఠిలం చేస్తున్నారని ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. 'కొందరు రైతు నాయకులకు డల్లేవాల్ పట్ల ఉన్న నమ్మకాన్ని మాత్రమే మేం తనిఖీ చేస్తున్నాం' అని డివిజన్ బెంచ్ పేర్కొంది. పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ మాట్లాడుతూ అలాంటి ప్రయత్నాలు ఖండించదగినవని, అవి పరిస్థితిని తీవ్రతరం చేస్తాయన్నారు. రైతునాయకుడు డల్లేవాల్ దీక్షకు భంగం కలగకుండా వైద్యసహాయం అందజేసే ప్రయత్నాలను పంజాబ్ ప్రభుత్వం కొనసాగిస్తున్నదని చెప్పారు. పంజాబ్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, పంజాబ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) ఈ కేసులో వర్చువల్‌గా హాజరవుతున్న కారణంగా కోర్టు మెస్సేజ్ ఒక మార్గంలో వెళుతుందని ధర్మాసనం వెల్లడించింది. ఈ కేసు తదుపరి విచారణను సుప్రీంకోర్టు జనవరి 6కు వాయిదా వేసింది. పంటలపై కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టబద్ధమైన హామీ సహా పలు డిమాండ్ల పరిష్కారంపై కేంద్రానికి దిశానిర్దేశం చేయాలని కోరుతూ దాఖలైన తాజా పిటిషన్‌పై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసులు జారీచేసింది. ఈ విషయంలో రైతులు 2021వ సంవత్సరం నుంచి నిరసన కొనసాగిస్తున్నారు.

**మా నిరసన ఎంతకాలం కొనసాగుతుందనేది.. కేంద్రం చేతుల్లోనే : అభిమన్యు**

పార్లమెంటరీ ప్యానెల్ చట్టబద్ధమైన హామీని సిఫారసు చేసినందున తమ డిమాండ్లను ఆమోదించడంలో ఎటువంటి ఆటంకం ఉండదని, తమ ధర్నా (నిరసన)ను ఎంత కాలం కొనసాగించాలనేది కేంద్రం చేతిలోఉన్నదని గురువారం రైతు నాయకుడు అభిమన్యు కోహర్ అన్నారు. రైతు నాయకుడు జగ్‌జిత్‌సింగ్ డల్లేవాల్ ఆమరణ నిరాహారదీక్ష 38వ రోజుకు చేరుకోవడంతో కోహార్ మాట్లాడుతూ డల్లేవాల్ ఆరోగ్యం రోజు రోజుకూ క్షీణిస్తున్నదని, రైతుల కోసం ఆయన తన జీవితాన్ని ఫణంగా పెట్టారని తెలిపారు. ఖనౌరీశంభు సరిహద్దు పాయింట్ వద్ద నిరసన ఇంకెంతకాలం కొనసాగుతుంది అని కోహర్‌ను విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన మాట్లాడుతూ 'అది కేంద్రం చేతుల్లోనే ఉంది. ఒకవేళ వారు మా డిమాండ్లను పరిష్కరిస్తే' సమాధానం ఇచ్చారు. కొంత మంది రైతు నాయకులు మీడియాకు బాధ్యతారాహిత్య ప్రకటనలు ఇస్తూ తప్పుడు అభిఅభిప్రాయం సృష్టిస్తున్న ఫలితంగా పరిస్థితిని జఠిలం చేస్తున్నారని తప్పుపట్టింది. కోహర్ మాట్లాడుతూ తాము ఇంకా కోర్టు పరిశీలనకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. ఈరోజు ప్రొసీడింగ్స్‌ను అధ్యయనం చేయడం ముఖ్యం అని ఆయన ఖనౌరీలో చెప్పాడు. కేంద్రం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే డల్లేవాల్ భావాలను మాత్రమే రైతునాయకులు వ్యక్తీకరిస్తున్నారని కోహర్ చెప్పారు. 'రాజ్యాంగసంస్థలను మేం ఎప్పుడూ గౌరవిస్తాం' అని కోహర్ తెలిపారు.ఇటీవల జరిగిన ఒక సంఘటనను ప్రస్తావిస్తూ డల్లేవాల్ ఆరోగ్యం విషమించినప్పటికీ, కొన్ని నిమిషాలపాటు స్పృహతప్పి పడిపోయినప్పటికీ రైతుల సమస్యలను విచారించే ఒక ఉన్నత న్యాయస్థానం విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంప్రదింపులు జరుపుతున్నట్లు కోహర్ చెప్పారు. 'కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి)కు చట్టపరమైన హామీని పార్లమెంటరీ ప్యానెల్ సిఫారసు చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వం దానిని అమలు చేసేలా సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వాలని మాత్రమే మేం చెప్పాం' అని కోహర్ వెల్లడించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్నామని ఆయన చెప్పారు. డల్లేవాల్ జీ చేపట్టిన ఆమరణనిరాహార దీక్ష 38వ రోజుకు చేరుకుంది. ఒక సీనియర్ రైతు నాయకుడు తన ప్రాణాలను ఫణంగా పెట్టాడు. రైతులకు దర్శనం ఇవ్వాలనే ఆయన మనోభావాలను గౌరవిస్తూ జనవరి 4న ఖనౌరీ మోర్చా వద్ద రైతులు భారీ జనసమీకరణను ఉద్దేశించి డల్లేవాల్ ఒక ముఖ్యమైన సందేశం ఇవ్వనున్నారు' అని కోహర్ చెప్పారు. రిటైర్డ్ డిజిపి జస్కరన్ సింగ్ నేతృత్వంలోని పంజాబ్ ప్రభుత్వ బృందం గత కొద్ది రోజులుగా సమావేశం అవుతోందన్న విషయాన్ని ప్రస్తావించగా ఖనౌరీ వద్ద రైతు నాయకులతో చర్చలు జరుపుతున్నప్పటికీ దానిపై స్పష్టత వస్తే రెండు రైతు ఫోరమ్స్ ఒక స్పష్టమైన వైఖరిని ప్రకటిస్తాయని కోహర్ చెప్పారు. రైతు నేత కోహర్ మాట్లాడుతూ ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న డల్లేవాల్ బరువును కోల్పోతున్నారని, ఆయన రక్తపోటులో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, చాలా రోజుల పాటు దీక్ష చేస్తున్నందువల్ల కిడ్నీ, లివర్‌పై వ్యతిరేక ప్రభావం పడిందని కోహర్ తెలియజేశారు.

# ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును మొత్తం కేంద్రమే చేపట్టాలని కోరాం

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును మొత్తం కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని కేంద్ర మంత్రి గడ్కరీని తెలంగాణ సిఎం రేవంత్‌రెడిడ కోరినట్లు ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ అయితే ముందు ల్యాండ్ సేకరించాలని కేంద్ర మంత్రి తమ కు సూచించారన్నారు. దోచుకునే, దాచుకునే ఆలోచన తమకు లేదని స్పష్టం చేశారు. ఇష్టా రీతిన ప్రాజెక్టు కాస్ట్ పెంచారు కాబట్టే..7 వేల కోట్ల ప్రాజెక్టులో 12 వేల అవినీతి జరిగిందని కెటిఆర్ అంటున్నాడని విమర్శించారు. కెటిఆర్ లాగే అందరూ చేస్తారనుకుంటున్నారన్నారు. కెసిఆర్ లా ప్రతిపక్షంను లేకుండా చేయాలనుకోవడం తమకు లేదు.. బలమైన ప్రతిపక్షం ఉండాలనుకుంటున్నాం అని స్పష్టం చేశారు. కెసిఆర్ ఎలాగూ బయటకు రాడు.. హరీష్ రావు, కెటిఆర్, కవిత అయినా సమర్ధవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తే మంచిదని సూచించారు. 2025లో అయినా బిఆర్ఎస్ నేతలకు జ్ఞానోదయం కలగాలి అని అన్నారు. రైతు భరోసా విషయం లో బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుందని తెలిపారు.కెసిఆర్ అనాలోచిత నిర్ణయం వల్ల రైతు బంధులో 22 వేల కోట్ల రూపాయలు అనర్హులకు ఇచ్చారని తెలిపారు. ఈ ఫార్ములా కేసులో కెటిఆర్ రోజు కో మాట మాట్లాడుతున్నాడని, ఒకరోజు సంబంధం లేదు అంటాడు.. మరోక రోజు అధికారులకు సంబంధం లేదు.. అంతా నేనే చేసాను అంటాడని అని పేర్కొన్నారు. పుష్ప అరెస్ట్ తో రేవంత్ రెడ్డి పాన్ ఇండియా సిఎం అయ్యారన్నారు.

# సిఫారసులు అమలు

(మొదటి పేజీ తరువాయి)

ఏడాది ఆగస్టు 2న అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. పరీక్ష సమగ్రతను రాజీ చేసే వ్యవస్థాగత లీక్ లేదా దుర్వినియోగాన్ని సూచించడానికి తగిన మెటీరియల్ ప్రస్తుతం రికార్డులో లేదని తెలిపింది. ఇది నేషనల్ టెస్ట్ ఏజెన్సీ పనితీరును సమీక్షించడానికి, నీట్ యుజిని పారదర్శకంగా, అక్రమాలకు తావులేకుండా చేయడమే కాకుండా పరీక్ష సంస్కరణలను సిఫారసు చేయడానిక భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఏడుగురు సభ్యుల నిపుణుల ప్యానెల్ చెల్లింపును విస్తరించింది. కేంద్రం నియమించిన కమిటీ తన నివేదికను దాఖలు చేసిందని, ప్రభుత్వం ప్యానెల్ చేసిన అన్ని సిఫారసులనూ అమలు చేయనున్నదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా గురువారం న్యాయమూర్తులు పిఎస్.నర్సింహ్మా, మనోజ్ మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనానికి చెప్పారు. 'మేం అన్ని సిఫారసులను అమలు చేయబోతున్నాం. ఆ విషయాన్ని మేం ఆరు నెలల తర్వాత జాబితా చేయవచ్చు' అని లా ఆఫీసర్ చెప్పారు. అనంతరం విషయం మూడు నెలలపాటు వాయిదా వేయబడింది. ఈ స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్‌ఎల్‌పి)ను ఏప్రిల్ నెలలో జాబితా చేయండి అని ధర్మాసనం తెలిపింది. ప్రశ్నల ముద్రణ వంటి సమస్యలకు సంబంధించిన కొన్ని వివరాలు ఉన్నందున మొత్తం నివేదికను రికార్డులో ఉంచలేదు. గత ఏడాది అక్టోబరు 21న పరీక్షల సంస్కరణలపై కేంద్రం నియమించిన ఏడుగురు సభ్యుల నిపుణు ల కమిటీ తన నివేదికను దాఖలు చేసేందుకు అ త్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు గడువు పొడిగించింది. నీట్ యుజి అడ్మీషన్ అండర్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ప్రోగ్రామ్‌ల కోసం నేషనల్ టెస్ట్ ఏజెన్సీచే ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతున్నది. రాధాకృష్ణన్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల నిపుణుల ప్యానెల్‌లో రణ్‌దీప్ గులేరియా, బిజె.రావు, రామమూర్తి కె.పంకజ్ బన్సాల్, ఆదత్య మిట్టల్, గోవింద్ జైస్వాల్ ఉన్నారు. కమిటీకి కేంద్రం అప్పగించిన పనులతో పాటు పరీక్షల భద్రత, నిర్వహణ, డేటా సురక్షిత సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చడం వంటి అంశాలతోపాటుగా కమిటీ పంపుతుందని ధర్మాసనం పేర్కొంది. ఎంబిబిఎస్, బిడిఎస్, ఆయుష్, ఇతర సంబంధిత కోర్సులలో ప్రవేశాల కోసం 2024లో 23లక్షల మంది విద్యార్థులు నీట్ యుజిని తీసుకున్నారు. గత ఏడాది నవంబరులో తాజా నీట్ యుజి 2024పరీక్షకు నిరాకరించిన ఆగస్టు 2తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కొట్టివేసింది.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com